సంపుటి: 36
సంచిక: 1

ఫోన్ నెం.
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

ఫిబ్రవరి, 1983

Kattukolu Subba Reddy
Home Library Pedagogirala.

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

మీ ఉత్తరాలు

డిసెంబరు పత్రికలో వసుంధర గారి 'జీవన్ముక్తి' చాలా బాగుంది. మృత్యువును జయించిన మృత్యుంజయరావు పాత్ర ఎంత బాగుంది. వసుంధర గారికి నా అభినందనలు. 'సాగరలోయ' సీరియల్ ప్రతిసారి ఒక విచిత్రమైన మలుపు తిరుగుతుంది.

—ఎ.డి. షఫియోద్దీన్, కొత్తగూడెం.

'సాగరలోయ' సీరియల్ సూపర్ ఫాస్టుగా సాగుతోంది. కథల్లో 'పచ్చని జీవితాల్లో చిచ్చు' అపనకే హైలైట్. విద్వాన్ షీలాదేవిగారికి మా అభినందనలు. పోతే—ముసుగు మనిషి, కరాటే దొంగ, వసుంధర గారి 'క్లూ' మరీ మరీ బావున్నాయి.

—గంగ పుత్ర సత్యనారాయణ, కౌకుంట్ల రైల్వేకాలనీ.

అజీజ్‌గారి 'కరాటే దొంగ' క్లైమాక్స్‌లో నూతన మలుపు తిరిగింది. 'మృత్యుతార' ఊహించని విధంగా ఐపోయింది. బొమ్మిడి అచ్చారావుగారి సీరియల్ 'సాగరలోయ' చాల ఆసక్తిగా ఉంటున్నది. సప్లిమెంట్‌లో వసుంధర గారి 'గజ దొంగ', సికిందర్‌గారి 'అది కక్ష—ఇది శిక్ష' హైలైట్స్. "రక్తపు ఉేర్లు" గొప్ప సస్పెన్స్‌గా సాగుతోంది.

—తోట కేశవరావు, సమనస.

జనవరి అపనలో మధుచక్రవర్తి గారి 'జైలు గంటలు' కథ శైలి అద్భుతంగా వుంది. సప్లిమెంట్‌లో 'భారతనారీ జిందాబాద్', 'మరణ శాసనం' సూపర్బ్‌గా వున్నాయి.

—యన్. శివానంద్, బెల్లంపల్లి.

అనురాగ దాంపత్యంలో హాలాహలం, కాటు మరచిన కాల సర్పం, జైలు గంటలు కథలు అద్భుతంగా వున్నాయి. సాగర లోయ, రక్తపు ఉేర్లు సీరియల్ రెండూ రెండే. పాఠకులకు ఊపిరి సలపనియ్యటం లేదు.

—జె. కాత్యాయిని, గుంటూరు.

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. ప్లస్ - మైనస్—వసుంధర
19. దారితప్పిన ప్రేమలేఖ—రాజేష్‌బాబు
33. దెబ్బతిన్న పులి—విశ్వమోహిని
41. ఇండియా దాటని పొగాకు—ప్రతాప రవిశంకర్
50. పీనాసికి ఖర్చెక్కువ—జొన్నలగడ్డ రామలక్ష్మి
63. ఎగిరే మనిషి—శ్రీసాయిశ్రీ
80. కొత్త అనుభవం—బి. రాజేశ్వరి
98. శెట్టిగారి శవం—ఇమంది రామారావు
118. జారిపడిన జవ్వని—సికిందర్
140. డిస్మిస్ ఆర్డర్—జె. రామలక్ష్మి
153. సాగర లోయ (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

నవలలు (సప్లిమెంట్)

3. ఆకుపచ్చ చీర—వసుంధర
37. ఎర్రగాజు—టెంపోరావు!
77. నెత్తురు చిమ్మిన గుడ్డలు—సికిందర్
127. హంతకు లెందరో?—బొమ్మిడి అచ్చారావు
169. రక్తపు టేర్లు—(సీరియల్)—వసుంధర.

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

ప్లస్-మైనస్

వసుంధర

దేశంలో జాతీయ పరిశోధనా సంస్థలెన్నో వుండివుండ వచ్చు. కానీ ఆంధ్రదేశంలో నెలకొల్పబడిన "అంత ర్యామి" పరిశోధనా సంస్థ కొక ప్రత్యేక స్థానం వున్నది. అది జాతీయ సంస్థ కాదు. రమణమూర్తి దాని అధినేత.

దేశమంతటా విస్తరించుకున్న అతికొద్ది ప్రముఖ వ్యాపార సంస్థల్లో ఓ సంస్థకు చెందినవాడు రమణమూర్తి.

విజ్ఞానశాస్త్రం అతడి వ్యాపారం కావడంవల్ల అతడు "అంతర్యామి" సంస్థను నెలకొల్పాడు. ఈ సంస్థ దేశాని కెన్నో విధాల తోడ్పడుతున్నది.

దేశంలో ఎందరో మేధావులు తమ ప్రతిభను చూపించుకునేందుకు సరైన అవకాశం దొరకక—విదేశాలకు తరలిపోతున్నారు. అటువంటివారికి ఆకర్షణీయమయిన వేతనాలిచ్చి—వారి ప్రతిభకు తగిన ప్రాజెక్టుల నిస్తున్నది. సైంటిస్టులు కనిపెట్టిన ముఖ్యవిశేషాలను వెంటనే పరిశ్రమలకు తరలించే ఏర్పాట్లున్నవి.

తండ్రి, తాత, సోదరులు, తదితర బంధువర్గం—అందరూ వ్యాపార రంగంలో మునిగి తేలుతున్నప్పటికీ రమణమూర్తి మాత్రం చదువుమీదనే శ్రద్ధ పట్టి ఫిజిక్సులోనూ, యింజనీరింగులోనూ కూడా డాక్టరేటు డిగ్రీలు తీసుకున్నాడు. విదేశాలు వెళ్ళి శిక్షణ పొందాడు. అంతర్యామి స్థాపించాడు.

అంతర్యామికి ప్రచారంకంటే కార్యసాధనే ముఖ్యం. అందులోనూ ఆంధ్రదేశంలో ఆంధ్రుడిచేత స్థాపించబడింది. ఈ కారణంగా నెలకొల్పబడిన పది సంవత్సరాల వరకూ అంతర్యామి గురించి దేశంలోని నిరుద్యోగ విజ్ఞానశాస్త్ర పట్టభద్రులకు మించి యితరులకు అట్టే తెలియదు.

అయితే ఇటీవల అంతర్యామికి చాలా పెద్ద పేరు వచ్చింది. దేశమంతటా ప్రాచారం లభించింది.

దేశంలో జరగబోతున్న ఆసియా క్రీడోత్సవాల సందర్భంగా అంతర్యామి సంస్థ ఓ కృత్రిమ ఉపగ్రహాన్ని రూపొందించింది. ఆ ఉపగ్రహం భూమిచుట్టూ పరిభ్రమిస్తూ టెలి కమ్యూనికేషన్ వ్యవహారాలకు సంబంధించి చాలా

వ్యవహారాలు చక్కబెడుతుంది. ముఖ్యంగా దేశమంతటా టెలివిజన్ ప్రసారాలు చేయడానికి చక్కగా వుపయోగపడుతుంది.

ఈ ఉపగ్రహం ప్రత్యేకత ఏమిటంటే—ఇది పూర్తిగా భారతదేశంలో, భారతీయులచేత తయారుచేయబడినది. అంతరిక్ష కక్ష్యలోనికి వదలడానికి ఇతర దేశస్థుల సహకారం అవసరంలేదు. అన్నింటికీ మించి దీని ఖరీదు చాలా స్వల్పం. రమణమూర్తి మేధాశక్తికి నిదర్శన మది.

రమణమూర్తి ముందు ప్రధానమంత్రిని కలుసుకుని తన పరిశోధనా వివరాలు అందజేశాడు.

అతడిది జాతీయ సంస్థ కాకపోవడంవలన ముందు ప్రభుత్వం గింజుకుంది. కానీ అల్పార్థమున అనల్ప ప్రయోజనా లున్న ఈ ఉపగ్రహాన్ని కొనుగోలు చేయాలనే చివరికి నిర్ణయించింది.

అప్పుడు అంతర్యామి గురించి దేశానికి తెలిసింది. అంతర్యామితోపాటే రమణమూర్తి గురించి తెలిసింది. ఇంక ఇంటర్వ్యూలు ప్రారంభమైనాయి.

రమణమూర్తి గురించీ, అంతర్యామి గురించీ, ఉపగ్రహం గురించీ సామాన్య ప్రజలందరూ తెలుసుకున్నారు. యెక్కడ చూసినా వాటికి సంబంధించిన ఫోటోలు....

ఈ వార్త దేశంలో ఒక రకం సంచలనాన్ని కలిగిస్తే విదేశాల్లో మరొక రకమైన సంచలనాన్ని కలిగించింది. ఒక భారతీయుడు—పూర్తి భారతీయ సాంకేతిక నైపుణ్యంతో కారుచౌకగా ఒక ఉపగ్రహాన్ని నిర్మించడం—ముఖ్యంగా సంపన్న పాశ్చాత్య దేశాలకు నచ్చలేదు.

ఈ పాశ్చాత్య దేశాల ప్రత్యేకత యేమిటంటే వారు

ఎప్పటికప్పుడు విజ్ఞానశాస్త్రంలో ప్రగతిని సాధిస్తూంటారు. మన దేశానికి సహాయసహకారాల పేరిట వారందజేసేది మాత్రం పది పదిహేను సంవత్సరాలు వెనుకబడిన విజ్ఞానం. బడుగుదేశాలుగానే వుంచడానికి వారు పన్నే యెన్నో మాయోపాయాల్లో యిది ఒకటి.

ఇప్పుడు రమణమూర్తి సాధించిన ప్రగతి వారి ప్రగతికి సామీప్యంలో వున్నది. అందువల్ల వారతడి ఉపగ్రహాన్ని ముందుగా పరీక్షించి కొన్ని వివరాలు తెలుసుకుంటామని అడిగారు. అందుకు రమణమూర్తి అభ్యంతరం చెప్పలేదు. అతడికి తాను రూపొందించిన ఆ ఉపగ్రహంపై అంతులేని నమ్మక మున్నది.

ఎన్నో విదేశీ శాస్త్రజ్ఞుల బృందాలు వచ్చి ఉపగ్రహం విషయమై వివరాలు తెలుసుకుని వెళ్ళాయి. అవన్నీ పేపర్లో వచ్చాయి. అంతా రమణమూర్తిని అభినందించారు. కానీ అమెరికన్ శాస్త్రజ్ఞులు మాత్రం—

"ఈ డిజైన్లో చిన్న లోపమున్నది. ఆ కారణంగా భూమి చుట్టూ అయిదారు రోజులు పరిభ్రమించినాక—టెలివిజన్ ప్రసారాలకు యిది పనికి రాక పోవచ్చును........" అన్నారు.

ఈ వార్తకు కూడా దేశంలో ప్రాచుర్యం లభించింది.

రమణమూర్తి అమెరికన్ శాస్త్రజ్ఞులను అడిగాడు— ఆ లోపం గురించిన వివరాలు చెప్పమని.

"లోపం యిది అని చెప్పలేము—" అన్నారు వాళ్ళు.

లోపం చెప్పడం వారి కిష్టంలేదా—లేక ఈ ఉపగ్రహం కక్ష్యలోకి వెళ్ళడం వారి కిష్టంలేదా—అన్న విషయం రమణమూర్తికి బోధపడలేదు. అందుకని—"ఇందులో

ఏ లోపమూ లేదు. ఆ విషయం యెలాగూ ఋజువవు తుంది—" అన్నాడు.

ప్రభుత్వం మాత్రం అమెరికన్ నిపుణుల అభి ప్రాయాన్ని లెక్కచేయలేదు. రమణమూర్తికి అవసర మయిన అన్ని రకాల సహాయ సహకారాలూ అంద జేసింది.

ఒక శుభముహూర్తాన ఉపగ్రహం అంతరిక్షంలోకి వదలబడింది. అంత వరకూ అన్నీ సక్రమంగానే జరి గాయి.

ఉపగ్రహం భూమిచుట్టూ పరిభ్రమించడం ప్రారంభించిన కొద్దిసేపట్లోనే తన కార్యక్రమాలనూ ప్రారంభించింది. గ్రౌండ్ కంట్రోల్ లాబరేటరీ చెప్పినట్లు బుద్ధిగా వింటూ అన్ని పనులనూ సక్రమంగా చేసుకుని పోతోంది.

రమణమూర్తికి ప్రభుత్వం పెద్ద సన్మానసభ ఏర్పాటు చేసింది. రమణమూర్తికోసం దేశంలో అంతవరకూ లేని కొత్త బహుమతిని నెలకొల్పింది. దేశంలో సైన్సు వర్ధిల్లా లని కాంక్షించి అందుకు అవసరమైన వాతావరణం నెల కొల్పి—దేశంలోని పరిశోధనా సంస్థలను ఆధునిక దేవా లయాలుగా అభివర్ణించిన జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఒక కొత్త బహుమతిని సైన్సుకోసం నెలకొల్పారు. బహు మతి విలువ పదిలక్షల రూపాయలు. ప్రారంభ సంవత్స రానికి రమణమూర్తికి ఆ బహుమతి యివ్వాలని నిర్ణయ మయింది.

ఒక సైంటిస్టును—ఒక దేశం—అలా గౌరవించడం అపూర్వం—అనిపించే విధంగా అద్భుతంగా ఆ వేడుక జరిగిపోయింది.

దేశంలోని అన్ని ప్రాంతీయ భాషల్లోనూ—అన్ని

రకాల పత్రికలూ రమణమూర్తి ఫోటోలు వేశాయి. ఒక్క రోజులో అతడు సినిమాస్టార్సుకు మించి పాప్యులర్ అయి పోయాడు.

ఇటువంటి ఉపగ్రహాల నిర్మాణంలో తమకు సాయపడ వలసిందిగా ఎన్నో బడుగుదేశాలు భారతదేశాన్ని కోరాయి. కొన్ని సంపన్న అరబ్ దేశాలు కూడా తమ కోరికను రహస్యంగా వెలిబుచ్చాయి.

భారతదేశానికి విదేశీమారక ద్రవ్యం సంపాదించడానికి ఓ కొత్తమార్గం లభించింది.

2

రమణమూర్తి ఈ సన్మానాలకూ, ప్రచారానికీ తట్టుకొన లేకపోతున్నాడు. అతడు ఉపగ్రహానికి సంబంధించిన వ్యవహారాన్ని గ్రౌండ్ కంట్రోలింగ్ స్టాఫ్‌కు పూర్తిగా వదిలి పెట్టి తన యేకాంత సమయాన్ని భార్యతో గడుపు తున్నాడు.

అతడి భార్య సత్యవతి—భర్తకు లభించిన యీ గౌరవానికి పొంగిపోతోంది. అతడి కారణంగా ఆమె పేరు కూడా పదిమందికీ తెలిసింది. ఆమె ఫోటోలూ పత్రికలలో వచ్చాయి.

"ఇంత పేరు భరించడం కష్టం సత్యా!" అన్నాడు రమణమూర్తి.

"ఏం?" అన్నదామె.

"ఈ పేరు నా పరిశోధనలనే దెబ్బతీస్తుందనే భయం కలుగుతున్నది—"

"ఎందుకని?"

"నా చుట్టూ తిరిగే జనం ఎక్కువయ్యారు. రోజూ ఎందరో పత్రికల వాళ్ళు వస్తున్నారు. ఒక ప్రముఖపినీ

నిర్మాత నా వద్దకు వచ్చి నన్ను హీరోగా పెట్టి సినిమా తీయా లనుకుంటున్నట్లు చెప్పాడు. జనాల కింత వేలం వెర్రి ఏమిటో నాకు అర్ధం కాకుండా వుంది—" అన్నాడు రమణ మూర్తి.

"ఇన్ని కోట్ల సామాన్యుల్లో గొప్పవాళ్ళు యెందరో లేరుకదండీ—అందుకే వాళ్ళకు ఆ వెర్రి........" అంది సత్యవతి.

"నా భయం అదికాదు. అభిమానం ఎక్కువగా వున్న చోట...." ఆగిపోయాడు రమణమూర్తి.

"ఏమిటండీ...." అంది సత్యవతి.

"గ్రాపులో ఒక గీతను గీసి ఎక్స్‌యాక్సిస్ అంటాము. అందులో ఓ పాయింటును గుర్తించి అది ఆరంభం అంటాము. ఆరంరభంలో సున్నాయే గదా వుండేది. ఆ తర్వాత మాకు తోచిన విధంగా సున్నాకు కుడిపక్కగా ప్రతి సెంటిమీటరుకూ ఓ నంబరు ఇస్తాం. మొదటి సెంటి మీటరుకు అయిదు నంబరు యిచ్చామనుకో రెండో సెంటి మీటరు పది అవుతుంది. మూడవ సెంటీమీటరు పదిహేను అవుతుంది. సున్నాకు కుడివైపు యే విధంగా నంబర్లి చ్చామో ఎడమవైపూ అలాగే యివ్వాలి. అంటే సున్నాకు కుడి వైపు, యెడమ వైపు కూడా ఒకే సెంటిమీటరు దూరంలో చూసుకుంటే అయిదు అంకె వుంటుంది. కానీ రెండు అంకెలకూ ఓ పెద్ద తేడా వుంది...."

"ఏమిటది?" అంది సత్యవతి ఆత్రుతగా.

"ఒకటి ప్లస్సు, యింకొకటి మైనస్సు....అంతే తేడా! ఇప్పుడు ప్రజలు నాపై చూపుతున్న అభిమానం ద్వేషంగా అసహ్యంగా మారిపోతే నేనేమైపోతానా అని భయపడు తున్నాను...." అన్నాడు రమణమూర్తి.

"అలా యెందుకు జరుగుతుం దనుకుంటున్నారు?"

"మన డిజైన్లో యేదో లోపముందన్నారు అమెరికన్ నిపుణులు. వారి అభిప్రాయంమీద నా కెంతో గౌరవ మున్నది. కానీ ఆ లోపమేమిటో వారు చెప్పలేదు. ఎంత శోధించినా నా కే లోపమూ కనబడలేదు...." అన్నాడు రమణమూర్తి.

అతడి భయం వృధాపోలేదు.

సరిగ్గా ఆరురోజులకు ఉపగ్రహం టెలివిజన్ ప్రసారాలు చేయడం ఆపివేసింది. గ్రౌండ్ కంట్రోల్ స్టాఫ్ యెంత ప్రయత్నించినా ఆ లోపం సవరించబడలేదు. రమణమూర్తి తనూ వెళ్ళి కంట్రోల్ రూంలోనే కూర్చున్నాడు.

అప్పటికి అసియా క్రీడోత్సవాల హడావుడింకా ఆర్నెల్లున్నది.

రమణమూర్తి ప్రపంచంతో నిమిత్తం లేకుండా అక్కడే గ్రౌండ్ కంట్రోల్ రూంలో కూర్చున్నాడు.

పొరపాటు యెలా జరిగింది? యెక్కడ జరిగింది?

అమెరికన్సు ముందే కనుక్కోగలిగిన ఆ లోపం తాను, తన వాళ్ళు — యెందుకు కనుక్కోలేక పోయారు....?

ఎలాగయినా అది పట్టుకోవాలి. ఉపగ్రహం మళ్ళీ పని చేసేలా చేయాలి?

రెండురోజులు నిర్విరామంగా కృషి చేశాక ఏం జరిగిందో గ్రహించగలిగాడు రమణమూర్తి.

జరిగినదిదా? అమెరికన్సు లోపాన్ని గ్రహించగలగడం లోని మర్మమిదా? ఈ విషయం తను ముందుగా ఎందుకూహించలేకపోయాడు?

ముందు తన లోపాన్ని సవరించాలి? ఆ తర్వా తనే.........

కంట్రోల్ రూంలో వారం రోజులు గడిపాడు రమణ మూర్తి. అతడెంత ప్రయత్నించినా, అతడి స్టాఫ్ అతడి కెంతగా సహకరించినప్పటికి—ఆ లోపం సవరించబడ లేదు.

ఈ లోగా ప్రధాన మంత్రి నుంచి అతడికి కబురు వచ్చింది.

"ఇది చాలా అర్జంటు విషయం. మీ ఉపగ్రహాన్ని మేము నమ్మకోవచ్చంటారా? ఆసియా క్రీడోత్సవాల టెలివిజన్ ప్రసారం గురించి ఏం చేయాలి?" అన్నది ప్రధానమంత్రి ప్రశ్న.

"శాయశక్తులా ప్రయత్నిస్తాను—" అన్నాడు రమణ మూర్తి.

"మీ శక్తిమీద మాకు నమ్మకముంది. కానీ........" ప్రధానమంత్రి యేదో చెప్పాలని చెప్పలేక ఆగిపోవడం జరిగింది.

"నా శక్తిమీద నాకూ నమ్మకముంది, కానీ........" అని ఆగిపోయాడు రమణమూర్తి. విషయం రూఢిచేసుకో కుండా తను చెప్పదల్చుకున్నది చెప్పడం సబబు కాదేమో నని అతడికి అనిపించింది.

"ఇంటెలిసాట్‌ను హైర్ చేస్తే?" ప్రధానమంత్రి సూచన.

ఇంటెలిసాట్ అంతరిక్ష కక్ష్యలో భూమిచుట్టూ పరి భ్రమిస్తున్న అమెరికన్ ఉపగ్రహం. అమెరికన్నుకు భారత దేశానికి వచ్చిన ఆసియా క్రీడోత్సవాల టెలివిజన్ ప్రసా రాల యిబ్బందిపై సానుభూతి వున్నది. తక్కువ ధరకు

తమ ఉపగ్రహాన్ని అద్దెకిచ్చి ఆదుకొనడానికి వారు సిద్ధంగా వున్నారు.

"ఉంటారు. నాకు తెలుసు!...." అన్నాడు రమణ మూర్తి.

"మనకేమయినా విషయాలు తెలిస్తే అవి మనలోనే వుంచుకొనడం మంచిది—" ప్రధాన మంత్రి మాటల్లో హెచ్చరిక వున్నది.

రమణమూర్తి అక్కడనుంచి బయటపడ్డాడు. అతడి మనసు కుతకుత లాడపోతున్నది.

ఈ వార్త పత్రికలకు యెక్కింది. భారత ఉపగ్రహం సరిగ్గా పని చేయని కారణంగా—ఆసియా క్రీడోత్సవాల కోసం అమెరికన్ ఉపగ్రహాన్ని భారతదేశం ఒక సంవత్సరంపాటు తగు మూల్యాన్ని చెల్లించి వాడుకుంటుందని అన్ని పత్రికలూ మొదటిపేజీలో వ్రాశాయి.

కొన్ని పత్రికలు—భారతీయ శాస్త్రజ్ఞుల మిడిమిడి జ్ఞానం ఫలితంగా— దేశానికి అపార నష్టం వాటిల్లినట్లు వ్రాశాయి. అది కొంతవరకూ సమంజసంగానే వుంది. ఎందుకంటే ఉపగ్రహ నిర్మాణానికి చాలా వ్యయమయింది. అదంతా దేశమే భరించింది. చివరకది అసలు పనికి రాకుండా పోయింది.

రెండు రోజుల్లోనే వార్తాపత్రిక లీ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాయి. అంతర్యామి సంస్థ దేశానికి నష్టపరిహారం చెల్లించాలని కొందరూ, రమణమూర్తి కివ్వబడిన బహుమతిని వెనక్కి తీసుకోవాలని మరి కొందరూ....యిలా రక రకాలుగా పత్రికల్లో వ్రాయ సాగారు....

"ఏమండీ— మీ రనుకున్నట్లే జరిగింది...." అంటూ

భర్తవద్దకు పోయింది సత్యవతి.

"చెప్పానుగా—ప్లస్ మైనస్సు అయింది...." అన్నాడు రమణమూర్తి.

"ఇప్పుడు మీరేం చేస్తారు?"

"ప్రభుత్వ నిర్ణయంకోసం వేచి వుంటాను—" అన్నాడతడు.

"మీకు బహుమతిగా యివ్వబడిన మొత్తాన్ని వెనక్కు తిరిగి యిచ్చేస్తే గౌరవంగా వుంటుందేమో!" అన్నది సత్యవతి.

"అలా చేస్తే నేను నా తప్పొప్పుకున్నట్లవుతుంది. నిజానికి నా వల్ల ఏ తప్పూ జరగలేదు—" అన్నాడు రమణమూర్తి.

"మీరు తప్పు చెయ్యకపోవచ్చు. కానీ మీకు బహుమతి యెందుకిచ్చారో ఆ కార్యం ఫెయిలయింది. చెయ్యని తప్పునుకూడా ఒప్పుకోవడం మహానుభావుల లక్షణం...." సత్యవతి యింకా యేదో చెప్పబోగా భర్త ఆమెను ఆపాడు.

"ఓకే—ఇట్సాల్‌రైట్. బహుమతి పొందే అర్హత నాకు లేదు. డబ్బు వెనక్కిచ్చేస్తాను. అయితే నా కారణంగా ప్రభుత్వానికి ఉపగ్రహ నిర్మాణానికై నూటయాభై లక్షలు అయింది. దానికీ నేను బాధ్యత వహించాలి...." అన్నాడు రమణమూర్తి తాపీగా.

సత్యవతి గుండెలు బాదుకుని—"మిడి మిడి జ్ఞానంతో దేశాన్ని ముంచేశారు మీరు" అంది.

"అదే మాట—ప్రభుత్వం అనేదాకా వేచి ఉంటాను" అన్నాడు రమణమూర్తి సాలోచనగా.

సరిగ్గా రెండు రోజుల్లో ప్రభుత్వం పత్రికల ప్రకటన

లన్నీ ఖండించింది. అంతర్యామి నిర్వహించిన ఉప గ్రహంలో ఏ లోపమూ లేదనీ, దురదృష్టవశాత్తూ అది ఫెయిలయిందనీ కేంద్ర మంత్రివర్యులు సెలవిస్తూ, అలాంటిదే మరో ఉపగ్రహాన్ని నిర్మించవలసిందిగా తాము అంతర్యామిని కోరుతున్నట్లు ప్రకటించింది.

ఈ వార్త దేశంలో మరింత సంచలనాన్ని కలిగించింది.

అంతర్యామి సంస్థకు ప్రధాన మంత్రితో లాలూచీ ఉన్నదా? ఇందులో రాజకీయ ప్రయోజనాలున్నవా?

ఎన్నో దేశాలు కృత్రిమ ఉపగ్రహాలను జయప్రదంగా అంతరిక్షంలోనికి ప్రవేశపెడుతూంటే — భారత ఉప గ్రహం విషయంలో దురదృష్టమేమిటి? ఆపైన అటువంటి ఉపగ్రహాన్ని మరొకటి నిర్మించాలనుకోవడం ఎంత హాస్యాస్పదం?

చాలామందికి బాధగా వున్న విషయం రమణమూర్తికి చెడ్డపేరు రాలేదని. కొందరైతే ఈ విషయమై సుప్రీం కోర్టుకి వెళ్ళాలనుకున్నారు. ఆ విధంగా కొన్ని అప్పీల్సు కూడా వెళ్ళాయి.

మరో వారం రోజుల్లో సుప్రీంకోర్టు నుంచి ఒక ప్రకటన వచ్చింది—ఉపగ్రహం విషయమై ఎటువంటి ఫిర్యాదులనూ దేశంలోని ఏ న్యాయస్థానమూ పరిశీలించదనీ, అందుకు డిఫెన్సుకు సంబంధించిన కొన్ని ఆంతరంగిక వ్యవహారాలు కారణమనీ!

ఈ వార్త ఇంకా సంచలనాన్ని కలిగించింది.

3

సత్యవతి భర్తను ఆశ్చర్యంగా అడిగింది—"మీరు అధికార పక్షానికి లంచమిచ్చారా?"

"లేదు. నాలోనూ నా ఉపగ్రహంలోనూ తప్పులేదని

ప్రభుత్వానికి ఖచ్చితంగా తెలుసు...."

"మరైతే అదెందుకు పనిచేయడం లేదు?"

"అది పనిచేయడం లేదని ఎవరన్నారు? ఒక్క టెలివిజన్ ప్రసారాలు మినహాయిస్తే మిగతా అన్ని కార్యక్రమాలూ అది సక్రమంగా నిర్వహిస్తోంది...."

"టెలివిజన్ ప్రసారాలు పనిచేయక పోవడం లోపం కాదా?"

"లోపమే! కానీ...." ఒక్క క్షణం ఆగాడు రమణమూర్తి.

"ఊఁ" అంది ఆత్రుతగా సత్యవతి.

"అమెరికన్సు ఆ లోపాన్ని సృష్టించారు. భూమిచుట్టూ తిరిగే ఏ ఉపగ్రహాన్నయినా అదుపు చేయగల శక్తి వారికి వున్నది. టెలివిజన్ ప్రసారాల విభాగాన్ని వాళ్ళు మూగ పోయేలా చేశారు."

"ఎందుకు?"

"ఎందుకో నాకు తెలియదు."

"వాళ్ళ ఉపగ్రహాన్ని అద్దెకు తీసుకుంటామనా?"

"ఖచ్చితంగా కాదు. సానుభూతితో అది మనకు అద్దెకిచ్చారు తప్పితే వ్యాపార దృష్టితో కాదు."

"మరి....?"

"అదే నాకు తెలియడం లేదు. వచ్చే వారం అమెరికా వెడుతున్నాను. అప్పుడు తప్పక తెలుస్తుంది."

అమెరికాలో ప్రముఖ శాస్త్రజ్ఞుడు మార్టిన్ రమణమూర్తికి స్నేహితుడు. ఇద్దరూ పరస్పరం అభిమానం, ఆరాధనాభావం కలవారు. మార్టిన్ రమణమూర్తికి ఉత్తరం వ్రాశాడు.

"నీ మొదటి ఉపగ్రహం ఫెయిలయినందుకు విచారంగా

వుంది. అయితే రెండవ ఉపగ్రహాన్ని నిర్మించాలనుకుంటూ- ఆ బాధ్యతను నీకే మీ ప్రభుత్వం అప్పగించడం నాకెంతో సంతోషంగా వున్నది. నిరభ్యంతరంగా ఆ బాధ్యత స్వీకరించు. మనమిక్కడ కలిసినప్పుడు నీకో గొప్ప రహస్యం చెబుతాను. అది నీ మేధస్సుకు అవగాహనను పెంచుతుంది. నీమీద నీకు నమ్మకాన్ని పునరుద్ధరించుతుంది."

రమణమూర్తి అమెరికా వెళ్ళగానే అందరికంటే ముందుగా మార్టిన్‌నే కలుసుకున్నాడు.

"కంగ్రాట్యులేషన్స్! మూటయాభై లక్షల్లో ఉపగ్రహ నిర్మాణం—ఊహకే అసాధ్యమైనది" అన్నాడు మార్టిన్.

"కానీ...." అన్నాడు రమణమూర్తి.

"మా నిపుణులు నీకో వార్నింగిచ్చారు. ఆ వార్నింగ్ గురించి నువ్వు నీ ప్రభుత్వానికి చెప్పలేదు. లేకుంటే ఆ ఉపగ్రహం కూడా అన్ని విధాలా సక్రమంగా పనిచేసి వుండేది" అన్నాడు మార్టిన్.

"ఏమిటా వార్నింగ్?"

"అయిదారు రోజుల తర్వాత ఉపగ్రహం పనిచేయదని వారు సూచించనే సూచించారు" అన్నాడు మార్టిన్.

"మా ప్రభుత్వం పాకిస్థాన్‌కి F-16 బాంబర్స్ ఇస్తున్నది. నీ ఉపగ్రహంలో వాటిగురించి పూర్తిగా తెలుసుకొనవచ్చునని మీ ప్రభుత్వం అనుకున్నది. పాకిస్థాన్ ఈ విషయమై మా దేశానికి మొరపెట్టుకున్నది. మా నిపుణుల బృందం వచ్చి పరిశీలించి పాకిస్థాన్ భయం అర్ధరహితం కాదని గ్రహించింది. మీ దేశానికి హెచ్చరిక పంపింది. నీకూ ఓ హెచ్చరిక ఇచ్చింది. నీకు అర్థం కాలేదు. మీ దేశం లెక్కచేయలేదు. ఫలితంగా మా దేశం ఆ మేరకు

ఉపగ్రహాన్ని సైలెన్స్ చేసింది. ఇప్పుడు భారతదేశం మాకు హామీ యిచ్చింది. మీ రెండవ ఉపగ్రహానికి మా నుంచి ఎటువంటి ఉపద్రవమూ వుండదు."

"ఇవన్నీ నీకెలా తెలుసు...."

"డియర్ బ్రదర్....కొంచెం ప్రపంచం గురించికూడా తెలుసుకుంటూండాలి. ప్రజల మనసుల్లో సైంటిస్టుగా ప్రముఖస్థానాన్ని సంపాదించేక — ఆ స్థానం అలాగే నిల బెట్టుకోవాలంటే కొంచెం రాజకీయాల గురించికూడా తెలుసు కోవాలి. ఏమాత్రం శ్రద్ధ చూపించినా మీ దేశంలోనే నీకీ రహస్యం తెలిసివుండేది...." అని మార్టిన్ నెమ్మదిగా— "ఇది మరీ అంతపెద్ద రహస్యం కూడా కాదు" అన్నాడు.

"నా దేశంలో నేనిప్పుడు మైనసును. నీ సలహాను పాటించి ఎప్పటికీ ప్లస్ స్థానంలో వుండడానికి ప్రయత్ని స్తాను" అన్నాడు రమణమూర్తి. □

కిళ్ళీ రుచి?

"ఈ మధ్య కిళ్ళీ చాలా రుచిగా ఉంటుందోయ్! ఏం వేస్తున్నావ్?" అడిగాడు కస్టమర్.

"ఏమీ వేయడం లేదు. లైటు కొత్తగా పెట్టినప్పటి నుండి పురుగులు వస్తున్నాయ్. అప్పటినుండి అందరూ ఇలాగే అంటున్నారు." చెప్పాడు కిళ్ళీకొట్టు కిషన్‌సింగ్ అమాయకంగా.

—యన్. శివానంద్, బెల్లంపల్లి.

దారి తప్పిన ప్రేమవేశి

రాజేష్ బాబు

వెన్నెల రాత్రి అంత బాధాకరంగా వుండగలదని రజనికి అప్పటిదాకా తెలియదు. కొబ్బరిచెట్టు వెనక తొంగి చూస్తున్న చంద్రుడిలో మచ్చల్ని లెక్క-పెడుతూ డాబా పిట్టగోడకి ఆనుకుంది. అర్ధరాత్రి దాటినాక ఉస్సురంటూ డాబా దిగింది. ఇంట్లో మిగతావారంతా ఆదమర్చి నిద్రపోతు

వున్నారు.

నిశ్శబ్దంగా తన గదిలోకి పోయి కూజానీళ్ళతో ముఖం కడుక్కుంది. కాపిని నీళ్ళని ఒంటిమీద చిలకరించుకుంది వేడి నిట్టూర్పులు వదులుతూ.

పడక చేరి వాలిపోయింది. రాంబాబు ఆ సమయంలో ఏం చేస్తుంటాడోనని ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది. ఓ గంట తర్వాత అర్ధమయిందామెకి—ఇక ఈ రాత్రి నిద్రాదేవి కరుణించదని. లైటువేసి ఎక్సర్‌సైజు పుస్తకంలో రెండు కాగితాలు చింపి పెన్ తెరిచింది. మదిలో రేగుతున్న ఉద్వేగాన్ని అక్షరాల రూపంలోకి మార్చసాగింది.

"మై డియర్ రామూ,

ఇప్పుడు సమయం ఎంతయిందో తెలుసా? రాత్రి ఒంటిగంట! ఇంతదాకా ఎందుకు నిద్రపట్టలేదో నీకు తెలుసు. నీ పరిస్థితీ అంతేనని నాకు తెలుసు.

సరే—ముఖ్యమైన విషయం - వీర్రాజు ఇవాళ ఉదయం వెళ్ళిపోయాడు. నన్నుకూడా తనతో తీసుకు వెళ్ళమని మా అక్క, బావ ఎంత చెప్పినా వినిపించుకోలేదు. మరో మూడు సంవత్సరాల వరకూ నేను పుట్టింట్లోనే వుండక తప్పదని, తనను కాశ్మీర్ నుంచి సౌత్‌కి ట్రాన్స్‌ఫర్ చేయగానే నన్ను తీసుకుపోయి కాపురం పెడతాననీ చెప్పాడు.

నిజానికి నాకు చాలా సంతోషంగా వుంది. మూడేళ్ళ వరకైనా ఆ ఎలుగుబంటితో బలవంతపు కాపురం చేయనక్కర లేనందుకు. రేపట్నుంచి లైబ్రరీకని బయల్దేరి మన మామూలు చోటికే వస్తాను. నిన్ను కలిసి వారం రోజులే అయినా ఎన్నో యుగాలయినట్టు వుంది. నా అణువణువూ నీకోసం తపించి పోతోంది. నువు లేందే నేను

బతకలేను. మంచి ఉద్యోగం కోసం ట్రై చేయకూడదా?
మనం ఎక్కడైనా వెళ్ళిపోవచ్చుగదా?

నీ కౌగిలిలో మైనంలా కరిగిపోవాలని కోరుకుంటూ—

—నీ ప్రాణంలో ప్రాణం."

ఉత్తరాన్ని అయిదారు సార్లు చదువుకుని మడిచి పరుపు కింద దాచి లైటు తీయబోతూ ఆగింది. కవర్ కొని పోస్టు చేయడానికి తానే పోవాలి. అక్కగాని, బావగాని ఉత్తరం చూస్తే కొంప మునుగుతుంది.

ఇంకో లెటర్ రాసింది వెంటనే. ఆ రోజే వెళ్ళిపోయిన భర్త పేర్న రాసింది. తనను వీలైనంత త్వరలో తీసుకు వెళ్ళమనీ వీలయినప్పుడల్లా శెలవులకి వస్తూ వుండమనీ అభిమానం ఒలకబోస్తూ కాగితాన్ని నింపింది.

ఉదయం పదిన్నరకి బావగారు ఆఫీసుకి పోగానే భర్తకు రాసిన లెటర్ని పోస్ట్ చేయాలని అక్కగారికి చెప్పింది. అనుమానంగా చూసింది స్వరాజ్యం—చెల్లెలివంక.

కోపం అభినయిస్తూ, వీర్రాజుకి రాసిన ఉత్తరాన్ని రజని స్వరాజ్యం మీదికి విసిరింది "చూసుకో అంత అనుమానంగా వుంటే!"

గబగబా చదివింది స్వరాజ్యం. మొదట్నుంచీ యీ పెళ్ళి ఇష్టం లేదు మొర్రో అని గోల పెడుతున్న చెల్లెలికి భర్తపట్ల అకస్మాత్తుగా అంత ప్రేమ ఎందుక్కలిగిందో ఆమెకి అంతుపట్టలా. ఇంకా అనుమానిస్తున్నట్టుగానే వుంది ఆమె వాలకం. "సరే పోయిరా, త్వరగా వచ్చెయ్"

"అన్నట్టు చెప్పడం మరిచానక్కా. రేపటినుండి రోజూ లయిబ్రరీకి వెళ్ళి జనరల్ నాలెడ్జి సంపాదించాలనుకుంటు న్నాను. ఆయనుండేది నార్త్‌లోగదా, కాపరానికి వెళ్ళిన తర్వాత అక్కడివారు నన్ను చూసి నవ్వకుండా చేసుకో

వాలి మరి."

స్వరాజ్యం ఉద్దేశం ఉత్తర భారతమంటే ఏదో వింత దేశమని, అక్కడి మనుషుల్లో మెలగడం కష్టమనీ. చెల్లెలు ఎలా సర్దుకుపోతోందోనని ఆమెకు బెంగగానే వుంది. ఆమె బెంగను అలా ఉపయోగించుకోదలచింది రజని.

స్వరాజ్యం వదనంలో అనుమానపు ఛాయలు మాయ మయినై. "సరేలేవే, ఎందుకయినా మంచిది కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకో" అభిమానంగా హెచ్చరించింది.

వీధి మొగదలవుంది సబ్ పోస్టాఫీసు. రజని రెండు కవర్లు కొని అడ్రసులు రాసింది. ఉత్తరాల్ని కవర్లోపెట్టి డబ్బాలో వేసి ఉత్సాహంగా ఇంటికి బయల్దేరింది.

రాంబాబుది కూడా విజయవాడే. సాయంకాలానికల్లా లోకల్ టపాలో అతనికి లెటరందుతుంది. బహుశా రేపటి వరకూ ఆగకుండా ఈ రోజే వస్తాడేమో? ఊహల్లో తేలి పోతూ ఇల్లు చేరింది.

2

రాజ్ దర్బార్‌లో కమ్మని కాఫీ తాగి బీసెంటు రోడ్డు మీదుగా రూమ్ దారి పట్టాడు రాంబాబు. గుడివాడలో పుట్టి పెరిగి విజయవాడలో చిరుద్యోగం వెలగపెడ్తున్నాడు. వచ్చేది రెండు వందల యాభై. ఐతే ప్రతి ఫస్టునా తండ్రి ఠంచను తప్పకుండా మరో వంద రూపాయిలు పంపుతాడు. రాంబాబు కంటే పెద్దవారైన నలుగురు కొడుకులూ పుష్క లంగా సంపాదిస్తారు కాబట్టి డబ్బుకు కొదవ లేదు.

విజయవాడ వచ్చిన రోజునే రాంబాబుకి రజనితో పరి చయమైంది. అది కథల్లోలాగే గాఢమయిన ప్రేమగా మారింది. వయసులు ఉడుకువి కావడంతో ఆ "పొరపాటు" కూడా జరిగిపోయింది! ఒకసారి ఎలాగో తొందరపడ్డాం

కాబట్టి ఇంక మునిగేదేమిటని—అవకాశం కుదిరినప్పుడల్లా వినియోగించుకుంటూనే వున్నారు.

ఈ విషయం పసికట్టిన రజని బావగారు హడావిడిగా సంబంధాలు వెతికి వీర్రాజుతో మరదలి పెళ్ళి జరిపించేశాడు. బంధువులు, మిత్రులు అన్నవారే లేని వీర్రాజుకి రజని నడత గురించి కనీసం అనుమానంకూడా లేదు. కేవలం పెళ్ళికోసమే విజయవాడ వచ్చి మళ్ళీ మిలిటరీ కంటోన్మెంట్ కి వెళ్ళిపోయాడు. కొత్త పడుచు భార్యను తనతో తీసుకుపోవాలని సరదాగానే వున్నా ఆర్థికపరమైన ఇబ్బందుల గురించి ఆలోచించి ఆ ప్రయత్నం వాయిదా వేసుకున్నాడు. అతనో మామూలు సైనికుడు మాత్రమే.

బీసెంటు రోడ్ని ఒకసారి కలయతిరిగి గాంధీనగర్ లో వున్న రూమ్ చేరాడు రాంబాబు. తలుపు తెరవగానే ముత్యాలవంటి అక్షరాలతో పోస్టల్ కవర్ దర్శన మిచ్చింది. ఒక్కసారిగా అతని ఉత్సాహం పెచ్చరిల్లిపోయింది. రజని లెటరు రాస్తుందని రోజూ ఎదురుచూస్తూనే వున్నాడతను.

పర్రున కవర్ని చింపి ఆత్రంగా చదివాడు.

ఓ క్షణంపాటు అతనికేమీ అర్థం కాలేదు. ఇంకో క్షణం తర్వాత అతని వెన్నులో వణుకు మొదలైంది. ఒళ్ళంతా చెమటలు పట్టసాగినై.

చప్పున తేరుకుని రూమ్ కి తాళంవేసి ఎదురింటివాళ్ళ సైకిల్ అడిగి తీసుకుని మొగల్రాజపురం బయల్దేరాడు ఆదరాబాదరాగా. తిన్నగా రజని ఇంటిముందు ఆగి గేటు తోసుకుని లోపలికి ప్రవేశించాడు. వరండాలో పప్పు రుబ్బుతున్న స్వరాజ్యం చివాల్న లేచి నుంచుంది.

"ఏం నాయనా, ఇంకేం కావాలని వొచ్చావ్? మా అమ్మాయిని సుఖంగా కాపరం చెయ్యనీయవా? ముందు

బైటికి నడుప్!" ఆగ్రహంతో అరిచింది.

బలవంతంగా గొంతు పెకలించాడు రాంబాబు—"అది కాదండీ—రజనికి ద్రోహం చేయాలని రాలేదు నేను.... నామాట నమ్మండి. రజని నోసారి పిలవండి ముందు."

ఏదో అనబోయింది స్వరాజ్యం. అంతలోనే వరండా లోకి వచ్చేసింది రజని. ఏనాడూ తన ఇంటివాళ్ళకు అగు పించటానికి సాహసించని ప్రియుడు ఇప్పుడు సరాసరి ఇంటికే వచ్చేయడం వింతగాను, భయంగానూ వుందామెకి.

గబగబా నాలుగడుగులు వేసి రజని చేతిలో ఉత్తరాన్ని పెట్టాడు రాంబాబు. రజని అదిరిపోయింది. ఇదేమిటి రాంబాబు తననిలా అల్లరిపాలు చేస్తున్నాడు అనుకుంటూ ఎర్రబారిన కళ్ళతో అతని వంక తీవ్రంగా చూసింది.

"రజనీ! ఆ ఉత్తరాన్ని చూడు! నాకు పంపింది దాన్నేనా?" అన్నాడు కంగారు మిళితమైన కంఠంతో.

ఉత్తరాన్ని చూసింది రజని.

అంతే! 'కెవ్వు' మంటూ అరిచింది పిచ్చిగా.

ఈదురుగాలిలో చిక్కిన ఎండుటాకులా నిలువునా వణికిపోసాగింది. రక్తం చుక్క లేనట్టు పాలిపోయిం దామె ముఖం. వెర్రిగా కాగితాన్ని చూస్తూ కూలబడి పోయింది.

ఏదో జరగరానిది జరిగిందని స్వరాజ్యం గ్రహించింది. చెల్లెలి చేతిలోని ఉత్తరాన్ని లాక్కుని చూసింది. అది రజని ఆ ఉదయం భర్తకి రాసి తనకు చూపించిన లెటర్.

క్షణం తర్వాత స్వరాజ్యం మెదడులో ఫ్లాష్ మంది. ఏం జరిగిందో అర్థమయిందామెకి. రజని రాంబాబుకి కూడా వేరే ఉత్తరం రాసి రెండింటినీ పోస్టుచేసే సమయంలో పొరపాటున ఒకరి కవర్లో మరొకరి ఉత్తరాన్ని పెట్టేసింది!

అంటే రాంబాబుకి రాసిన వుత్తరం సరాసరి చెల్లెలి భర్తకి వెళ్ళిపోతూంటుంది ఈపాటికి!

స్వరాజ్యం మాట పడిపోయినట్టు స్థంభించిపోయింది. అయిదు నిమిషాల వరకూ అలాగే వుండిపోయారు ముగ్గురూ.

ఆఫీస్ నుంచి తిరిగొచ్చిన స్వరాజ్యం భర్త రంగారావు శిలాప్రతిమల్లా వున్న ముగ్గురినీ చూసి కళ్ళు చిట్లించాడు. రాంబాబును చూడగానే ఒళ్ళు మండిందతనికి.

స్వరాజ్యం భర్తని చూసి కొంచెం ధైర్యం తెచ్చు కుంది. ఇల్లరికపుటల్లుడే అయినా అతను ఇంటి మనిషి లాగే కలిసిపోయాడు. రజనిని స్వంత చెల్లెల్లాగా చూసు కుంటాడతను. నిదానంగా భర్తకి విషయమంతా వివరిం చింది స్వరాజ్యం.

రాంబాబుని, రజనిని గొంతుపిసికి చంపేద్దామన్నంత పిచ్చి ఆవేశం వచ్చేసింది రంగారావ్‌కి. అతి కష్టంమీద నిగ్రహించుకుని తన గదిలోకి వెళ్ళిపోయాడు తల చేత్తో పట్టుకుని.

3

నెలరోజులు గడిచినయ్.

ఏ క్షణంలో వీర్రాజు వచ్చి తమ పరువు నడివీధిలో పెడతాడోనని హడలిపోతున్న రంగారావ్ ప్రభృతులకి అతను రాకపోవడం ఆశ్చర్యం కలిగించింది. అతన్నుంచి కనీసం ఉత్తరమైనా రాలేదు. ఒకవేళ రజని పంపిన లెటర్ మిస్ అయిందేమోనని అనుమానించసాగారు. అలా జరిగితే వెయ్యిన్నొక్క కొబ్బరికాయలు కొడతానని స్వరాజ్యం ఇష్టదైవానికి మొక్కుకోసాగింది.

రాంబాబు పత్తాలేదు.

అందరికీ కొంచెం ధైర్యం కూడుకొంటున్న సమయంలో హఠాత్తుగా వూడిపడ్డాడు వీర్రాజు. అతను కంట పడగానే నిలువునా నీరయిపోయారు ముగ్గురూ. ఐతే వీర్రాజు ఆ ప్రసక్తే తీసుకురాలేదు. అసలతనికి ఉత్తరం అందిందో లేదోనని అంతులేని టెన్షన్‌లో పడిపోయారంతా.

భోజనాలు ముగించిన తర్వాత—

"నేను రజనిని తీసుకెళ్దామనుకుంటున్నాను అన్నగారూ. అక్కడ అనుకోకుండా మంచి క్వార్టర్ దొరికింది. ఎదురుచూడని ప్రమోషన్ కూడా వచ్చింది. మీ కభ్యంతరం లేకపోతే ఇవాళే వెళ్తాం" తాపీగా అన్నాడు వీర్రాజు.

రంగారావు తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు. తడబాటును దాచుకుంటూ "నా అభ్యంతరం ఏమిటోయ్? మీ ఇద్దరూ హాయిగా వుంటే చాలు. ఓ వారం రోజులు ఇక్కడే వుండి వెళ్ళవచ్చుగదా?" అన్నాడు.

"లేదండీ ఇవాళ బయల్దేరితేగాని ఎల్లుండికి చేరలేము. అసలే ఎల్లుండి కల్లా మళ్ళీ డ్యూటీలో చేరాలి. సెలవు లేదు."

అనుమానం ఇంకా తీరని స్వరాజ్యం అందుకుంది "అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తుండండి బాబూ. ఏమిటో - యీ నెల రోజుల్లోనూ నువ్వు ఒక్కసారైరా నీ క్షేమాలు తెలుపుతూ కార్డు ముక్కయినా రాయలేదు మరి".

అదోలా నవ్వాడు వీర్రాజు. "మీరు రాస్తేనే కదా వదినగారూ నేను రాసేది?" అన్నాడు.

ఆ మాట విన్న మరుక్షణం ముగ్గురి గుండెలూ కుదుటబడ్డాయి. వారి దిగులు చాలావరకు అదృశ్యమయింది.

ఆ రోజే జి. టి. ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు దంపతు లిద్దరూ భారంగా వీడ్కోలు చెప్పారు రంగారావు, స్వరాజ్యం. రజని ఇక జన్మలో పిచ్చివేషాలు వెయ్యదని వారిద్దరూ నిశ్చయించుకున్నారు.

4

ఢిల్లీ స్టేషన్‌లో దిగి వెయిటింగ్ హాల్లో స్నానాలుచేసి, రిఫ్రెష్ అయారు వీర్రాజు, రజని. కాంటీన్‌లో పూరీలు తిని టీ తాగారు.

వీర్రాజు స్వతహాగా మితభాషి. అందువల్ల భార్యతో పెద్దగా మాట్లాడటంలా. రజని పట్టించుకోలేదు. అసలు అతనితో మాట్లాడటమే భయంగా వుందామెకి.

రాత్రి ఎనిమిదింటికి మరో ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. అది బోర్డరుకి వెళ్ళే ట్రెయిన్ కాదని, మొగల్ సరాయ్ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ అని రజనికి తెలియను. భర్తతో తన భవిష్యత్తు యెలా వుండబోతుందో ఊహించుకోడానికి ప్రయత్నిస్తూ కిటికీలోంచి బయటికి చూస్తోంది.

వీర్రాజు కళ్ళు భార్యమీద నిలిచిపోయినై. ఎప్పుడూ ఎవరినీ చూడని విధంగా చూస్తున్నాడామెను. మరో గంటన్నరలో తాను చేయబోయే పని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడతను. సాధారణంగా ఏ విషయంలోనూ నిర్ణయం తీసుకోడు. ఒకసారి తీసుకొంటే యిక అది చేసి తీరాల్సిందే.

గంట తర్వాత ఏదో స్టేషనులో ట్రెయిన్ ఆగింది. కంపార్ట్‌మెంట్‌లోంచి దిగి రెండు టీలు తెచ్చి రజనికి ఓ కప్పు అందించాడు వీర్రాజు. ట్రెయిను కదిలేలోపల కప్పులు తిరిగిచ్చేసి భార్య ఎదురుగా కూర్చున్నాడు.

వాచీ చూశాడు. పావుగంటలోనే వస్తుంది తర్వాత

స్టేషను. ఈ లోపలే పని జరిగిపోవాలి.

అయిదు నిమిషాలు గడిచినై.

పది నిమిషాలు ...స్టేషను దగ్గర పడుతోంది.

అకస్మాత్తుగా తల విదిలించుకుంది రజని. కళ్ళు తిరుగుతున్నట్టనిపించిం దామెకి. చాలా అలసిపోయినట్టు నిద్ర ముంచుకొస్తున్నట్టుంది. వీర్రాజు తెచ్చియిచ్చిన టీ ప్రభావం అది.

సన్నగా నవ్వుకుని లేచాడు వీర్రాజు. బెర్త్‌మీంచి సూట్‌కేస్ అందుకుని రజని చేయిపట్టి "త్వరగా దిగాలి, పద పద" అన్నాడు మృదువుగా.

కళ్ళు తెరిచివుంచటానికి ప్రయత్నిస్తూ "అప్పుడే.... వచ్చేసిందా....ఊరు....?" అంటూ భర్త భుజంమీద చేయి వేసి నిలబడింది రజని. తడబడుతున్న అడుగులతో భర్తను అనుసరించింది.

అది చిన్న స్టేషను కావడంతో జనం చాలా పల్చగా వున్నారు. ఎగ్జిట్‌గేట్ వేపు పోకుండా ప్లాట్‌ఫారం చివరి దాకా నడిచి పట్టాల పక్కనే దారితీశాడు వీర్రాజు. తూలుతున్న రజనిని బలంగా పట్టుకుని నడిపించసాగాడు.

ఒక ఫర్లాంగు తర్వాత సడన్‌గా మలుపు తిరిగాయి రైలుపట్టాలు. రజని జీవితమూ మలుపు తిరగబోతోంది అక్కడ!

5

బరువుగా వుంది నా తలంతా. తెల్లవార్లూ ఖుర్జా పోలీస్ స్టేషనులో జాగారం చెయ్యటంవల్లా, అంతకు ముందు రెండు రోజులూ విజయవాడ నుంచి ఢిల్లీకి, ఢిల్లీనుంచి మళ్ళీ ఖుర్జాకీ ఏకధాటిగా ప్రయాణం చేయటంవల్లా బుర్ర దిమ్మెక్కిపోయింది. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం

చేస్తే ఇదే అవస్థ.

ఒకానొక 'హంతక రత్న' మా పోలీస్‌స్టేషన్నుంచి మూడునెలల క్రితం తప్పించుకు పారిపోయి మొన్న ఖుర్జాలో తేలి అక్కడ పోలీసులకు దొరకటమే నేనిక్కడ దాకా రావటానికి కారణం. వారినుంచి ఖయిదీని హాండోవర్ చేసుకొని తిరుగు ప్రయాణం ప్రారంభించబోతున్నాను.

రైల్వేస్టేషన్ రాగానే ఎదురైంది ఆ వార్త—ఫర్లాంగు అవతల ఎవరో స్త్రీ శవం ముక్కలై రైల్వే ట్రాక్‌మీద పడివుందని. వృత్తి సహజమైన ఆసక్తి నా కాళ్ళను అటు తిప్పింది. నా ఎడమచేతికి హాండ్‌కప్స్ ద్వారా బంధితుడైన హంతకాగ్రేసరుడు విసుగ్గా ముఖం పెట్టాడు.

"అయ్యా, ఇన్‌స్పెక్టర్‌గారూ! నేనంత దూరం నడవలేను సార్. కావాలంటే మీరు పోయిరండి, నేనిక్కడే వుంటాను" అన్నాడు.

తారాజువ్వలా లేచింది నా కుడిచెయ్యి. వాడి చెంప ఫెళ్మంది. ఏం చెయ్యను చెప్పండి? డిపార్ట్‌మెంట్‌లో చేరిం తర్వాత నా చేతులకి చీటికి మాటికి లేవటం బాగా అలవాటయిపోయింది. అఫ్‌కోర్స్—ఒకోసారి ఈ అలవాటు బలే అద్భుతంగా వర్క్ చేస్తుందనుకోండి. హంతక మిత్రుడు కిక్కురుమనకుండా నా ప్రక్కనే నడిచాడు.

ఫర్లాంగున్నర దూరం పోయాం. అప్పటికే జనం పోగయ్యారక్కడ. పోలీస్ బలగం యెప్పుడు చేరిందో మరి, ఫోటోలు గట్రా తీసేస్తున్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ బచ్చన్ అక్కడే వున్నాడు. విష్ చేశాడు నన్ను చూడగానే.

"ఏం గురూగారూ, యింకా మీ ట్రెయిన్ రాలేదా?"

అడిగాడు హిందీలో.

లేదని చెప్పి శవం వంక చూశాను. ఎవరో స్త్రీ శవం అది. పాతిక ఏళ్ళ లోపు వుండవచ్చు. మెడవద్ద, మోకాళ్ళ వద్ద నీట్‌గా తెగిపోయింది. పట్టాలకి అడ్డంగా పడుకొని వుంటుంది చావబోయే ముందు. ఒంటిమీద చీర వగైరా పరిశీలించాను. ఎందుకో అనిపించింది—ఆమె తెలుగు దేశం యువతి కావచ్చునని.

ఇంటరెస్ట్ పెరగటంతో అప్పటికప్పుడే డిసైడ్ చేసేసు కున్నాను—తిరుగు ప్రయాణాన్ని ఆ రోజుకు వాయిదా వేద్దామని.

సాయంకాలం దాకా స్టేషన్‌లోనే వుండిపోయాను. రెండు విషయాలను మా నిపుణులు ఆసరికి నిర్ణయించే శారు. ఒకటి ఆ యువతిది ఆత్మహత్య కాదు, ఎవరో ఆమెకి నిద్రమాత్రలిచ్చి రైల్వేట్రాక్‌వరకూ తీసుకొచ్చారు. మరణించే సమయంలో ఆమె స్పృహలోలేదు. రెండు ఆమె ధరించిన లోపలి లంగా ఆంధ్రదేశంలోని ఏలూరు లోని సంస్థ తయారుచేసింది. కంపెనీవారి లేబిల్ వుంది దానిపైన.

శవం తాలూకు దుస్తుల రంగు మొదలైన వివరాలు, ఫోటోలు తీసుకుని రిటర్న్ జర్నీ ప్రారంభించి మర్నాటి అర్ధరాత్రికల్లా విజయవాడ చేరాం, నేనూ నా 'ఫ్రెండూ'.

మర్నాడు యస్పీగారితో మాట్లాడి, ఖుర్దా స్టేషన్ శవం ఫోటోల్లో తలభాగం స్పష్టంగా కనిపిస్తున్న ఫోటోని పత్రిక లన్నింటికీ పంపించాను. ఆమె దుస్తుల వివరాలు, సుమారు వయసు, శరీరం రంగు, పుట్టుమచ్చలు మొద లైనవన్నీ వేసి, ఆమె బంధువుల కోసరం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయమని పత్రికలవారికి ఫోన్లు చేశాను. ఏలూరు

దుస్తుల సంస్థల వారికి ఈ విషయంలో ఏమీ తెలిసే అవకాశంలేదు. వాళ్ళు వేలసంఖ్యలో లంగాలను తయారుచేసి మార్కెట్‌లోకి పంపుతుంటారు.

ఆ సాయంకాలం కొన్ని పేపర్లలోను, మర్నాటి ఉదయం మిగతా వాటిలోనూ మా ప్రకటనలు వచ్చినై.

ఆశ్చర్యకరంగా అదే రోజు సాయంత్రానికే నేనాశించిన రిజల్ట్ వచ్చేసింది. అదీ విజయవాడ నుంచి!

నలభై దగ్గర పడుతున్న దంపతులు ఇద్దరు సరాసరి నా గదిలోకి వచ్చారు. న్యూస్‌పేపర్స్ రెండున్నాయి వాళ్ళ చేతుల్లో. వారిని క్షణకాలం పరిశీలించగానే అర్థమైపోయింది నాకు—

ఆమెకూ, నేను చూసిన యువతి శవానికీ ముఖ పోలకలు చాలా క్లోజ్‌గా వున్నాయి. ఈమె ఖచ్చితంగా ఆ యువతికి అక్కగారై వుంటుంది.

కుర్చీలు చూపించాను.

చాలాసేపట్నుంచి ఏడుస్తోందేమో ఆమె ఎర్రటి ముఖం ఉబ్బిపోయి వుంది.

అరగంటలో అన్ని విషయాలూ విన్నాను.

కేసు చాలా సులువుగా విచ్చిపోయింది. వీర్రాజే హంతకు డనటానికి నాకే సందేహమూ మిగల్లా. నమ్మకంగా భార్యకి మత్తుమందు ఇచ్చి రైలు పట్టాలమీద పడుకోబెట్టి తన దారిన వెళ్ళిపోయాడు.

వాళ్ళని ఓదార్చి పంపేశాను. నాది రాతిగుండె. అయినా ఏ మూలో రజనిపట్ల కొంచెం సానుభూతి కలిగింది. ప్రేమలో ప్రమాదాలకి అంతులేదు కదా అని నిట్టూర్చి మళ్ళీ ఢిల్లీకి ఓ టికెట్ రిజర్వ్ చేయించాను. ఐతే వీర్రాజుని లోపలికి తోయించడానికి పకట్బందీ అయిన

ఆధారం ఏదీ లేదని నా పోలీసు బుర్రలో తొలుస్తూనే వుంది.

రాత్రి ఎనిమిదిన్నరకి కొలువు చాలించి ఇంటికి పోదామని లేచాను.

గేటు దగ్గరే ఎదురయ్యాడు రంగారావ్—రజని బావగారు.

"ఇన్స్పెక్టర్‌గారూ, జస్ట్ ఓ పావుగంట మునుపే యిదొచ్చింది. వీర్రాజు టెలిగ్రాం ఇచ్చాడు—మేం ఇద్దరం క్షేమంగానే చేరాం అని!!"

రంగారావ్ చేతిలో కాగితం లాక్కున్నాను. ఆ రోజు సాయంత్రం మూడు గంటలకి బోర్డర్ కంటోన్మెంట్ నుంచి వీర్రాజు యిచ్చిన టెలిగ్రాం అది!

వీర్రాజు ప్లానేమిటో అవగతమైంది నాకు. తాను ఇరుకున పడకుండా అతను జాగ్రత్త తీసుకుంటున్నాడు. రజని శవం ఖుర్జాలోనే గల్లంతయిపోతుందని, సో తర్వాతెప్పుడో రజని కోపంతోనో మరేదో కారణంతోనో తన దగ్గర్నుంచి వెళ్ళిపోయిందని తీరికగా తెలియపర్చితే, బహుశా ఎవరితోనో లేచిపోయిందని అందరిచేతా నమ్మించవచ్చు! అందరూ నమ్ముతారు కూడా!

నువ్వు మిలిటరీలో కాదు పోలీస్ శాఖలో వుండాల్సినవాడివోయ్ వీర్రాజూ అని మనసులో అనుకుని, ఢిల్లీ రైలెక్కాను మరోసారి.

ఇప్పుడు వీర్రాజు తప్పించుకోలేడు. టెలిగ్రాం ఇచ్చి తన గొయ్యి తానే తవ్వుకున్నాడు.

వీర్రాజు చేతిలో పడిన ఆ ప్రేమలేఖను చదవాలని మహా ఆత్రంగా వుంది నాకు. □

దెబ్బ తిన్న పులి

విశ్వమోహిని

బంగ్లాదేశ్ సాయిల్‌మీద ఇండియన్ బోర్డర్ వైపు వేగంగా దూసుకుపోతోంది చాక్లెట్ కలర్ అంబాసిడర్ కారు. ఆలోచిస్తూ డ్రయివ్ చేస్తున్నాడు చందర్. ప్రతి అరగంటకూ వాచ్ చూసుకుంటున్నాడు అతను.

పదిన్నరకల్లా బోర్డర్ చెక్‌పోస్ట్ దగ్గర వుండాలి తాను. బంగ్లాదేశ్ గార్డ్స్ చెక్ చేసి బోర్డర్ క్రాస్ చేయడానికి అనుమతించేసరికి కనీసం అరగంటయినా పడుతుంది.

ఆ తరువాత ఇండియన్ చెక్‌పోస్ట్. అక్కడ కూడా ఓ.కే. చేయించుకుని భారత భూభాగంలో అడుగు పెడితే ఇక ప్రాబ్లమ్ వుండదు.

మధ్యాహ్నం మూడు గంటలకు కలకత్తాలో ఓ ముఖ్యమయిన మీటింగు వున్నదతనికి. బోర్డర్ నుండి సుమారు రెండు గంటలు ప్రయాణిస్తే తప్ప కలకత్తా చేరుకోవడం కష్టం.

ముప్పయ్యేళ్ళ చందర్ ఓ ఇంటర్నేషనల్ స్మగ్లర్. మనిషి ఎత్తరి. దృఢంగా, ఆకర్షణీయంగా వుంటాడు.

నెలకోసారి బంగ్లాదేశ్ తన సొంత కారులో వెళ్ళి వస్తూంటాడతను. ఓ రెండు రోజులు వుండి వస్తాడు. ప్రతిసారీ ఏదో ఒక వస్తువును కారులోనే ఇండియాకు స్మగుల్ చేస్తూంటాడు.

రెండు చెక్‌పోస్టుల దగ్గరా గార్డ్స్‌కి ప్రతిసారీ విలువైన బహుమతుల నిస్తూ వారిని మచ్చిక చేసుకున్నాడు. అందువల్ల అతని కారును శల్యపరీక్ష చేయకుండానే విడిచి పెడుతుంటారు వాళ్ళు. అయినా ఎప్పుడూ తన జాగ్రత్తలో తాను వుంటూనే వుంటాడతను.

గొర్రెల మందొకటి కారుకు అడ్డు రావడంతో సడెన్ బ్రేక్ వేశాడు చందర్. కాపరులపైన కేకలు వేసాడు త్వరగా వాటిని ప్రక్కకు తోలమని. దారి క్లియర్ కాగానే మళ్ళీ వేగం పెంచాడు.

ఆ గొర్రెల్ని చూస్తే హఠాత్తుగా సత్తార్ గుర్తుకొచ్చాడతనికి. వెనువెంటనే గతరాత్రి జరిగిన సంఘటన

మదిలో మెదిలింది.

బంగ్లాదేశ్‌లో చందర్ కాంటాక్ట్ సత్తార్. వివిధ దేశాల నుండి స్మగుల్ చేయబడిన వస్తువులు, సత్తార్ ద్వారా చందర్‌కి అందజేయబడతాయి. అక్కడి నుండి కారులో ఇండియాకు స్మగుల్ చేసుకుని అధిక లాభాలను సంపాదిస్తున్నాడు చందర్.

అతను చాలా జాగ్రత్తపరుడు. అందుకే ఆ వ్యవహార మంతా తానే స్వయంగా చూసుకుంటాడు. ముఖ్యంగా సరుకును భారతదేశానికి చేరవేసే బాధ్యతను తానే చేపట్టాడు. సరుకు దేశం చేరగానే అతని అనుచర వర్గం మిగతా విషయాలు చూసుకుంటుంది.

నెలకొకసారి బంగ్లాదేశ్ వెళ్ళే చందర్, ప్రతిసారీ సత్తార్ ఇంట్లోనే బసచేసి, ఆతిథ్యాన్ని పొందుతుంటాడు. ఈ సారీ అందుకు భిన్నంగా జరగలేదు. కాని. వచ్చిన తేడా అల్లా ఈసారి సత్తార్ అందాల భార్య అక్తార్ అనుకోకుండా చందర్ కంట పడడం!

గతదినం వుదయం స్నానంచేసి వస్తూన్న అక్తార్ సౌందర్యం, అనుకోకుండా కనులపండగ చేయడంతో చందర్‌కి మతిపోయింది.

రెండేళ్ళ క్రితం సత్తార్ మొదటిభార్య మరణించడంతో రెండవ పెళ్ళి చేసుకున్నట్లు చందర్ ఎరుగును. కాని, ఆమె అపురూప సౌందర్యవతి అని ఎరుగడు. ఆమెను చూసినప్పటి నుండి అతని ఆలోచనలు సాట లైట్స్‌లా ఆమెచుట్టూ పరిభ్రమణ మారంభించాయి.

రాత్రి సత్తార్ యింటిలో లేడు. చందర్ తన గదిలోనే వున్నాడు. అక్తార్ యింటిలో వొంటరిగా వున్నదన్న విషయం గ్రహించిన చందర్, తన గదిలో కూర్చుని

విస్కీతో తన ఆలోచనలను తడపసాగాడు.

కొంతసేపటికి వాళ్ళు బాగా వేడెక్కి పోవడంతో ధైర్యంచేసి అక్తార్ గదిలో అడుగుపెట్టాడు చందర్. ఆమె లొంగకపోయేసరికి బలవంతానికి పూనుకున్నాడు.

సరిగ్గా అదే సమయంలో సత్తార్ తిరిగిరావడం జరిగింది. ఆ దృశ్యం అతని కంట పడనేపడింది. నిర్ఘాంత పోయాడతను. వెక్కి వెక్కి ఏడుస్తూన్న భార్యను చూసే సరికి అవమానం, ఆగ్రహం అతని కళ్ళలో ప్రజ్వ లించాయి.

"ఐయాం సారీ, సత్తార్! అయాం సారీ!" నిర్లక్ష్యంగా అని అక్కడి నుండి వెళ్ళిపోతున్న చందర్‌ని చూసేసరికి సత్తార్ హృదయం భగ్గుమంది. చందర్‌ని కత్తితో పొడిచి చంపేయాలన్నంత కసిగా వుంది.

కాని, అతి కష్టంమీద నిగ్రహించుకున్నాడతను. నలభై యేళ్ళ సత్తార్ పొట్టిగా, పీలగా వుంటాడు. చందర్‌తో తలపడినట్లయితే అతని ముందు ఎందుకూ పని చేయడు తాను. పైగా, అతన్ని చంపడంవలన కలిగే పరి ణామాలు కూడా గుర్తుకు రావడంతో నిదానించాడు.

ఇప్పుడు కారుకి అడ్డం వచ్చిన గొర్రెల్ని చూస్తే, ఆ సంఘటన జ్ఞప్తికొచ్చింది చందర్‌కి. ఆ గొర్రెల్లాగే రాత్రి సత్తార్ అడ్డుపడి వుండనట్టయితే, అందాలరాశి అక్తార్ సౌందర్యాన్ని తనివిదీరా గ్రోలి వుండేవాడు తాను. పాన కంలో పుడకలా అడ్డుపడిన సత్తార్‌మీద కోపంగా వున్న దతనికి. అయినా మించిపోయింది లేదు. 'నెక్స్టట్ టైమ్ బెటర్ లక్!' అనుకుని సంతృప్తి చెందాడు.

తెల్లవారేక సత్తార్ ఆ ప్రస్తావన తేకపోవడంతో చందర్‌కి ధైర్యం కలిగింది. 'పౌరుషంలేని పిరికి వెధవ!'

అనుకున్నాడు. 'నా మూలంగా లభించే బిజినెస్‌ను వదులుకో లేదు సత్తార్‌!' అని తలపోసాడు.

చీకటితోనే చందర్‌ని నిద్రలేపి 'టీ ఇచ్చాడు సత్తార్. త్రాగాలని వున్నా, 'ఈ వేళప్పుడు చాయ్ త్రాగాలనిపించడం లేదు బాయ్!' అంటూ తప్పించుకున్నాడు చందర్—రాత్రి సంఘటనకు పగబట్టి సత్తార్ తనకు టీలో విషం కల పొచ్చునన్న భయం ఏ మూలో పీడించడంతో.

ఈసారి సరుకంతా వాచీలే. ఖరీదయిన క్వార్ట్జ్, ఎలెక్ట్రానిక్ వాచ్‌లు స్విట్జర్లాండ్ నుండి బంగ్లాదేశ్‌కి స్మగుల్ చేయబడ్డాయి. మొత్తం పాతిక లక్షల సరుకు! సత్తార్ వాచ్‌లను కారులో ఓ రహస్య భాగంలో దాచాడు.

చందర్ అతనివద్ద సెలవు తీసుకుని బయలుదేరాడు. ఆ రోజు మూడు గంటలకు కలకత్తాలో ఒక పార్టీ కలుస్తాడు అతన్ని. ఆ వాచీ లన్నిటినీ ఆ పార్టీకి అమ్మడానికి ఒప్పందం కుదిరిపోయింది ముందుగానే. అందుకే ఆ ఆతృత.

త్రోవలో అడ్డంకు లేవీ లేకపోవడంతో గాలిలో తేలి పోతూ అనుకున్న టైముకు బోర్డర్ పోస్టను చేరుకున్నాడు చందర్. పావుగంటలో బంగ్లాగార్డ్స్ క్లియరెన్స్ యిచ్చే శారు. ఇండియన్ పోస్టను చేరుకునేసరికి పదకొండుకు అయిదు నిమిషాలుంది. ఇంకా నాలుగయిదు కార్లున్నాయి వరుసలో.

"క్యా చందర్ భాయ్, వాపస్ ఆగయా?" అంటూ చందర్‌ని పలుకరించాడు గార్డు.

"హా, హవల్దార్ సాబ్ కైసే హై ఆప్?" అంటూ కారులోంచి దిగాడు చందర్.

వాళ్ళిద్దరూ మాట్లాడుతూండగానే యిద్దరు గార్డ్సు కారు చెక్ చేశారు. వారి సంజ్ఞ ననుసరించి, "అచ్ఛా భాయ్! ఆప్ జా సక్తే హైఁ" అన్నాడు హవల్దార్.

అతని వద్ద సెలవు తీసుకుని కారు డోర్ తెరవబోయాడు.

అదే క్షణంలో హఠాత్తుగా యెక్కడి నుండో సైరెన్ మ్రోత వినిపించింది.

"అరె రైరో భాయ్! ఇవాళ మార్టియర్స్ డేగా. పదకొండు గంటల నుండి రెండు నిముషాలపాటు విశ్శబ్దం వహించాలంతా" అని హవిల్దార్ అనడంతో, హఠాత్తుగా గుర్తుకొచ్చింది చందర్ కి ఆ రోజు జనవరి ముప్పయ్ అని.

అందరితోపాటే మౌనంగా తల వంచుకున్నాడు. ఆ క్షణంలో అక్కడంతా నిశ్శబ్దం ఆవరించుకుంది పదకొండూ రెండు నిముషాలకు రెండవ సైరెన్ వినిపించేంత వరకు ఎవరూ కదల కూడదు.

ఒక నిముషం అయింది....

హఠాత్తుగా యెక్కడి నుండో సన్నగా అలారం మ్రోగడంతో వులిక్కిపడ్డాడు హవిల్దార్.

అదేమిటో గ్రహించే లోపునే సన్నగా మరో అలారం....

అంతలోనే యింకో అలారం....

అలా—ఓ పది పదిహేను అలారాలు ఒకేసారి మ్రోగనారంభించేసరికి గార్డ్సుతో పాటు చందర్ కూడా త్రుళ్ళిపడ్డాడు.

అదేమిటో అర్థమయేసరికి, ఎక్కడినుండి వస్తూందో గ్రహించేసరికి అతని వదనం పాలిపోయింది. ముచ్చెమటలు పోస్తున్నాయి.

రెండో సైరెన్ వినిపించడంతో అక్కడ తిరిగి చలనం కలిగింది. అంతవరకు చిత్ర ప్రతిమల్లా వున్న మనుషుల్లో కదలిక ఏర్పడింది.

నిశ్శబ్ద సమయంలో—విరామ గీతాల్లా వినిపించిన అలారపు ధ్వనులు కొద్ది తేడాలో ఒక దాని తరువాత ఒకటిగా ఆగిపోయాయి.

హవిల్దాల్ కన్నులు ఎర్రబడ్డాయి. ఆ ధ్వనులు కారులో నుండి వచ్చినట్టు గ్రహించడం కష్టం కాలేదతనికి. చందర్ వైపు తీక్షణంగా చూసి, కారును సమీపించాడు.

అలారపు ధ్వనులు వినవచ్చిన చోట చెవిపెట్టి ఆల కించాడు. డ్రయివర్ ప్రక్కడోర్ నుండి 'టిక్కు.... టిక్కు....' అన్న శబ్దాలు కోరస్‌గా సన్నగా వినిపించాయి. విషయం అర్థమయిపోయిందతనికి. పనిముట్లు తెప్పించి డోర్ లోపలివైపు కుషన్ లైనింగ్‌ని వోపెన్ చేశాడు.

వందలకొలదీ ఖరీదయిన సరిక్రొత్త స్విస్ వాచ్‌లు బయటపడ్డాయి! ఆ వాచ్‌లలో అలారం సిస్టం కూడా వుంది!!

ఎదురు చూడని ఆ పరిస్థితికి కొయ్యబారిపోయిన చందర్‌ని సమీపించి చెంప పేలగొట్టాడు హవిల్దార్— "నన్నే మోసం చేయాలని చూస్తావురే సాలా!?...." అంటూ.

వాచ్‌లను పానల్లో నుండి బయటకు తీస్తూన్న గార్డ్స్ "హవిల్దార్! యిందులో యేదో కాగితం కూడా వుంది" అంటూ తెచ్చి అతని కిచ్చారు.

ఇంగ్లీషులో వున్న ఆ లెటర్ని చదివిన హవిల్దార్ ఆశ్చర్యంగా చందర్ని చూస్తూ దాన్ని అతని మీదికి విసిరాడు.

దాన్ని చదువుతోన్న చందర్ ముఖం జేవురించింది. నిర్ఘాంత పోయాడతను. సత్తార్ అంతపని చేస్తాడని వూహించలేదు.

చందర్‌నుద్దేశించి రాయబడిన ఆ ఉత్తరంలో సంతకం లేదు.

అందులో ఇలా వుంది—

'చందర్!....అన్నం పెట్టిన అతివనే చెరపబోవడం ఘోర నేరం. నమ్మకద్రోహంతో మీ భారతజాతికే తీరని కళంకం తెచ్చిన నీచుడివి! నిన్ను చంపి నా చేతులు మలినం చేసుకోదలచలేదు. అలాగని, దెబ్బతిన్న పులి పగ బట్టకుండా వుంటుందని నువ్వనుకుంటే పొరబడ్డావ్.

బిజినెస్‌లో నువ్వెంత పంక్చ్యువల్‌గా వుంటావో నాకు తెలుసు....సరిగా పదకొండు గంటలకు ఇండియన్ సైడ్ బోర్డర్ పోస్టు దగ్గర వుండాలనుకున్నావు నువ్వు.

ఈ రోజు జనవరి ముప్ఫయ్. భారతదేశంలో మృత వీరుల మరణ దినాన్ని పాటించే రోజు. ఆ సందర్భంగా బోర్డర్ పోస్టులో మీరంతా నిశ్శబ్దాన్ని పాటించే సమయంలో—నీ కారులో దాచిన వాచ్‌లలో కొన్నయినా అంచెలంచెలుగా అలారం కొట్టేటట్టు ఏర్పాటు చేశాను. నా ప్లాన్ ఫలించినట్లయితే స్మగుల్డ్ సొత్తుతో నువ్వు సెక్యూరిటీ గార్డ్స్‌ని తప్పించుకోవడం కల్ల!

ఈ విధంగానైనా నా పగ తీరితే అక్తార్ మనసుకు వూరట కలుగుతుంది.

గుడ్‌బై మాన్....నిన్ను ఫ్రెండ్ అనడానికి సిగ్గుగా వుంది....'

శిలా ప్రతిమ అయిన చందర్‌ని కస్టడీలోకి తీసుకున్నారు గార్డ్స్. □

ఇండియా వాడని పొగాకు

ప్రతాప రవిశంకర్

విస్కీ పని చేస్తోన్నది. గ్లాసును కిందికి దించిన తర్వాత — బాటిల్లోని ద్రవాన్ని గ్లాసులోకి వంచుతున్నప్పుడు—

తలుపుమీద చప్పుడయింది.

లోపలకు రమ్మన్నాను.

తెరుచుకుంది తలుపు—వెంటనే చిన్న చప్పుడుతో

మూసుకున్నది.

అతను నా ఎదురుగా నిల్చుని వున్నాడు.

పొడుగ్గా, బలంగా, క్రూరంగా కనిపించినా అతను నవ్వుతున్నాడు.

"కూర్చో!"

నా యెదురుగా వున్న పేము కుర్చీలో యిమిడి పోయాడు.

కళ్ళు తిరుగుతున్నట్టుగా అనిపించింది.

అసలు అతను యెప్పుడో వస్తానని ఫోన్లో చెప్పాడు. అప్పట్నుంచే మందు కొట్టటం మొదలుపెట్టాను. అలా ఐతేనే నేను చెప్పదల్చుకున్నది క్లియర్‌గా చెప్పగలిగేది.

"ఎందుకు లేటయ్యింది?"

"బైకు ట్రబులిచ్చింది.... సారీ!"

నిల్చున్నాను. సిగరెట్టు వెలిగించాను. బాటిల్లో మిగిలిన విస్కీని గ్లాసులోకి వంచుకుని ఐస్ కూబ్స్ వేస్తున్నాడు అతను.

"జాన్సన్" పొగ వదులుతూ పిల్చాను.

"వూ!" అన్నాడతను తాగుతూ.

"నువ్వు అమెరికా వెళ్ళాలి."

అతను కూడా సిగరెట్ వెలిగించాడు.

"చెప్పండి" అతని పెదవుల మధ్యనించి బయటకు వచ్చింది పొగ.

కిటికీ దగ్గర నిల్చున్నాను.

వీధి దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

జనం యెక్కువగా లేరు రోడ్డుమీద—ఉండీ వుడిగీ కార్లు దూసుకువెళుతున్నాయి.

ప్రిపేరయినాను. అంతా నేను అనుకున్నట్టుగా జరిగితే

ఏడు లక్షల డాలర్ల సొమ్మును అమెరికన్ ఎక్స్‌ప్రెస్ ఇంటర్నేషనల్ బ్యాంకునించి రాబట్టుకోవచ్చు.

"బి ఎలర్ట్.... మన టొబాకో అమెరికాకు ఎక్స్‌పోర్ట్ అవుతోంది. దాన్ని షాఫెన్ ఓడలో బుక్ చేశాను. ప్రస్తుతం ఆ ఓడ సముద్రంలో ప్రయాణం చేస్తోంది. అది అమెరికాకు చేరకముందే నువ్వు అక్కడకు వెళ్ళి అది సముద్రంలో వుండగానే దాన్ని బాంబులతో పేల్చెయ్యాలి...."

"ఎందుకు?" జాన్సన్ అడిగాడు.

నవ్వేను.

"ఎందుకంటే మనం టొబాకో పేరుతో ఎక్స్‌పోర్టు చేస్తున్నది టొబాకో కాదు కాబట్టి....ఆ ప్యాకింగ్‌లో చెత్త కాగితాలున్నాయి. అర్థమయిందా జాన్సన్?"

తల వూగించాడు అతడు.

"మన మోసం బయటపడక ముందే షాఫెన్ నౌక సముద్ర గర్భంలో కలిసిపోవాలి."

"ఓకే! ఎగ్రీడ్."

"ఎంత కావాలి?" అడిగాను.

"రెండు లక్షలు."

నేనేమీ మాట్లాడలేదు. నాకు వచ్చే లాభంతో పోల్చుకుంటే రెండులక్షలు ఎక్కువేమీకాదు. అందుకే జాన్సన్‌కి రెండు లక్షలు యివ్వటానికి ఒప్పుకున్నాను.

"అంతా సిద్ధం.... రేపే నీ ప్రయాణం" అన్నాను.

తల వూపాడు జాన్సన్.

అతనికి పాతికవేల రూపాయలకు చెక్ రాసి ఇచ్చాను ఎడ్వాన్స్‌గా.

చెక్ తీసుకుని వెళ్ళిపోయాడు జాన్సన్.

వెంటనే నా కళ్ళముందు పెద్ద శబ్దంతో సముద్రంలో

పేలిపోయి మంటల మధ్య చిక్కుకుపోయిన షాఫెన్ నౌక కనిపించింది.

నవ్వుకున్నాను.

జాన్సన్ సమర్ధుడు.

2

మోటార్‌బైక్ తారు రోడ్డుమీద రివ్వున దూసుకుపోతున్నది.

జాన్సన్ జుట్టు గాలిలో యెగురుతోన్నది. అతనికి హుషారుగా వున్నది.

రెండులక్షల రూపాయల ఎసైన్‌మెంటు....అమెరికా ప్రయాణం. ఖర్చులన్నీ రణధీర్‌రావ్‌వే.

ట్రాఫిక్ అంతగా లేదు.

ఓ రోడ్‌లోకి తిప్పి బైక్‌ను స్లో చేశాడు. ఆ రోడ్‌లో ఇరవై ఎనిమిదవ నెంబర్ యింట్లో అతను వుంటున్నాడు. జాన్సన్ పెళ్ళి చేసుకోలేదు.

పెళ్ళి అతని వృత్తికి ఓ అడ్డు అని అతని నమ్మకం.

బైకు ఆగిపోయింది. గేటు నెట్టి లోపలకు తీసుకువెళ్ళి తర్వాత గది తలుపులను తెరిచాడు

అప్పటికే మందు వూపు చాలావరకు తగ్గిపోయినట్లు అనిపించింది.

గది తలుపులు మూసి జేబులోనించి సిగరెట్టుపెట్టె సైజులో వున్న టేప్‌రికార్డర్‌ని బయటకు తీశాడు.

సోఫాలో కూర్చుని దాన్ని ఆన్ చేశాడు.

'బి ఎలర్ట్....మన టొబాకో అమెరికాకు ఎక్స్‌పోర్టు అవుతోంది. దాన్ని షాఫెన్ ఓడలో బుక్ చేశాను...."

రణధీర్ రావ్ మాట్లాడినదంతా రికార్డర్‌లో మరోసారి విని జాన్సన్ పెద్దగా నవ్వాడు.

ఎందుకయినా మంచిదని అతను రణధీర్ రావ్ మాట్లా డినదంతా రికార్డు చేశాడు. తనేదయినా ప్రమాదంలో యిరు కుంటే అతన్ని కూడా యిరికించవచ్చు. అవసరమను కున్నప్పుడు బ్లాక్ మెయిల్ చేసుకోవచ్చు.

ఆఫ్ చేశాడు.

మాటలు ఆగిపోయాయి.

వెంటనే తలుపుమీద చప్పుడయింది.

రికార్డర్ని జేబులో వుంచుకుని వెళ్ళి తలుపు తీశాడు.

లీల నవ్వుతూ లోపలకు వచ్చింది. ఆమె పెదవులు ఎర్రగా వున్నాయి-లిప్స్టిక్‌తో.

జాన్సన్ తలుపు మూసి ఆమెను గట్టిగా కౌగలించు కున్నాడు.

"వదులు....ఏమిటా తొందర" అన్నది లీల.

"ఇరవై రోజులయింది" అన్నాడు జాన్సన్ సంతో షాన్ని అదుముకుంటూ....అతను లీల వస్తుందని వూహించ లేదు.

"అందుకే నేనూ వచ్చాను. ఈరోజు హోటల్ దిల్ కుష్‌లో నా ప్రోగ్రాం లేదు" అన్నదామె.

లీల కేబరే డాన్సర్. అప్పుడప్పుడు ఆమె బలంగా వుండే జాన్సన్ పొందు కోరి వస్తూ వుంటుంది. అంతే కాదు-డబ్బు కోసం స్మగ్లింగ్ చేసే మనుషులకు సహాయ పడుతూ వుంటుంది. కొన్నిసార్లు ఆమె జాన్సన్‌కు కూడా ఉపయోగపడింది.

జాన్సన్ ఏదో వాగుతున్నాడు.

అతను విస్కీ-బాటిల్‌ని తెరిచి గ్లాసులోకి వొంచి సోడా కలిపాడు.

లీలకు ఆఫర్ చేసినా ఆమె తీసుకోలేదు. సుతారంగా

విస్కీగ్లాసును అతని పెదవులకు అందించింది.

జాన్సన్ తాగాడు. బాగా తాగాడు. ఆ తర్వాత లీల వొడిలో ఒరిగిపోయాడు

అతను లేచే ప్రమాదం లేదని అనుకొన్న తర్వాత లీల లేచి జాన్సన్ జేబులో నించి రికార్డర్ బయటకు తీసింది.

ఆన్ చేసింది.

రణధీర్‌రావ్ మాటలు బయటకు వచ్చాయి. పూర్తిగా విన్న తర్వాత రికార్డర్‌లో నించి టేప్‌ని తీసి తన హాాండ్ బాగ్‌లో నించి మరో టేప్‌ని తీసి అందులో వుంచింది.

తర్వాత రికార్డర్ జాన్సన్ జేబులోకి వెళ్ళిపోయింది.

అప్పుడు లీల అతన్ని బెడ్ మీదకు చేర్చి పక్కనే పడుకున్నది జాన్సన్ని కావలించుకుని.

3

రిసీవర్ ఎత్తాను.

"హలో.... నేను లీలను మాట్లాడుతున్నాను."

"నువ్వా... నేను వూహించినది నిజమే కదూ?"

"అవును."

"నువ్వు వెళ్ళిన పని ఏమయింది?"

"సక్సెస్.... జాన్సన్ మీ మాటలన్నీ రికార్డు చేశాడు. రాత్రి ఆ టేప్‌ని నేను తీసుకున్నాను. దాన్ని తీసుకుని ఇప్పుడే మీ దగ్గరకు వస్తున్నాను."

లీల మాటలు నాకు ఎంతో హుషారును, సంతోషాన్ని కలిగించాయి.

"గుడ్.... వెరీగుడ్.... వెంటనే వచ్చెయ్యి" అన్నాను.

"ఇప్పుడే బయలుదేరుతున్నాను" అని ఫోను పెట్టేసింది లీల.

సిగరెట్ వెలిగించాను.

జాన్సన్ మీద కోపం వచ్చింది. అతను ఇలాంటి యేర్పాటేదో చేసి వుంటాడని అనుమానం వచ్చింది. అందుకే వెంటనే లీలను పిల్చి అతనిమీద ప్రయోగించాను.

వెరీగుడ్.

లీల గూఢచారిణిగా బాగా రాణిస్తుందనిపించింది.

బయట కారాగిన చప్పుడు—

మరో ఐదు నిమషాల తర్వాత లీల నా గదిలో వున్నది. ఆమె హ్యాండ్ బాగ్ లో నించి టేప్ని బయటకు తీసింది. దాన్ని నా దగ్గర వున్న రికార్డర్ లో వుంచి ఆన్ చేశాను.

ఉలిక్కి పడ్డాను.

ఇడియట్ ....

నన్ను బ్లాక్ మెయిల్ చేసేవాడు....

నా గొంతు క్లియర్ గా వున్నది.

మాటలు ఆగిపోయిన తర్వాత టేప్ని బయటకు తీసి గాస్ లైటర్ తో దాన్ని వెలిగించాను. టేప్ కరిగిపోయింది కొన్ని క్షణాల్లో.

లీలకు థాంక్స్ చెప్పి ఓ రెండువేల రూపాయలు కూడా యిచ్చాను.

డబ్బు చూడగానే లీల కళ్ళు మెరిశాయి.

"తెలివయినదానివి .... మళ్ళీ ఫోన్ చేస్తాను" అన్నాను.

థాంక్స్ చెప్పి వెళ్ళిపోయింది లీల.

రిలీఫ్ అనిపించింది.

ఫ్రిజ్ లో నుంచి బీర్ బాటిల్ తీసి సగం తాగేశాను.

మళ్ళీ తాగుతున్నప్పుడే—

ఫోన్ మోగింది.

రిసీవర్ తీసుకున్నాను.

"ఏర్‌పోర్టు నుంచి జాన్సన్‌ను మాట్లాడుతున్నాను.... ఇంకో పది నిమిషాల్లో విమానం బయలుదేరబోతోంది— ముందుగానే అన్ని యేర్పాట్లూ చేసినందుకు థాంక్స్. నేను అమెరికా వెళ్ళబోయే ముందు ఒక మాట. రాత్రి మీరు మాట్లాడినదంతా రికార్డు చేశాను. నేనేదయినా ప్రమాదంలో ఇరుక్కుంటే...."

అతను ఇంకా ఏదో చెబుతున్నాడు.

పెద్దగా నవ్వి "డియర్ జాన్సన్-నువ్వు చెప్పినదంతా నిజమే. ఐతే నువ్వనుకున్నట్టు ఏమీ జరగదు. నేను నీ కంటే తెలివయినవాడ్ని....నువ్వు బుద్ధిగా చెప్పిన పని పూర్తిచేసి ఇండియాకి వచ్చెయ్యి....ఇంతకీ ఆ టేప్ నీ దగ్గర లేదు....నా దగ్గర కాలిపోయి వున్నది."

రిసీవర్ పెట్టేశాను.

తలెత్తాను.

షాక్....

ఎదురుగా పోలీసులు నిల్చుని వున్నారు.

ఇన్‌స్పెక్టర్ చేతిలో బేడీలు వున్నాయి.

అతను నవ్వుతూ "అంతా విన్నాను రావ్. మీరనుకున్నట్టు కూడా ఏమీ జరగదు. మీరన్నట్టు ఆ టేప్ మీ దగ్గర కాలిపోవటం నిజమే ఐనా మీరు మీ మాటల్ని మరో సారి వినే అవకాశం వుంది" అని జేబులో నించి చిన్న టేప్ రికార్డర్ తీసి ఆన్ చేశాడు.

"బి ఏలర్ట్....మన టొబాకో అమెరికాకు...."

మతి పోయింది....

"ఆశ్చర్యంగా వుందనుకుంటాను. ఇదంతా లీలవల్లనే జరిగిందని చెబుతాను. జాన్సన్‌తోపాటు లీల కూడా మిమ్మల్ని చీట్ చేసింది. తను జాన్సన్ దగ్గర కాజేసిన

టేప్‌ని మీకు యివ్వబోయే ముందు మరో టేప్ మీద రికార్డు చేసింది. తర్వాత వీలు చూసుకుని మిమ్మల్ని జాన్సన్ని బ్లాక్ మెయిల్ చెయ్యవచ్చని - ఈ మధ్య లీల చట్టవిరుద్ధమయిన పనుల్లో వర్క్ చేస్తోందని తెలిసింది. అందుకే ఆమె మీద నిఘా వుంచాము....మీరు దొరికి పోయారు....ఏమయినా లీలకు థాంక్స్ చెప్పుకోవాలి...." అన్నాడు అతను ముందుకు వస్తూ!

మళ్ళీ ఫోన్ మోగింది.

ఇన్‌స్పెక్టర్ రిసీవర్ తీసుకున్నాడు.

రెండు నిముషాలు మాట్లాడి రిసీవర్ పెట్టేసి "జాన్సన్‌ని ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు....ఇక మీరు కూడా అరెస్టు అవుతారా!" అనిఅడిగాడు ముందుకొచ్చి.

నా గుండె పేలిపోతున్నట్టు అనిపించింది.

ఇప్పుడు నా కళ్ళ ముందు - నేను చేసిన మోసాన్ని అమెరికాకు చేర్చటానికి సముద్రం మీద వయ్యారంగా ప్రయాణిస్తున్న షాపెన్ నౌక కనిపిస్తోంది. □

కండ్లుముచ్చి ఆట!

"ఎందుకమ్మా నా కళ్ళు మూశావు. కండ్లముచ్చి ఆట ఆడుతున్నావా?" అని అడిగాడు తాత, తన మనవరాలిని.

"లేదు తాతా! నీవు కళ్లు మూస్తే ఆస్తి నాన్నకు దొరుకు తుందట కదా! రాత్రి నాన్న చెప్పాడు అమ్మతో. అందు కని ఇప్పుడు నీ కళ్ళు మూసాను" అంది మనవరాలు అమాయకంగా.

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

జొన్నలగడ్డ రామలక్ష్మి

తీనసికి ఇచ్చేక్షువ!

"హలో - రామనాథంగారండీ?"

"అవును-రామనాథాన్నే మాట్లాడుతున్నాను."

"నమస్కారం సార్!"

"ఎవరు మీరు!"

"నే నెవరో చెబుతాను. ఇంట్లో క్యాషు రెడీగా వుందా

సార్!"

రామనాథం వులిక్కిపడి — "క్యాషు సంగతి మీ కెందుకు!" అన్నాడు చిరాగ్గా.

"క్యాషు అక్కర్లేకపోతే మీ కెందుకు ఫోన్ చేస్తాను సార్...."

"ఎవరు మీరు?"

"అర్జంటుగా నాకు పాతిక వేలు కావాలి సార్...."

"ఎవరు మీరు?"

"మీరు పాతిక వేలు తీసుకుని ఒంటిరిగా బయల్దేరండి. సూర్యప్రకాశరావు వీధిలో రమణా ఎంపోరియం పక్కనున్న సందులోనికి తిరిగి మనిషి ఎదురయ్యేవరకూ ప్రొసీడవండి నేనే మీకు ఎదురుగా వచ్చి డబ్బు తీసుకుంటాను. కూడా ఎవర్నీ తీసుకుని రావద్దు. ఎవరికీ ఈ విషయం చెప్పొద్దు. నేను మిమ్మల్ని వెయ్యి కళ్ళతో కనిపెడుతూనే వుంటాను. పొరపాట్లు చేస్తే ప్రమాదం...."

"ప్రమాదం ఎవరికి?"

"మీ అమ్మాయికి."

"ఏ అమ్మాయికి?" అన్నాడు రామనాథం. ఆయన కిద్దరు కూతుళ్ళు.

"పెద్దమ్మాయి ప్రమీల...."

రామనాథం వులిక్కిపడి "ప్రమీలకు నీవల్ల ప్రమాద మెందుకు?" అన్నాడు.

ఫోన్‌లో నవ్వు వినబడింది. "ఆమె నా వద్ద బందీగా వుంది కాబట్టి."

"హలో—ఎవరు నువ్వు?"

"డబ్బు తీసుకుని రమణా ఎంపోరియమ్...."

"నా వద్ద డబ్బు రెడీగా లేదు."

"అయితే రేపటిదాకా టయిమిస్తున్నాను. రేపు బ్యాంకు తీయగానే బ్యాంకుకు వెళ్ళండి. డబ్బు విత్‌డ్రా చేయండి. బ్యాంకులో మీకు కవ రొకటి అందుతుంది. మీరు నన్నె క్కడ కలుసుకోవాలో అందులో వుంటుంది. ఆ కవర్ని మీరు రోడ్ మీదకు వచ్చేక అక్కడ చించి చదవాలి. భిన్నంగా ప్రవర్తించారా మీ అమ్మాయికి ప్రమాదం. నేను దగ్గరే వుండి మిమ్మల్ని వెయ్యి కళ్ళతో కనిపెడుతూ వుంటాను."

"హలో - ఎవరు నువ్వు?"

"ఈవేళ్టి కింతే...." అవతల క్లిక్ మంది.

రామనాధం కంగారుగా వెంటనే ఇంటికి ఫోన్‌చేసి "ప్రమీల ఇంట్లో వుందా?" అనడిగాడు.

"ప్రమీల తన స్నేహితురాలితో పిక్నిక్ వెళ్ళింది" అని సమాధానం వచ్చింది.

"ఎక్కడికి?"

"అరకులోయ__"

"ఎప్పుడు?"

"ఈరోజు వుదయం,"

"నా కెందుకు చెప్పలేదు!"

"ఈ యింట్లో మీకు చెప్పి చేయాలంటే సంక్రాంతి పండుగ దీపావళినాడు చేసుకోవాల్సి వుంటుంది...."

"నాతో చెప్పకుండా పనులు చేస్తే అసలు పండుగ జరుపుకునే యోగమే వుండకపోవచ్చు" చాలా కోపంగా అన్నాడు రామనాధం.

"ఏం జరిగిందండీ?" అంది రామనాధం భార్య అరుణ.

"ముందు అరకులోయ పిక్నిక్‌కు తీసుకుని వెళ్ళిన దాని స్నేహితురాలి వివరాలు చెప్పు."

"ఆమె పేరు లలితకుమారి. క్రిస్టియన్."

"అడ్రసు...."

చెప్పింది అరుణ.

కొద్ది క్షణాల్లో రామనాథం కార్లో లలితకుమారి ఇంటికి వెళ్ళాడు. అతడు వెళ్ళగానే ఓ యువతి వచ్చి ఇంటి తలుపు తీసింది.

"లలితకుమారిల్లు ఇదేనామ్మా?" అన్నాడు రామనాథం.

"ఇదేనండి. నేనే లలితకుమారిని...." అన్నదామె.

"ఇంట్లో ఇంకెవరూ లేరా?"

"అమ్మా, నాన్నా ఊళ్ళో లేరండి. మీరెవరు?" అన్నదామె.

"నేను ప్రమీల తండ్రిని...." అన్నాడు రామనాథం.

"నమస్కారమండి. లోపలకు రండి—కూర్చోండి." మర్యాదగా ఆహ్వానించిందామె. రామనాథం లోపలకు వెళ్ళి కూర్చున్నాడు. గదిని పరిశీలనగా చూశాడు. మధ్యతరగతి ఇల్లు.

"పిక్నిక్‌కి వెళ్ళలేదా?" అడిగాడు రామనాథం.

"లేదండి."

"ఎందుకని?"

ఒక్క క్షణం తటపటాయించింది లలితకుమారి.

ప్రమీల, లలితకుమారి కలసి అరకులోయ వెడదామనుకున్నారు. ప్రమీల చిత్రకారిణి లలితకుమారి కవయిత్రి. అందుకని ఇద్దరూ కలసి వెడతే ప్రోగ్రాం బాగుంటుందనుకున్నారు.

ప్రమీల తనకు ఇంట్లో ఒప్పుకోని ప్రమాద మున్నదని అంది. లలితకుమారి కలాంటి ఇబ్బంది ఏమీ లేదు. ఈ రోజు పుదయం ఎనిమిది గంటలకు బస్‌స్టాండులో కలిస్తే

ప్రయాణం ఉన్నట్లు, లేకపోతే లేనట్లు! తమ ప్రయాణం గురించి ఎవరికీ ఎక్కువగా చెప్పవద్దని ప్రమీల అంది. తన ఇంటికి కూడా రావద్దని అంది.

"ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది వరకూ బస్ స్టాండులో తన కోసం ఎదురు చూశాను. తను రాలేదు."

"మా యింట్లో ఏడున్నరకు బయలుదేరిందిట. ఇంత వరకూ దాని ఆచూకి తెలయదు. నువ్వేమయినా చెప్పగల వేమోనని వచ్చాను."

లలితికుమారి కంగారుగా—"ఇంట్లో ఒప్పుకోలేదేమో ననుకున్నాను. అంటే ఇంట్లో బయల్దేరిందన్న మాట...." అంది.

"అవును...." అంటూ రామనాథం లేచాడు.

"అయ్యో-కాఫీ కలుపుతానండీ—"అంది లలితకుమారి.

"ఇప్పు డలాంటివేమీ వద్దు. ప్రమీల గురించి నీకే మైనా ఆచూకీ తెలిస్తే ఫోన్ చేసి చెప్పు. నీకై నువ్వు ఎలాంటి ఆచూకీ తియ్యడానికి మాత్రం ప్రయత్నించకు" అన్నాడు రామనాథం.

తిరిగి కార్లో కూర్చున్నాక ఏం చేయాలో అయనకు తోచలేదు. ఇప్పు డెక్కడికి వెళ్ళాలి?

ఆ కిడ్నాపర్ కీరోజే దబ్బిచ్చేసి వుంటే బాగుండేది. అమ్మాయి రాత్రికే యింటికి చేరేది. ఇప్పుడు ప్రమీల ఎక్కడుందో, ఏమయిందో తెలియదు. డిటెక్టివ్‌ల కెవరి కయినా తెలియబరిస్తే?

ఏమో - ఆ కిడ్నాపర్ తనని అనుసరించే వుంటున్నా డేమో!

ప్రమీల లలితకుమారిని కలుసుకొనడం కోసం ఇల్లు వదిలింది. అమె స్నేహితురాలిని కలుసుకునేలోగా కిడ్నాప్

అయిపోయింది.

రామనాథం తిన్నగా ఇంటికి వెళ్ళాడు. భార్యను పలకరించాడు. జరిగింది చెప్పాడు.

అరుణ శోకాలు ప్రారంభించింది.

"ఏడ్చి లాభం లేదు. ఈ విషయం ఇంకెవరికీ చెప్పవద్దు. రేపు గుట్టు చప్పుడు కాకుండా పాతిక వేలూ యిచ్చి దాన్ని విడిపించుకుని వస్తాను" అన్నాడు రామనాథం.

విషయం పోలీసులకు గానీ వేరెవ్వరికి గానీ చెప్పకూడదని నిర్ణయమయింది.

2

రామనాథం బ్యాంకులో అందర్నీ గమనిస్తున్నాడు. ఇంతలో ప్యూన్ వచ్చి ఆయన చేతికో కవరిచ్చి—"మీ పేరు రామనాథం కదండీ" అన్నాడు.

రామనాథం కవరు అందుకుంటూ—"ఎవరిచ్చారు నీకిది?" అన్నాడు.

"మా బ్యాంకు స్టాపుకి పెళ్ళి శుభలేఖలు. ఇచ్చినాయన దూరాన్నుంచి మిమ్మల్ని చూపించి మీకూ ఒకటిమ్మన్నాడు...." అన్నాడు ప్యూన్. అతడి చేతిలో ఇంకా చాలా కార్డు లున్నాయి.

బ్లాక్ మెయిలర్ చాలా తెలివయినవాడు. ఈ కార్డులిచ్చే వ్యవహారాన్ని పసిగట్టి వాటిలో తన ఉత్తరం కూడా పెట్టేశాడు. ఎవడో బ్యాంక్ కస్టమర్ పెళ్ళి అయుంటుంది. ఆరాతీస్తే వాడెవరో తెలియొచ్చు. కానీ కొండను త్రవ్వి ఎలకను పట్టడం సాధ్యపడుతుందా!

ఇప్పుడీ పెళ్ళివారింటికి వెడితే - కార్డులిచ్చి బ్యాంకు కెవర్ని పంపించారో వారు ఆరా చెప్పగలరా! వాళ్ళ హడావుడిలో వాళ్ళీ శుభలేఖ లెవరి కిచ్చారో చెప్పగలరా? ఒక

వేళ చెప్పగలిగినా దానివల్ల పెద్దగా ప్రయోజన ముండక పోవచ్చు. బ్లాక్ మెయిలరూ, అతడూ ఒకరు కాకపోవచ్చు.

ఆలోచిస్తూ కూర్చోడానికి వ్యవధి లేదు. ఆయన రోడ్డు మీదకు వచ్చి కవరు చింపాడు. శుభలేఖ తనకు సంబంధించినది కాదు. అందులో వేరే వుత్తరం వుంది. తనెలా బయలుదేరాలో వ్రాసి వుంది. కారెక్కొద్దు—నడిచే బయలుదేరు అని వ్రాసి వుంది అందులో.

రామనాథం ఉత్తరంలో చెప్పిన ప్రకారం నడిచాడు. సందులు గొందులు తిరిగాడు. ఆయన ఓ ఇరుకు సందులోకి దూరగానే వెనుక నుంచి ఓ మనిషి వున్నట్లుండి ముందుకువచ్చి నిలబడి—"డబ్బిలా ఇవ్వు...." అన్నాడు.

అతడు సన్నగా, పొడుగ్గా వున్నాడు. ఖరీదయిన బట్టలు ధరించి వున్నాడు. ముఖం సరిగ్గా కనిపించడం లేదు. రుమాలు అడ్డంగా కట్టుకున్నాడు. కళ్ళు మాత్రం మెరుస్తున్నాయి. ఆ కళ్ళలో చురుకుదనం వుంది.

"ఎవరు నువ్వు!" అన్నాడు రామనాథం.

"డబ్బు...." అన్నాడతడు.

రామనాథం జేబులోంచి నోట్లకట్టలుతీసి అతడికిచ్చాడు.

బ్లాక్ మెయిలర్ డబ్బు లెక్కపెట్టుకున్నాడు. "గుడ్!" అన్నాడు.

"ఎవరు నువ్వు?" అన్నాడు రామనాథం.

"డబ్బు సరిపోయింది. రేపు సాయంత్రానికి మీ అమ్మాయి యిల్లు చేరుకుంటుంది—...." అన్నాడు బ్లాక్ మెయిలర్.

"నువ్వెవరని అడుగుతున్నాను?" రామనాథం రెట్టించాడు.

"వ్యాపారస్థుడివి. నేనీ ప్రశ్నకు బదులిస్తానో యివ్వనో

తెలియకే అడుగుతున్నావా?"

"నా కూతుర్నెందుకు కిడ్నాప్ చేశావు!"

"డబ్బుకోసం...."

"దానికేమీ హాని జరగడం నా కిష్టం లేదు...."

"నా వల్ల ఆమెకు ఎటువంటి హాని జరుగదు. ఇది నా హామీ—"

"నువ్వు నీ హామీ నిలబెట్టుకున్నదీ లేనిదీ రేపు అమ్మాయి చెబుతుంది...." అని ఉలిక్కిపడి—"అవును.... నేనిప్పుడే డబ్బు ఇచ్చేస్తే నువ్వు అమ్మాయిని రేపటిదాకా ఎందుకుంచుకుంటావు? ఇప్పుడే వదిలిపెట్టు...." అన్నాడు రామనాథం.

"అది నా వల్ల కాదు. అందుకు కారణం మీ అమ్మాయి చెబుతుంది రేపు...." అన్నాడతడు.

"ఏమిటా కారణం?"

"అధిక ప్రసంగం వద్దు...." అంటూ క్షణాలమీద అతడక్కణ్నించి మాయమయ్యాడు.

రామనాథం కొద్దిసేపు అక్కడే వుండిపోయాడు. కూతురి కోసం రేపటిదాకా ఆగాలంటే ఆయన మనసెందుకో కీడును శంకిస్తోంది. ఎలాగో అలా ఆ కిడ్నాపర్ గురించి ఆరాతీయాలనుకున్నాడు.

ఆయన నడుచుకుంటూ బ్యాంకుకు వెళ్ళాడు. ఫలానా బ్యాంకులో కార్డులు పంచి పెట్టడానికి వెళ్ళిందెవరోనని వాకబు చేశాడు. అతడి పేరు సుదర్శనరావని తెలిసింది. సుదర్శనరావు కాలేజీ స్టూడెంటు.

రామనాథం కాలేజీకి వెళ్ళి సుదర్శనరావును కలుసుకున్నాడు. అతడిలో కిడ్నాపర్ లక్షణాలు కనబడలేదు. మనిషి పొట్టిగా వున్నాడు. కళ్ళలో మెరుపైనా లేదు.

రామనాథం తన్నుతాను పరిచయం చేసుకుని—"నీకు

నేను తెలుసా?” అనడిగాడు.

“తెలియదండి” అన్నాడతడు వినయంగా.

“బ్యాంకులో ఫ్యానుకు పెళ్ళి శుభలేఖ లిచ్చింది నువ్వేనా?”

అతడు క్షణం తడబడి — “మా కాలేజి బస్సు వచ్చేస్తోంది. అది మిస్సయిపోవాలనే అనుకున్నాను. కానీ బస్ స్టాపులో ఒకతను ఆ శుభలేఖలు తనిస్తానన్నాడు. అందులో కొంపమునిగేదేముంది? బ్యాంకులో ఫ్యాన్ కివ్వడమేగదా. అందుకని అతడికే ఇచ్చేశాను” అన్నాడు.

“అసలు నువ్వు తిన్నగా బ్యాంకుకు వెళ్ళకుండా బస్ స్టాపులో ఎందుకున్నావు?” అన్నాడు రామనాథం.

“అక్కడ నా ఫ్రెండ్ కనిపించిందండి....అదే అదే కనబడ్డాడండి.”

రామనాథం సుదర్శనరావును వదిలిపెట్టాడు.

సుదర్శనరావు కిచ్చారు పెళ్ళివారు కార్డులు—బ్యాంకులో ఫ్యాన్ కిమ్మని. బ్యాంకు ఎదురుగా వున్న బస్‌స్టాపులో అతడికి తన గర్ల్‌ఫ్రెండ్ కనిపించి వుంటుంది. మనసటు లాగింది. బస్సు రాబోగా తామిద్దరూ విడిపోవలసివచ్చినందుకు అతడికి బాధ కలిగి మనసులోని బాధను పైకి వెలిబుచ్చాడు. అక్కడే వున్న కిడ్నాపర్ ఆ అవకాశాన్నుపయోగించుకున్నాడు.

రామనాథం మళ్ళీ బ్యాంకుకు వెళ్ళాడు.

“నీకు కార్డులిచ్చిన మనిషిని నువ్వు మళ్ళీ గుర్తుపట్టగలవా?” అనడిగాడాయన ఫ్యాన్ని.

“అతడెలాగుంటాడో వర్ణించగలవా?”

ఫ్యాన్‌వర్ణన తన కెదురుపడిన కిడ్నాపర్‌కి సరిపోతోంది.

“అతణ్నిదివరకెప్పుడైనా చూశావా?”

"లేదండి—"

"మళ్ళీ చూస్తే గుర్తుపట్టగలవు కదూ?" మళ్ళీ అడిగాడాయన.

"మీరిలా తీసుకురండి. నేనలా గుర్తుపట్టేస్తాను."

"చాలా బాగుంది" అనుకున్నాడు రామనాథం. వెనుకటికెవడో కొండ ఎత్తి వీపుమీద పెడితే తను మోసేస్తానన్నాట్ట.

రామనాథం షాపుకు వెళ్ళలేదు. ఆయనకు మతి మతిలో లేదు. తిన్నగా ఇంటికే వెళ్ళాడు. ఆ కిడ్నాపర్ కూతుర్ని రేపటిదాకా ఎందుకుంచుకుంటున్నాడు? వయసొచ్చిన పిల్ల. దాన్నేం చేస్తాడు వాడు?

3

భార్యాభర్తలిద్దరూ ప్రమీలకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. గడియారం సాయంత్రం నాలుగు గంటలు కొట్టేసరికి ప్రమీల ఉత్సాహంగా ఇంట్లో అడుగుపెట్టింది. ఆమె ఇంచుమించు గెంతుకుంటూ వస్తోంది.

ఆమెనలా చూడగానే రామనాథం బాధ సగం తగ్గింది. అరుణ కూతుర్ని పలకరిస్తూ—"ఎలా వున్నావమ్మా...."

"వండ్రఫుల్" అంది ప్రమీల.

రామనాథం ఆశ్చర్యపడ్డాడు. కిడ్నాపర్ దగ్గర్నుంచి వస్తూ వండ్రఫుల్ అంటుందేమిటి? కొంపదీసి కూతురు కిడ్నాపర్‌తో కలిసి నాటకమాడలేదు కదా!

"వండ్రఫుల్ ఏమిటమ్మా?" అన్నాడాయన.

"మమ్మీ చెప్పలేదా డాడీ...." అంది ప్రమీల.

"ఏమని?"

"నా అరకు ట్రిప్ గురించి....

"ఎవరెవరు వెళ్ళారు?"

"నేను, లలితకుమారి...."

"ఓహ్....నువ్వు అరకు వెళ్ళావా? మరి నీ స్నేహితురాలు లలితకుమారి నీకోసం ఎదురుచూసి తానిక్కడే వుండిపోయానందే!" అన్నాడు రామనాధం.

"మీరు ...మీరు....లలితకుమారిని కలుసుకున్నారా?" అంది ప్రమీల తడబడుతూ.

"అవును. నువ్వు పిక్నిక్కి వెళ్ళావని అమ్మ చెప్పగానే నేను లలితకుమారి ఇంటికి వెళ్ళి అన్నీ వాకబు చేశాను."

"ఓహ్—డాడీ—నా గురించి వాకబు చేయడానికి మీకింత తీరుబడి ఎక్కడిది?" అంది ప్రమీల ఆశ్చర్యంగా.

రామనాధం ఆ ప్రశ్నకు దెబ్బతిన్నాడు. ఆయనకు ఎంతసేపూ వ్యాపారమే తప్పితే ఇంట్లో ఎవరిగురించీ పట్టదు.

"తీరుబడి ఎక్కడిదో తర్వాత చెబుతాను కానీ — ఈ రెండ్రోజులూ నువ్వెక్కడున్నావో—ఏం చేశావో నాకు చెప్పాలి...." అన్నాడు రామనాధం.

"చెప్పేస్తాను.మీరు నన్నేమీఅనకూడదు"అంది ప్రమీల.

"కంగారుపడవలసిందేమీ లేదు కదా...." అన్నాడు రామనాధం కంగారుగా.

ప్రమీల చెప్పసాగింది.

ప్రమీల, లలితకుమారి కలిసి పిక్నిక్ వెడదామనుకున్నారు. అందుకు తల్లి ఒప్పుకోదేమోనని భయపడింది ప్రమీల. అందుకని లలితకుమారితో తనకోసం బస్ స్టాండులో ఎదురుచూసి రాని పక్షంలో రానట్లే అని చెప్పింది. అయితే తల్లి ఈ పిక్నిక్ కార్యక్రమానికి ఒప్పుకుంది. అంతవరకూ బాగానే వుంది.

ఆ రాత్రి ప్రమీల తన ఇంకో మిత్ర బృందాన్ని కలుసుకుంది. అదంతా కాస్త హై సర్కిల్! మర్నాటికి వాళ్ళింకో ప్రోగ్రాం వేశారు.

ఒరిస్సాలో వరదలొచ్చాయి. ఆ సందర్భంగా కొందరు పాత బట్టలు. ఆహార పదార్థాలు సేకరించారు. అవసరంలో వున్నవారికి వాటిని స్వయంగా పంచిపెట్టాలనుకుంటున్నారు. మొత్తం పదిహేనుగురు వలంటీర్లు. అందులో పదిమంది మగవాళ్ళు. అయిదుగురు ఆడవాళ్ళు. ప్రమీలను కూడా వలంటీర్లలో లెక్క వేశారు.

"నేను రాను. మా యింట్లో ఒప్పుకోరు" అంది ప్రమీల.

"నీకులా చాలామంది అన్నారు. ఇది తప్పించుకుందుకో ఉపాయంకూడా వుంది—" అన్నాడు వలంటీర్ల నాయకుడు శేఖర్.

"ఏమిటది?"

"మనలో డబ్బు కెవరికీ లోటు లేదు. అందువల్ల వలంటీర్లుగా రానివాళ్ళకు అయిదువేలు జరిమానా. వరదబాధితుల సహాయ నిధికి అయిదువేలు చందా ఇచ్చినా సరే - లేదా మాతో వలంటీరుగా వచ్చినా సరే...." అన్నాడు శేఖర్.

ప్రమీలకు తెలుసు. ఇలాంటి విషయాల్లో తండ్రి పీనాపి అని. అందుకోసం ఆమె వలంటీరుగా వెళ్ళాలనే నిశ్చయించుకుంది.

"ఆ విషయం మీ అమ్మకు చెప్పొచ్చుగా ...." అన్నాడు రామనాథం కాస్త కోపంగానే.

"అరకు లోయకు పిక్నిక్ అంటే ఒప్పుకుంటుంది కానీ వరద బాధితుల సహాయానికి వెడతానంటే అమ్మ ఒప్పుకుంటుందా?" అంది ప్రమీల.

ఉన్నట్లుండి రామనాథానికో అనుమానం వచ్చింది— "అసలు నువ్వు నిజమే చెబుతున్నావా?"

"మీరిలా అడుగుతారని నాకు ముందే తెలుసు" అంటూ ఆమె తన హ్యాండ్ బ్యాగులోంచి కొన్ని ఫోటోలు తీసి

ఇచ్చి—"అక్కడి పరిస్థితి చూస్తే హృదయం ద్రవించి పోతుంది డాడీ—ఒక్క రోజైనా వాళ్ళ నాదుకుంటే ఎంతో తృప్తి కలుగుతుంది ఎవరికైనా" అంది.

రామనాథం ఆ ఫోటోలు చూశాడు. ఎందరివో ఆకలి కళ్ళు. వాటి మధ్య అన్నపూర్ణలా ప్రమీల.

"మీరుమీ ప్రోగ్రాంగురించి ఎక్కడ చర్చించుకున్నారు?"

"పార్కులో."

"అక్కడెవరైనా మీ మాటలు విన్నారా?"

ప్రమీలకు ఆ ప్రశ్నలోని అంతరార్థం తెలియలేదు. అయినా ఆమె గుర్తుచేసుకుని చెప్పింది. ఒకతను వచ్చి—"నేనూ మీ కార్యక్రమంలో చేరవచ్చా" అని అడిగాడు. తమ ప్రోగ్రాం పూర్తిగా తెలుసుకుని వెళ్ళాడు. అతడి వర్ణన కిడ్నాపర్ రూపురేఖలకు సరిపోయింది. అంటే వాడు కిడ్నాపింగ్ చేయకుండానే తెలివిగా డబ్బు లాగాడు తన దగ్గర్నుంచి. తను నిన్ననే కూతుర్ని అప్పగించమంటే—"అది నా వల్ల కాదు. కారణం మీ కూతురే రేపు చెబుతుంది...." అన్నాడు. ఆ మాటల అర్థం ఇదా?

తను ఫూల్ అయ్యాడు.

"అమ్మాయి అన్నపూర్ణలా వుంది" అంది అరుణ ఫోటోలు చూస్తూ.

"అవును...." అన్నాడు రామనాథం అన్యమనస్కంగా.

"డాడీ నన్ను మెచ్చుకుంటారని నాకు తెలుసు" అంది ప్రమీల.

"ఎందుకని?" అంది అరుణ.

"ఆయనకు అయిదువేలు ఆదా చేశానుగా-వలంటీరుగా వెళ్ళి!"

రామనాథానికి నవ్వాలో, ఏడవాలో తెలియలేదు. □

ఎగిరే మనిషి

శ్రీసాయిశ్రీ

అది రవి నిలయం.

డిటెక్టివ్ తారానాథ్ తన ఏర్‌కండిషన్డు రూంలో కూర్చొని, 'అపరాధ పరిశోధన' చదువుతున్నాడు. నోటి లోని పైపులో సిగరెట్ ఎర్రగా కాలుతోంది.

తలుపుమీద రెండుసార్లు 'టిక్, టిక్' మని కొట్టినట్లు

వినిపించింది. తారానాథ్ తలయెత్తి చూచాడు. గోపి తలుపు తోసుకుని లోపలికి వస్తూ, "మాస్టర్జీ"—అని పిలిచాడు. గోపీ పదహారేళ్ళ చురుకైన చాకులాంటి కుర్రాడు.

"ఓ గోపి! రా....ఏం విశేషాలు?"—అడిగాడు తారానాథ్, గోపి చేతిలోని 'టెలిగ్రాం' పత్రికను చూస్తూ.

టెలిగ్రాం దినపత్రిక పాఠకులను వుర్రూతలూగిస్తూంది. ప్రతి వ్యక్తీ చదివే పాపులర్ పేపర్ అది.

"ఈ రోజు టెలిగ్రాం పత్రికలోని స్పార్క్స్ కన్నా, నేను రాత్రి చూచిన వింత చాలా గొప్పది మాస్టర్జీ!"

అలవాటు చొప్పున డిటెక్టివ్ తారానాథ్ చిన్నగా ఈల వేశాడు "ఏమిటా మిస్టరీ?" అని ప్రశ్నించాడు.

"నిజంగా అది మిస్టరీయే! వినండి మాస్టర్జీ! రాత్రి ఏం తోచక సినిమా చూద్దామని సాఫ్బైర్స్ థియేటర్‌కు వెళ్ళాను. తిరిగి వస్తూ నాయర్ టీకొట్లో ఒక స్ట్రాంగ్ సింగిల్ చాయ్ త్రాగా. ఆ తర్వాత హుషారు వచ్చింది. మా యింటికి షార్ట్‌కట్ రోడ్డు వుంది. అది కన్నమ్మ పేటలోని స్మశానం ప్రక్కగా పోతూంది. దాటుతూ వుండగా వేపచెట్టు క్రింద ఏదో కదిలినట్లనిపించింది. ఏవో మాటలు వినిపించాయి.

చుట్టూ ముళ్ళచెట్లుండటంవల్ల బాగా చీకటిగా వుంది. రోడ్డుమీద జనం ఎవరూ లేరు. నా కడుపులో ఏదో దేవినట్లనిపించింది. బింకంగానే నడిచిపోతున్నా. చిన్న రైలు గేటు దాటాను. నాకు ఒక వ్యక్తి ఆగ మేఘాలమీద వస్తూ కనిపించాడు. అతని వాలకం చూస్తే త్రాగి వున్నట్లనిపించింది. అతని చేతిలో ఒక మూట వుంది. దుస్తులు చాలా ఖరీదైనవే. రోడ్డుమీద ఇంకెవరూ కనిపించలేదు... నాకు భయం వేసింది."

గోపి చేతిగుడ్డతో ముఖానపట్టిన చెమట తుడుచుకున్నాడు. రాత్రి జరిగిన సంఘటనల ప్రభావంతో ఏర్ కండీషన్డు గదిలో కూడా గోపికి చెమట పోయసాగింది. తారానాథ్ చిరునవ్వు నవ్వాడు.

"వాట్? తారానాథ్ శిష్యుడికి భయమా? వింతగా వుందే!" అన్నాడు.

"భయం అంటే భయంకాదు మాస్టర్జీ! ఏదో మొత్తం మీద అలాంటిదే!"

"ఆల్ రైట్! చెప్పు గోపీ! మంచి సస్పెన్స్‌లో ఆపేశావ్" అని తారానాథ్ అంటుండగా వెనుకవైపు నుంచి తలుపు తీసుకుని వనజ లోపలికి వచ్చింది ఆమెతోపాటు కమ్మని సువాసన కూడా లోపల ప్రవేశించింది.

వనజ చేతిలోని ట్రేలో పూరీ, వుర్లగడ్డ కూర—ప్లేట్లు రెండున్నాయి. పొగలు చిమ్ముతోంది కూర.

"ఓ! గురూ శిష్యులూ ఏదో రామాయణంలో పడినట్లున్నారే! ముందు ఆత్మారాముణ్ని తృప్తిపరచండి" అన్నది ట్రే టేబుల్ మీద వుంచి.

"యస్ సర్! దేన్నైనా త్రోసేయొచ్చు కానీ, శ్రీమతి హుకుం కాదనగలిగిన మొనగాణ్ణా?" అంటూ తారానాథ్ కొంటెగా చూస్తూ నవ్వాడు.

"చాల్లేండి....మరీనూ!" అంటూ ఆమె వెన్నెల జల్లులాగ నవ్వింది. ముందుకు పడివున్న వాల్జెడ కొనలను వ్రేలితో మెలిబెడుతూ కూర్చుంది. ఇద్దరూ అవి తిని కాఫీలు ముగించారు.

"వనజా! గోపి ఒక థ్రిల్లింగ్ కథ చెప్తున్నాడు.... నీవుకూడా విను" అంటూ టూకీగా అంతకు ముందు జరిగి

నది భార్యకు చెప్పాడు. "ఊ గోపీ! ఇక నీవు తరువాయి పూర్తిచేయ్. త్రాగినట్లున్న వ్యక్తి కనిపించాడు....." అని కథ నందించి తారానాథ్ ఒక తాజా సిగరెట్ వెలిగించాడు.

"....కనిపించాడు. అతనికీ, నాకూ మధ్య యాభై గజాలుంటుంది. ఆ సమయంలో ఒక పాము పోతూంది, రోడ్డుకు అడ్డంగా. ఆ వ్యక్తి దానిమీద కాలువేశాడు. అది బుస్సున తలెత్తి అతన్ని కాటు వేసింది కసక్కున. దాన్ని అతను లెక్క చేయలేదు. అదే వేగంగా నడుస్తున్నాడు ముందుకు. నేను రోడ్డు ప్రక్కనున్న గానుగ చెట్టు క్రింద నిలబడ్డా. అతను నన్ను దాటుకుంటూ వెళ్ళి పోయాడు. ఆ సమయంలోనే నేను ఒక అద్భుతాన్ని గమనించాను. ఒక గోళాకారం లాంటి వస్తువు భూమికి నాలు గడుగుల ఎత్తులో గాలిలో ఎగురుతూ పోతోంది. అతనెంత వేగంగా నడుస్తున్నాడో అంతే వేగంతో అదీ వెళ్తోంది. ఒక టెన్నిస్ బాలంత వుందా గోళం. రెండు చిన్న బాణాలు గుచ్చినట్లు అగుపించింది. దాని మధ్య భాగంలో నుంచి ఒక నయాపైసంత అత్యంత కాంతివంతమైన వెలుతురు సరిగ్గా ఆ మనిషి గుండెలమీద పడుతోంది. అది చూచే నాకు భయమేసింది."

"ఏమిటీ? నిజంగా అలా జరిగిందా?" అడిగింది వనజ ఆశ్చర్యపోతూ. "గోళం గాలిలో తేలుతూ పోవడమేమిటీ?" అన్నది కన్నులు పెద్దవిచేసి.

"అవునమ్మా. అదే ఆశ్చర్యం. ఆ సమయంలో నేను దాదాపు గజగజలాడాను అది చూచి" అంటూ గోపి నవ్వాడు.

ఎడం కన్ను కొద్దిగా మూసి తారానాథ్ ఆలోచనలో మునిగిపోయాడు. రెండు నిమిషాలు గడిచిపోయాయి.

"వెల్ గోపీ! తరువాత నీవు యింటికి వెళ్ళావా?"

"లేదు మాస్టర్జీ! నా కథ ఇంకా వుంది.... నేనలానే స్థంభించిపోయి వున్నా. ఈలోగా ఆ గోళం, ఆ మనిషి రైలుగేటు దగ్గరికి చేరారు. సైదాపేట నుంచి ఎలక్ట్రిక్ ట్రైన్ వేగంగా వస్తోంది. ఆ గోళం ఆగకుండా గాలిలోకి చాలా ఎత్తు లేచింది. రివ్వున దానితోపాటు ఆ మనిషి లేచాడు! ఇద్దరూ వేగంగా పోతున్న ట్రైన్ మీదుగా దాటి వెళ్ళిపోయారు!!"

"వండర్" అని అరిచింది వనజ.

"అదే! నేను మొండి ధైర్యంతో ఆ వైపు పరుగెత్తాను. రైలు వెళ్ళిపోయింది. ఆ మనిషి చాలా వేగంతో స్మశానం వైపు వెళ్ళుతున్నాడు. నేనూ వేగంగానే నడుస్తున్నా. అతను ముళ్ళచెట్టు చాటుగా కనుమరుగైనాడు. నేను పరుగెత్తాను—ఏం జరుగుతుందోననే ఆతురతతో. స్మశానం దగ్గరికి వచ్చాను. ప్రక్కరోడ్డు మీద ఆ వ్యక్తి పడివున్నాడు. ఆ గోళం కనిపించలేదు. అతను నురుగులు కక్కుతున్నాడు. కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ అరుస్తున్నాడు బాధతో మెలికలులు తిరుగుతూ. చూస్తుండగానే చుట్టుప్రక్కలున్న గుడిసెల్లోని జనం అక్కడ చేరారు. ఎవరో పాము కరచినట్లుందన్నారు. మరియొక వ్యక్తి పాముమంత్రం తెలిసిన ఒక తాతను పిలుచుకుని వచ్చాడు. తాత మంత్రం వేశాడు. కొద్దిసేపట్లో ఆ వ్యక్తి నోటిలో నుంచి వచ్చే నురుగులు తగ్గాయి. లేచి నిలుచున్నాడు. 'నాకేమైంది? ఎక్కడున్నా'నని అడిగాడు. సంగతి వివరించి, 'మీకేం భయం లేద'ని చెప్పాడు తాత. కృతజ్ఞతలు తెలుపుకుంటూ రెండు పదిరూపాయల నోట్లు తాతచేతిలో పెట్టి, అతను గబగబా పెద్ద రోడ్డు మీదికి నడిచాడు. నేను

అతని వెంటే నడిచాను. ఈలోగా అతను ఒక టాక్సీలో ఎక్కాడు. అది కదిలింది. నేను చేసేదిలేక యింటికి నడిచి వెళ్ళాను, జరిగిందంతా నెమరువేసు కుంటూ" అని ముగించాడు గోపి.

భార్యాభర్తలిద్దరూ ఆ కథను మంత్రముగ్ధుల్లాగ వింటూ వుండిపోయారు. యెవరూ ఏమీ మాట్లాడలేదు.

నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఫోన్ గావుకేక పెట్టింది.

"ఎస్....రవి నిలయం. డిటెక్టివ్ తారానాథ్ స్పీకింగ్ ప్లీజ్!" అన్నాడు రిసీవర్ అందుకుని.

"..........."

గబగబా రెండు నిమిషాలు అవతల వ్యక్తి యేదో చెప్పాడు.

"ఓకే! పది నిమిషాల్లో నేను అక్కడికి వచ్చి వాలు తాను మిస్టర్ సత్యం"—అన్నాడు తారానాథ్ తన ఒమేగా వాచ్ చూచుకుంటూ సాలోచనగా.

గోపి సంగతి వూహించి, కారుషెడ్ వైపు నడిచాడు. స్టాండుమీద వున్న నేవీబ్లూ కోటు అతనికి అందించింది వనజ.

కోటుతోపాటు ఆమె చేయికూడా అందుకుని తన వైపు లాక్కున్నాడు. చెర్రీస్‌లాగున్న ఆమె పెదవుల్లోని మధు వునురుచి చూచి బయటికి నడిచాడు తారానాథ్. పోర్టికోలో కారు సిద్ధంగా వుంది.

తారానాథ్ కారెక్కాడు.

2

"గుడ్‌మార్నింగ్ మిస్టర్ సత్యం! ఏమైందీ? ఆచూకీ" అంటూ సుడిగాలిలాగా దూసుకుని వచ్చాడు డిటెక్టివ్ తారానాథ్ ఆ గదిలోకి.

"గుడ్‌మార్నింగ్ తారానాథ్‌జీ....ఇంకా ఏమీ తెలియ లేదు" అంటూ వెనుతిరిగి విష్ చేశాడు ఇన్‌స్పెక్టర్ సత్యం. ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్ట్సు, ఫోటోగ్రాఫరులు తమ పనుల్లో హడావిడి పడుతున్నారు. ఎదురుగా వున్న ఐరన్ సేఫ్ ఖాళీగా కనిపిస్తోంది. తారానాథ్ అంతా ఒకసారి నిశితంగా పరికించాడు.

"పెద్ద దొంగతనమే జరిగిందన్నమాట!"

"అవును. రాత్రివరకూ లక్షాధికారి అని పేరు మోసిన చక్రధర్‌గారు ఇప్పుడు బికారి. పాపం ఆయన చాలా అప్‌సెట్ అవుతున్నారు."

"వివరంగా చెప్పు మిస్టర్ సత్యం" అన్నాడు తారా నాథ్.

"రాత్రి పన్నెండు గంటలకు యెవరో పిలిచినట్లు అని పించిందట. చక్రధర్‌గారు మెలుకువవచ్చి తలుపు తీశాడు. ఎవరూ కనిపించలేదుట. తలుపు తీయగానే తనమీద ఏదో ప్రకాశవంతమైన లైటు పడిందనీ, అది దాదాపు ఒక గుండ్రని గోళంలో నుంచి వస్తోందనీ, ఆ గోళం గాలిలో నిలిచి వుందనీ, ఆ తరువాత తనకేమైందో తెలియదనీ చెప్పారు చక్రధర్‌గారు. కన్నులు తెరిచి చూస్తే...."

"....తాను స్మశానానికి ప్రక్కగా వున్న రోడ్డు పైన పడివున్నానని కూడా చెప్పివుంటారు గదూ?" అన్నాడు తారానాథ్ కనుబొమ్మలు ఎగరవేస్తూ.

"కరెక్ట్? ఎలా వూహించారు. మీరేది చేసినా, చెప్పినా గారడీ లాగుంటుంది" అని ఆశ్చర్యపోయాడు సత్యం.

తారానాథ్ షెల్ఫులోని సిగరెట్‌ను, అగ్గిపుల్లతో వెలి గించి తాపీగా అన్నాడు. "అలాంటి మహేంద్రజాలం ఏమీలేదు. మా గోపి నోటిమీదగా ఒక వింత గురించి

విన్నదానికీ దీనికీ పోలికలూ, సమయం అన్నీ సరి పోయాయి. అందువల్లే ఆఖరున జరిగివున్న విషయం చెప్పగలిగాను. అంతే...."

"అంటే, ఈ విషయం అప్పుడే మీ నోటీసుకు వచ్చిం దన్న మాట."

"మిస్టర్ సత్యం! రాత్రి మా గోపి చూచిన విషయం యిది" అంటూ ఆసాంతం అంతా వివరించాడు. అది విని ఇదేదో ఇంద్రజాలంలా గుందనుకున్నాడు సత్యం.

"ఇది అలాంటిదేం కాదు సత్యం. రాకెట్ యుగంలో ఏదీ ఇంద్రజాలం కాబోదు. ఆ గోళాకారంలో ఏదో మహ త్తరశక్తి యిమిడివుంటుందని నా వుద్దేశ్యం. ఆ సైంటిస్టు చాలా మేధావి అయివుండాలి."

"ఆ గోళంలో నుంచి వచ్చే కాంతి మాటేమిటి?"

తారానాథ్ ఒకసారి తల పంకించాడు. సిగరెట్ పొగ దట్టంగా పీల్చి వదులుతూ అన్నాడు! "మనం ఆటం ఏజిలో నుంచి రాకెట్ యుగంలోకి అడుగు పెట్టాం. మిస్టర్ సత్యం! ఆటం శక్తితో చేయలేనిది లేదు. కీలు బొమ్మలు ఏం చేస్తాయి? మనం ఎలా ఆడిస్తే అలా ఆడుతాయి గదా. బహుశ ఆ గోళంలో ఆటం రియాక్టివ్ రేసెస్ వున్నా యనుకో; ఆ గోళాన్ని రాకెట్‌లాగే తాను అనుకున్న చోటికి సైంటిస్టు నడపగలిగితే ఆ పైన మన అనుమానా లన్నీ మంచులాగా విడిపోతాయి.

"ఆ సైంటిస్టు ఆ గోళాన్ని చక్రధర్ ఇంటి వైపు ప్రయోగించి, దానిలోనే అమర్చివున్న వైర్‌లెస్ సెట్ ద్వారా అతన్ని పిలిచి వుంటాడనుకుందాం. తలుపు తీయ గానే గోళంలో నుంచి ప్రసరిస్తున్న ఆక్టివ్ రేస్ చక్రధర్ గారిమీద పడివుంటాయి. దాన్ని ఆయన కాంతి అని వర్ణించి

వుంటారు. మిస్టర్ సత్యం! ఇలా ఆలోచించి చూస్తే...."

—ఆగి తారానాథ్ ఇన్‌స్పెక్టర్ ముఖంలోకి నవ్వుతూ చూశాడు.

...."మీరు చెప్పిందంతా వింటే నాకు మతిపోతోంది తారానాథ్‌జీ" అంటూ సిగరెట్ ఆఖరిదమ్ము పీల్చి, బూటు క్రిందవేసి, పిప్పి చేశాడు దాన్ని సత్యం.

"లీవిట్! ఒకసారి చక్రధర్‌గార్ని చూద్దాం పదండి."

ఇద్దరూ చక్రధర్ గదిని చేరారు. అతని స్థితి చాలా దయానీయంగా వుంది. మనిషి నీరసంగా కనపిస్తున్నాడు. తారానాథ్‌ను, అతనికి పరిచయం చేశాడు ఇన్‌స్పెక్టర్ సత్యం.

"నమస్తే! మీ పేరు ప్రఖ్యాతులు విన్నా. మిమ్మల్ని కాస్మాపాలిటన్ క్లబ్‌లో ఒకటి రెండు సార్లు చూచాను. కాని పరిచయం ఈ విధంగా అయ్యింది" అంటూ బజ్జర్ నొక్కాడు చక్రధర్. నౌకర్ వచ్చాడు.

"రంగయ్యా! మూడు ఓవల్...." అన్నాడు.

"ఇప్పుడవన్నీ...."

"ఏమున్నాయిలేండి...."

"ఆల్‌రైట్! మిమ్మల్ని రెండు ప్రశ్నలు అడుగుతాను. శ్రమ అనుకోకుండా...."

"శ్రమేముంది? అడగండి చెప్తాను."

"మిమ్మల్ని రాత్రి ఒక పాము కరిచింది కదూ?" అని అడిగాడు తారానాథ్ అతని కాలి వైపు చూస్తూ "అప్పుడు మీకు ఒళ్ళు తెలుసా?"

"కరిచినట్లు నాకేమీ తెలియదు. నేను కన్నులు తెరిచినప్పుడు ఎవరో చెప్పారు."

"మీరు స్మశానం ప్రక్కనున్న రోడ్డుమీద యెలా పడి

వున్నారో ఆలోచించారా?"

ఈలోగా ఓవల్ వచ్చింది. ముగ్గురూ అందుకున్నారు.

నిజానికి తారానాథ్‌గారూ! నాకు చాలా ఆశ్చర్యమేసింది. నేనెప్పుడూ నిద్రలో అంతదూరం వెళ్ళలేదు."

"అంటే కొంతదూరం వెళ్ళుతుంటారన్న మాట."

చక్రధర్ నవ్వాడు నిండుగా. "మీరు ఆవులిస్తే ప్రేగు లెక్కపెట్టేటట్లున్నారు. మీ రన్నది నిజమే. నిద్రలో అప్పు డప్పుడూ నేను లేచి నడుస్తుంటాను. మా తోటలోకి వెళ్ళుతా....లేదా ఓపెన్ టెరెస్‌మీది కెళ్ళుతా. అంతే...."

"ఇదికూడా అలాంటిదే ననుకున్నారా!"

"అలా అనే సరిపెట్టుకున్నా రాత్రి. నీరసంగా వుండటం వల్ల నిద్రపోయాను. ఈ రోజు వుదయం రంగయ్య వచ్చి లేపి, ఈ ఐరన్ సేఫ్ గురించి చెప్పాడు."

"రంగయ్య ఎలాంటివాడు?"

"సాధువు. నన్ను చిన్నప్పటి నుంచి భుజాలమీద ఎత్తుకున పెంచాడు రంగయ్య. అతని చేతికే తాళాలు యిచ్చి ఐరన్ సేఫ్ తెరిపించి, డబ్బు తెప్పించుకునేవాణ్ణి. ఎప్పుడూ నల్లపూసకూడా పోలేదు" అన్నాడు చక్రధర్ బాధగా.

"సారీ! ఒక్కొక్కసారి నీడను కూడా అనుమానించటం మా వృత్తిధర్మం. సందేహ నివృత్తి చేసుకున్నానంతే!"

"ఫర్వాలేదులెండి తారానాథ్‌గారూ!"

"రాత్రిమీరు ఎలెక్ట్రిక్ ట్రైనుమీదుగా గాలిలో నడిచారు. మీ చేతిలో ఒక మూట వుంది!"

"ఏమిటీ?" ఆశ్చర్యంతో లేచి నిలిచాడు చక్రధర్. "నన్ను నమ్మమంటారా?"

తారానాథ్ అలవోకగా నవ్వాడు. "గోపీ!" అంటూ

కేక వేశాడు.

"మాస్టర్జీ!" అంటూ లోపలికి వచ్చాడు గోపి.

"గోపీ! వీరినేగా నువు రాత్రి చూచింది!"

"అ....వు....ను!"

"ఈ కుర్రాడిని మీరు రాత్రి చూశారా?" అడిగాడు తారానాథ్ చక్రధర్‌ను చూస్తూ.

రెండు నిమిషాలు ఆలోచించాడు గోపీని చూస్తూ. ఆ తర్వాత తల వూపాడు చక్రధర్. "ఇతను మంత్రించిన తాత ప్రక్కన వున్నాడనుకుంటా! నేను టాక్సీ ఎక్కి-పోతుండగా రోడ్డుమీద కూడా కనిపించాడు."

3

తారానాథ్‌ను పత్రికావిలేఖరులు చుట్టుముట్టారు బయట రాగానే.

"నమస్తే తారానాథ్‌జీ!" "వణక్కం", "గుడ్ మార్నింగ్"—రకరకాల వందనాలకు చేతులు జోడించి, నిండుగా నవ్వుతూ నమస్కరించాడు తారానాథ్. నాలుగైదు ఫ్లాష్‌బల్బులు వెలిగాయి. కెమేరాలు క్లిక్ మన్నాయి.

"ఈ కేసు విషయంలో...." అని ప్రశ్న వేశాడు 'బెలిగ్రాం' పత్రిక విలేఖరి రామస్వామి.

"అప్పుడే ఏం చెప్పేది....ఏదైనా ఇది మనిషి చేసిన దొంగతనం కాదు!"

"....కాదా? అంటే దయ్యం చేసిందంటారా?" అని అడిగాడు యింకో విలేఖరి. కొందరు పళ్ళు ఇకిలించారు. తారానాథ్ కూడా నవ్వాడు అలవోకగా.

అదే సమయంలో ఇన్‌స్పెక్టర్ సత్యం అతనికి కనిపించాడు. తారానాథ్ కనుసైగచేశాడు యెవరికీ తెలీకుండా.

"నాకు అనుమానంలేదు ఆ విషయంలో....రాత్రి తలుపు

ఎవరో కొడుతున్నారనిపించి చక్రధర్‌గారు తలుపు తెరిచారు. ఎదురుగ్గా ఎవరూ లేరు. కాని ముఖం మీద బలంగా దెబ్బ తగిలింది. అది దయ్యమే అనుకున్నారాయన. కన్నులు తిరిగి పడిపోయారు. ఐరన్ సేఫ్‌లో వున్న నగలూ, డబ్బూ మాయమైనాయి. ఆయన్ను తనతోపాటే తీసుకుని వెళ్ళి కన్నమ్మపేటలోని స్మశానానికి ప్రక్కనే వున్న రోడ్డుమీదికి విసిరివేసింది. వికటంగా నవ్వుతూ స్మశానం వైపు నడిచి, బావిలోకి దూకింది. అ సమయంలో పాము కరిచింది ఆయన్ను. ఏవరో మంత్రం వేశారు. ఆయన చాలా నీరసపడిపోయారు."

"అయితే-ఇది దయ్యంచేసిన దొంగతనమన్న మాటే!"

"అంతే మరి!" అన్నాడు నవ్వుతూ తారానాథ్. సత్యం అతన్ని గాభరాగా చూశాడు. విలేఖరులు వెళ్ళిం తర్వాత రహస్యంగా అన్నాడు తారానాథ్.

"మిస్టర్ సత్యం! నేను చెప్పినదంతా అసత్యమే! నీలి వార్తే అనుకోండి. దీనివల్ల ఒక ప్రయోజనం వుంటుందని ఆశిస్తున్నా నేను. ఇదంతా చేసిన వ్యక్తి చాలా సంతోషిస్తాడు. మనల్ని ఫూల్స్ చేశాననుకుంటాడు. గర్వంతో విర్రవీగుతాడు. మనలో చాలా మంది దయ్యాలున్నాయని నమ్ముతారు. తాను చేసిన తప్పులన్నీ దయ్యాలమీదుగా పోతాయని అనుకుంటాడు ఆ ప్రబుద్ధుడు. విచ్చలవిడిగా చేస్తాడు దొంగతనాలు....ఆ పైన మన వలలోకి నేరుగా నడిచి వస్తాడు. మనం పుచ్చులు బిగించవచ్చు. చక్రధర్ గారు కూడా దయచేసి ఇవే మాటలు చెప్పేటట్లు చూడండి. వారం తిరిగేటప్పటికి ఆ ఘనుడు మన చేతిలోకి వచ్చేస్తాడు! ఇది ఆయనక్కూడా మంచిది. ఓకే....శలవ్!"

డిటెక్టివ్ తారానాథ్ కారును ముందుకు దూకించాడు.

ఏంచేయాలో తోచక తలగోక్కున్నాడు ఇన్స్పెక్టర్ సత్యం.
కొద్దిసేపైన తరువాత చక్రధర్ గదివైపు నడిచాడు.

"తారానాథ్ చెప్పింది పత్రికల్లో అచ్చు అయింది.

"దయ్యం చేసిన దొంగతనాలు!"

మద్రాసు, 25.

నగరంలో జరిగిన వింత దొంగతనాలవల్ల ఇప్పటి దాక కోటి రూపాయల ఆస్థి నష్టమైందని తెలుస్తూంది. దీనిలో చాలా భాగం బంగారం, నగలూ. గతవారం రోజులుగా జరుగుతున్న ఈ దొంగతనాల వల్ల ప్రజలు భయంతో తల్లడిల్లుతున్నారు. ఇంకేం జరగబోతోందో?

కారణ మేమిటోగాని దొంగతనం జరిగిన యింటి యజమానిగాని....అతని తాలూకువారుగానీ కన్నమ్మపేట లోని స్మశానానికి దగ్గర్లో పడివుంటున్నారు స్పృహ తప్పి. వాళ్ళు చెప్పేది వింటే మతిపోతోంది!

ఇది దయ్యం చేస్తున్న పని అంటున్నారు!

4

M.R.K. 17553 కారు సైదాపేట బ్రిడ్జిదాటి, కన్నమ్మపేటను చేరింది. స్మశానానికి దగ్గర్లో వున్న ఒక చెట్టు నీడన కారు ఆగింది. అందులోంచి ఇద్దరు వ్యక్తులు దిగారు. వాళ్ళిద్దరి చేతుల్లో పెద్ద పెద్ద లెదర్ బాగ్స్ వున్నాయి. వాళ్ళ దుస్తులు నల్లగా వున్నాయి.

స్మశానం వైపు దారితీశారు ఇద్దరూ. వెంటనే దయ్యపు ముఖాల్లాంటి తొడుగులు ముఖానికి వేసుకుని, స్మశానంలోని బావి దగ్గరికి చేరారు. ఒక షెడ్డులో మధ్యాహ్నం కాల్చిన శవం తాలూకు చితి ఇంకా కాలుతూ ఎర్రగా కనిపిస్తోంది. రెండు గుడ్లగూబలు వారికి స్వాగతం

చెపుతూ అటూ ఇటూ చక్రవాకాలు కొట్టాయి అరుస్తూ. ఏవో చిన్న చిన్న జంతువులు పరుగెత్తాయి భయంతో. ఆ భయంకర వాతావరణంలో ఆ ఇద్దరూ నిర్భయంగా నిలిచి అటూ ఇటూ చూచారు. అనుమానించవల్సినది ఏదీ కనిపించలేదు.

బావి ప్రక్కగా కూర్చున్నారు. అప్పుడు దాదాపు గంట పన్నెండు కావస్తోంది.

ఒక చిన్న గుంట తీశారు. లెదర్ బాగ్స్‌లోని ఏవేవో వస్తువులు తీసి బయటపెట్టారు. అందులో మోటారు జాకీ లాంటి వస్తువునుతీసి ఆ గుంటలో వుంచి కావల్సిన యాంగిల్లో పాతారు. దానిపైన ఒక గోళాన్ని వుంచారు. హైపవర్ బాటరీతో జాకీలాంటి దాన్ని వైర్లతో కలిపారు. రెండు మూడు మీటర్లూ, ఒక స్విచ్ బోర్డ్ బాటరీతో కలుప బడ్డాయి. అన్నిటినీ ఒక్కసారి సరిచూచుకున్నారు.

"చరన్‌షీ! క్విక్ .... రెడ్ స్విచ్ వేయ్" అన్నాడొకడు.

"యస్.బాస్!" అంటూ ఆ పని పూర్తి చేశాడు చరన్‌షీ.

రెండు నిమిషాలు కిచ్‌మని శబ్దల వినిపించింది. ఆ గోళం రంగు మారింది. నిమిషాల్లో దాని మధ్య భాగంలో నుంచి నయాపైసంత గుండ్రని కాంతివంతమయిన లైటు కనిపించింది.

"బాస్! ఈ రోజు మన చికింగ్రాకెట్‌కు ఎవరు ఎదురౌ తారు?" అడిగాడు చరన్‌షీ, గోళాన్ని సరియైన కోణంలోకి సర్దుతూ. గోళంలాగున్న దానిపేరు చికింగ్రాకెట్!

బాస్ మాట్లాడలేదు. మీటర్ మీదవుంది అతని దృష్టి. యాంగిల్ తప్పిందంటే ఆ గోళం సరియైన చోటికి చేరదు. ఏ నాపసన్యాసినో లాక్కొస్తుంది. అప్పుడు బాస్ చేతికి బూడిద తప్ప యింకేమీ దొరకదు. బాస్‌కు కావల్సింది—

బంగారు రంగారు పిచ్చుకలు! డబ్బున్న మహారాజులు!!

అంతా సరిగ్గా చూచుకున్న తరువాత చరన్‌షీ అడిగిన ప్రశ్నకు జవాబు యిచ్చాడు బాస్: "శేఠ్ నాథూరాం భగత్‌రాం ఈ రోజు మన చికింగ్రాకెట్ చేత ఆకర్షించబడు తాడు. అతను నిన్ననే అయిదువేల బంగారుకాసులు కొనుగోలు చేశాడని చదివాను, టెలిగ్రాం పేపర్లో. అవి అతని ఐరన్‌సేఫ్‌లో వున్నాయని నాకు నమ్మకంగా తెలిసింది."

"ఫైవ్‌థౌజెండ్ గోల్డ్ కాయిన్స్!" ఆశ్చర్యపోయాడు చరన్‌షీ.

"చరన్‌షీ! మనం ఈమధ్య సంపాదించిందంతా రేపు మన దేశానికి చేరవేస్తాం. మనం ఎంత బంగారం సంపాదిస్తే అంత లాభం మన దేశానికి. బంగారు లేని దేశం చిల్లిగవ్వకు కూడా కొరగాదు. ఆ దేశంలో ఏముంటుంది-మట్టితప్ప. ఈ విధంగా మనం భారతదేశంలోని బంగారాన్నంతటినీ మన దేశానికి చేరవేయాలి. మనం దండిగా యుద్ధ సామగ్రిని, ఆయుధాలనూ చేసుకోవచ్చు. ఆ పైన సరిహద్దుల్ని చెరిపివేస్తాం. మన దేశం నిర్ణయించిన సరిహద్దుల్ని నోరు మూసుకుని మిగత దేశాలన్నీ ఒప్పుకోవాల్సిందే! చైనా దేశపు సరిహద్దులు హద్దు లేకుండా పెరుగుతాయి.

"ఈ దేశపువాళ్ళు యిదంతా దయ్యాలు చేశాయని అనుకుంటూ, పూజలూ, పునస్కారాలూ చేస్తూ వుంటారు. మన చికింగ్రాకెట్ యిదంతా చేస్తుందని వాళ్ళకేం తెలుస్తుంది?" అంటూ బాస్ కీచుగా నవ్వాడు. చరన్‌షీ కూడా అతన్ని అనుకరించాడు. ఇద్దరి కన్నులు భారతదేశం యెడల గల ఈర్ష్యతో భగ్గుమన్నాయి.

"గ్రీన్ లైట్ వెయ్"—అన్నాడు వాచ్ చూచుకుంటూ

బాస్. చరన్‌షీ వేశాడు.

వెంటనే చికింగ్రాకెట్ (గోళం) గాలిలోకి తారాజువ్వ లాగా వెళ్ళింది రివ్వున. బాస్ క్రిందికి వాలివున్న తన పొడుగాటి మీసాలను దువ్వుకున్నాడు సగర్వంగా.

జాకీలాగున్న వస్తువులోంచి వూదా రంగులో ఏదో వెలుగు వస్తూనే వుంది. బాస్ హెడ్‌ఫోన్ తగిలించు కున్నాడు.

పది నిమిషాలు గడిచాయి.

"చరన్‌షీ! చికింగ్రాకెట్ సరిగ్గా వెళ్ళి శేఠ్ గదిముందు ఆగింది" అన్నాడు బాస్ మీటర్‌వైపు చూస్తూ.

చేతిలోని మైక్రోఫోన్‌గుండా, "శేఠ్ జీ, ఓ శేఠ్‌జీ!" అని పిలిచాడు. ఆ శబ్దం చికింగ్రాకెట్‌లో అమర్చబడి వున్న వైర్‌లెస్‌సెట్ ద్వారా ప్రసారమైంది.

రెండు నిమిషాలు గడిచిపోయాయి.

"గుడ్! మన చిక్రింగ్రాకెట్ శేఠ్‌పైన పనిచేస్తోంది. మైండ్ కంట్రోలింగ్ రేస్‌ను ఫోకస్ చేస్తోంది.... శేఠ్! ఐరన్‌సేఫ్ తెరు....ఊ....జల్దీ! దానిలోని అయిదువేల బంగారుకాసులూ, మిగిలిన జ్యూవెలరీ తీసుకుని ఆ సంచీలో వేసుకుని వెంటనే యిక్కడికి రావాలి....చికింగ్రాకెట్ నీ కెదురుగ్గా వుంది. దానివెంటనే నీవు నడిచిరావాలి...." అలా ఆర్డర్స్ జారీ చేస్తున్నాడు బాస్.

శేఠ్ నాథూరాం భగత్‌రాం అతను చెప్పినట్లు చేయ సాగాడు తు.చ. తప్పకుండా. ఇరవై నిమిషాలు గడిచేటప్ప టికి శేఠ్ స్మశానాన్ని చేరాడు పెద్ద సంచితోసహా.

"గుడ్ శేఠ్‌జీ.... ఆ సంచీ నా చేతికి యిచ్చి, వెళ్ళి ఆ రోడ్డుమీద పడుకో....పో...." అన్నాడు బాస్. శేఠ్ మంత్రముగ్ధునిలా సంచి యిచ్చి వెళ్ళిపోయి రోడ్డుమీద పడి

పోయాడు.

టకటక స్విచ్‌లు మార్చి, చికంగ్రాకెట్‌ను జాకీ లాగున్న వస్తువుమీదికి రప్పించాడు బాస్. కొన్ని నిమిషాల్లో సామాన్లన్నిటినీ రెండు బాగ్స్‌లోకి సర్దేశారు. కారు దగ్గరికి చేరారు ఇద్దరూ.

ఇంతలో యెవరో బాస్‌పైకి దూకారు. అదే సమయంలో చరన్‌షీపైన యింకో వ్యక్తి లంఘించాడు.

నలుగురు మఫ్టీలోనున్న పోలీసులు వచ్చారు ఆ వైపు. ఈలోగా బాస్, చరన్‌షీలను స్పృహతప్పేటట్లుకొట్టారు—వాళ్ళను నీడల్లాగ అనుసరిస్తున్న తారానాథ్, సత్యంలు.

"మిస్టర్ సత్యం, వీళ్ళను మీకు ఒప్పగిస్తున్నా. నేరుగా మీ బాస్ దగ్గరికి తీసుకుని వెళ్ళండి. బావి దగ్గరున్న పాత ట్రంకులో మనం పెట్టిన రికార్డర్‌ను మరచిపోకండి. వాళ్ళ మాటలు రికార్డ్ అయివుంటాయి. శేఠ్‌ను కూడా తీసుకుని వెళ్ళండి. జరిగిందంతా మీ బాస్‌తో చెప్పండి. నేను మీ వెంట వున్నట్లు చెప్పకపోతే వెంటనే ప్రమోషన్ ఆర్డర్స్ పడవచ్చు" అన్నాడు నవ్వుతూ డిటెక్టివ్ తారానాథ్ తన కారును స్టార్టు చేస్తూ.

"తారానాథ్‌జీ! మీరు....నన్ను....అలాంటి...."

"సారీ బ్రదర్! సరదాగా అన్నా. అంతే!....ప్రమోషన్ లేకపోతే పోనీయండి. ఘాటు పొగడ్తలనన్నా పొందండి! విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!"—అంటూ కారును ముందుకు దూకించాడు డిటెక్టివ్ తారానాథ్.

పదినిమిషాల తరువాత ఇనస్పెక్టర్ సత్యం తన పరివారంతో వాన్‌వైపు నడిచాడు. అతని ముఖంలో సంతోషం కనిపించింది కొట్టవచ్చినట్లు.

(పదహారేళ్ళనాటి 'అపస' కథ)

బి. రాజేశ్వరి

కొత్త అనుభవం

"ఏమండీ, సాయంత్రం తొందరగా యింటికి వచ్చేస్తారు కదూ!" మరోసారి హెచ్చరించింది సుధ.

"సర్టెన్లీ డియర్—నీకు ప్రోగ్రాం యిచ్చాక మాట తప్పటమే?" నవ్వుతూ భార్యవంక చూశాడు రఘు.

"ఏమో, మీ మగాళ్ళు గడపదాటేవరకు నీ మాటే వేద

వాక్కు అంటూ భార్యలను ఉబ్బేస్తారు. గడపదాటి ఒక్క అడుగు బయటికి వేసేసరికి భార్య గుర్తుండదు, భార్య వాక్కు అసలే గుర్తుండదు."

"అంటే మగాళ్ళందరి లిస్టులోకి నన్ను చేర్చేశావన్న మాట. ఇది చాలా అన్యాయం! భగవంతుడు నిన్ను క్షమించడు" అలవోకగా అన్నాడు రఘు.

వచ్చిన నవ్వును పెదాలమధ్య అందంగా బిగబట్టి "కన బడని భగవంతుడికన్న నా కళ్ళెదుటే వున్న యీ భగ వంతుడు నన్ను క్షమిస్తే చాలుకదా!" అన్నది సుధ.

"అదిగో, ఆ మాటల గారడీతోనే నన్ను బోల్తా కొట్టించేస్తున్నావు. నేను భగవంతుడి నయితే తమరు.... ....?"

"నాకు తెలిసినంతవరకు మగదేవుడు ఆడదేవతని— నాకు తెలుగు గ్రామరు సరిగ్గా రాదు. ఏవనుకోకు— పూజించినట్టు మొక్కినట్టు యెక్కడా కనలేదు, వినలేదు. నువ్వేమయినా స్పెషల్ దేవివా?"

"అవును—మీకు మాత్రమే స్పెషల్. అయితే కొంప తీసి పూజలు చేయకండి. నిజంగా నేను దేవతనని భ్రమ పడి మీకు దూరమయిపోయే ప్రమాదముంది. నాకు యిక్కడ కాసినంత చోటు వుంచండి, చాలు!" అతని గుండెలమీద తలవాల్చి అతని పై సవరిస్తూ అరమోడ్పు కన్నులతో అన్నది సుధ.

రఘు ఆమెని ఆప్యాయంగా హృదయానికి మరింత దగ్గరగా హత్తుకుని, "ఈ హృదయంలో కాసింత చోటేం ఖర్మ, వున్న చోటంతా నీదే సుధా! మరొకరి గాలి కూడా సోకనివ్వనని నీకు తెలుసు" అన్నాడు.

సుధ అతని పెదాలని మునివేళ్ళతో సుతారంగా మూసి, "ఆ విషయం మీరు ప్రత్యేకం నాకు చెప్పాలా? మీతో సరదాగా వాదులాట వేసుకోకుండా వుండలేను. నా స్థానం సుస్థిరమన్న విషయం మీ నోటివెంట పదేపదే చెప్పించుకుని పరవశించిపోవటం నా కెంతో యిష్టం. అది నా అదృష్టం. నా అదృష్టానికి నేనే అసూయపడుతుంటాను. అప్పుడప్పుడు!" అన్నది.

"వస్తా సుధా! ఆఫీసుకి టైం అయిపోయింది. సాయంత్రం అయిదుగంటలకి ముందే నీ ముందు వాలతాను. వచ్చేటప్పుడు టిక్కెట్టు అడ్వాన్స్ బుకింగ్ చేసుకుమరీ వస్తాను. ఆఘమేఘాలమీద వచ్చి వాల్తాను."

"ఆ పని మాత్రం చేయకండి మహాప్రభో! తమరు స్కూటర్ యెక్కితే ఒళ్ళుపై తెలీదు. మేఘాలమీద ప్రయాణం మంచిదికాదు స్వామీ, రోడ్డుమీదనే తమ వాహనం నడిపించుకు రండి. అదీ ముప్పయి కిలోమీటర్ల వేగంతో మాత్రమే!"

"ఇంకా నయం. పది కిలోమీటర్ల వేగమన్నావు కాదు. ఫస్టుషోకి అనుకుంటే అర్ధరాత్రి ఆటకు వెళ్తాం" స్కూటర్ స్టార్టుచేస్తూ అన్నాడు రఘు.

సుధ కిలకిల నవ్వింది.

రఘు అటు యిటు చూసి, చటుక్కున సుధ పెదాల మీద ముద్దు పెట్టేసుకుని, స్కూటర్ ముందుకి వురికించాడు.

2

రఘు ఆఫీసుకొచ్చేసరికి అక్కడో చిన్న సమావేశం కనిపించింది. శ్రోతలు ఓ గుంపుగా చేరి ఏదో వుపన్యాసం శ్రద్ధగా వింటున్నారు. అందరి శ్రోతల్ని ఆకర్షించుకున్న

శాస్త్రీ పేరు కనకారావు.

కనకారావు అడుగుతున్నాడు ఒకతన్ని:

"నీకు పెళ్ళయి ఎన్నిరోజులయింది?"

"ఎన్నాళ్ళేనా, మూడేళ్ళు.

"ఈ మధ్య కాలంలో మీ ఆవిడతో ఎన్నడయినా కీచులాడావా?"

"ఆ అగత్యం లేదు. మాది ఆదర్శ వివాహం."

"అయితే నీ లైఫ్ చాలా 'డల్'గా వుందన్నమాట. థ్రిల్లింగ్, ఎగ్జయిట్మెంట్ లాంటివి లేకపోతే సంసార జీవితం బోర్ కొడ్తుంది."

"త్రిల్లా? అదేమిటి?"

"అదే చెప్పొస్తున్నాను. భార్యాభర్తలు సరదాగా కీచులాడుకుని సీరియస్గా మాట్లాడుకోవటం మానేసి యెడమొహం పెడమొహంగా నాలుగురోజుల విరహం తర్వాత కలయిక వుంది చూడు, అదీ పెద్ద థ్రిల్లింగ్. ఈ నాలుగు రోజులు గొప్ప ఎక్సయిట్మెంట్."

"ఆ అర్థంకాని వేవో నువ్వే అనుభవించు భాయ్, నా కొద్దు."

"నే నవన్నీ అనుభవించి పండిపోయాను నాయనా!"

రఘు కూడా ఆసక్తిగా వాళ్ళిద్దరి సంభాషణా తక్కిన కోలిగ్స్తోపాటు వింటున్నాడు.

కనకారావుచేత యింటర్వ్యూ చేయబడుతున్న కోలీగ్ పేరు సుబ్బారావు. అతను కనకారావుకన్న నాలుగాకులు ఎక్కువ చదివాడు. అతన్ని ఏడిపించటానికి ఇంకా తిక్క ప్రశ్నలు వేస్తున్నాడు కనకారావుని.

"నీకు పెళ్ళయి ఎన్నేళ్ళయింది?" కనకారావుని ఆడిగాడు సుబ్బారావు.

"పన్నెండేళ్ళు."

"ఈ పన్నెండేళ్ళ సంసారిక జీవితంలోను ఎన్నిసార్లు కీచులాడుకున్నారు—నువ్వు, మీ ఆవిడాను?"

"పన్నెండువందలో, వేలో లెక్కపెట్టలేదుగాని, ప్రతి సారి దెబ్బలాడుకున్నాక కల్సుకునే కలయిక వుంటుంది చూడు, అది మాత్రం నిత్యనూతనంగా వుంటుందోయ్. ఆ అనుభవంకోసం—దాన్నే థ్రిల్ అన్నానిందాక — ఎన్ని సార్లయినా గిల్లీకజ్జా పెట్టుకుని మా ఆవిడతో మౌనవ్రతం సాగించేవాడిని."

"అయితే యిప్పుడిక కొట్లాడుకోవటం లేదా?"

"ఇప్పుడు నా బదులు మా ఆవిడ మాట్లాడుతోంది— యిదిలేదు, అదిలేదు, యిది తే, అది తే అని!"

శ్రోతలు ఫక్కున నవ్వారు.

"జీవితం అనుభవించేది అంటూ వుంటే పెళ్ళయిన నాలుగయిదేళ్ళలోనే. అందుకనే నీ సుఖంకోరి చెబుతున్నాను" అన్నాడు మళ్ళీ కనకారావు.

"వద్దు బాబోయ్. నన్నిలా వదిలెయ్. "సుబ్బారావు రెండు చేతులూ ఎత్తి నమస్కారం పెట్టేశాడు.

కనకారావు ఓసారి అందరివంక కలియ జూపి "అంతేనా, నాకు శిష్యుడు కాదగ్గ వీరులు మీలో ఒక్కరూ లేరా....? ఆ, హతవిధీ!" అన్నాడు నాటక ఫక్కీలో.

"అదుగో. రఘు వున్నాడు—అతనూ కొత్త పెళ్ళి కొడుకే!" అన్నాడు సుబ్బారావు.

రఘు యిబ్బందిగా చూశాడు శ్రోతలవైపు.

"సారీ బ్రదర్, భార్యతో పోట్లాడటం అంటేనే అసహ్యం నాకు. అసలు భార్యాభర్తలెందుకు కీచులాడుకోవాలి? ఒకరిపట్ల మరొకరికి నమ్మకం, అవగాహన—

అండర్‌స్టాండింగ్ లోపించినప్పుడే అపోహలు, అపార్థాలు, కీచులాటలు వస్తాయి. మా కా సమస్యలేదు" అన్నాడు రఘు అప్రస్తావన తన కిష్టంలేదన్నట్టు.

"సరే ఏం చేస్తాం? యీ రోజు పొద్దున లేచి యెవరి మొహం చూశానో, నాకో శిష్యుడే దొరకలేదు నా సంసార సారం బోధించుదామంటే!" అన్నాడు కనకారావు విచారంగా మొహంపెట్టి.

అంతా నవ్వేశారు.

యాంత్రికంగా పని చేస్తున్నాడే గాని రఘు మనసులో కనకారావు మాటలే మార్మోగుతున్నాయి. కనకారావు చెప్పినలాంటి అనుభవం తమ భార్యాభర్తల మధ్య ఎదురు కాలేదు. ప్రేమించుకోవటం, ఆరాధించుకోవటం తప్ప హాస్యానికయినా కొట్లాడుకోలేదు.

నిజమే! జీవితం థ్రిల్లింగ్‌గా వుండాలంటే మొగుడూ పెళ్ళాల మధ్య చిన్న చిన్న కీచులాట లుండటం అవసరమే నేమో! కీచులాట తర్వాత చేరువయే కలయిక....నిజంగానే తనువు పులకరిస్తోంది ఆ భావనకే! అదే ఆచరణలోకి వస్తే........? ఆ కొత్త అనుభవం తను తప్పక చవి చూడాలి.

ఆ సాయంత్రం ఆఫీసయ్యాక విడిగా ఎవరూ లేని సమయంలో కనకారావుని కలిశాడు రఘు.

"ఆ థ్రిల్ ఎలా వుంటుందో సరదాగా నేనూ చూడాలనుకొంటున్నాను. కాని నేనెంత కవ్వించినా, యెంతగా కీచులాడాలనుకున్నా నా భార్య మాత్రం యెదురు తిరగదు. ఒక్క పరుషమయిన మాట అనదు. కొట్లాడదు. నవ్వుతూ తీసి పారేస్తుంది. మరి యెట్లా పోట్లాడటం?" అన్నాడు రఘు.

కనకారావు మందహాసం చేశాడు.

"నీకు నాలుగురోజుల ప్రోగ్రాం యిస్తాను. ఏ రోజు ఎలా ప్రవర్తించాలో, నీ భార్య నెలా కవ్వించాలో చెపుతాను. ఈ మధ్య కాలంలో మీ రిద్దరూ కలిహించుకు తీరతారు."

"అలాగే. చెప్పు."

కనకారావు గీతోపదేశం చేస్తున్న కృష్ణుడి పోజులో రఘు వంక చూపి, "అయితే, విను!" అన్నాడు.

3

"ఏమిటండీ, యీ రోజు సినిమా ప్రోగ్రాం వేసుకున్న విషయం మరచిపోయారా? అయిదు గంటలకే వస్తానని చెప్పి ...."

"అబ్బబ్బ, ఇంట్లో కాలు పెట్టానో లేదో ఏమిటా నస? మగాళ్ళన్నాక లక్ష పనులుంటాయ్. సినిమాలు, షికార్లు తప్ప వేరే పనేం లేదనుకున్నావా నాకు?"

సుధ విచిత్రంగా చూపింది భర్త వంక. ఏమిటీ రోజు వింతగా వుందీయన ప్రవర్తన?

"పోనీలెండి. సినిమా పోయిందని కాదు నా బాధ. ఇంత ఆలస్యమయిపోయింది? మీకేమయిందో ఏమిటోనని హడలి చచ్చా నింతసేపూ. మనసు మనసులో లేదు. ఏదో కీడు శంకిస్తూనే వుంది. అసలే ప్రతిరోజు ఎక్కడ చూసినా రోడ్ ఏక్సిడెంట్సే! మీ కోసం ఆఫీసుకి కూడా ఫోను చేశాను పక్క షాపు నుంచి. అయిదు గంటలకే ఆఫీసు వదిలేసినట్టు చెప్పాడు అటెండర్ కాబోలు."

రఘు హృదయం ఓ క్షణం చెమరించింది. తన కోసం ఎంత క్షోభని, నరకయాతన అనుభవించిందో తన భార్య?

నిజమే, తనకేదయినా అయితే ఆమె బతకగలదా? కానీ, తన నాటకం బయటపడకూడదు. బింకంగా వుండాలి.

"ఓహో, ఆఫీసుకు ఫోన్ చేయటం వరకూ వచ్చిందా? అందరూ నా గురించి ఏమనుకుంటారు! ఇంటికి తిన్నగా రాకుండా ఎక్కడెక్కడో తిరుగుతాడు కాబోలు. పెళ్ళానికి అనుమానం వచ్చి ఫోన్ చేసి ఎంక్వయిరీ చేస్తోందని చెప్పుకుంటారు. ఛీ ఛీ. నువ్వు చేసిన పనేం బాగోలేదు" విసుక్కున్నాడు.

సుధ నిర్ఘాంతపోయి చూస్తోంది. ఈరోజు రఘు తనకి తెలీని కొత్త మనిషి! ఏమయిందీ వేళ యీాయనకు?

రెట్టించలేదు సుధ.

"పదండి, భోంచేద్దాం. పదార్థాలన్నీ చల్లగా అయిపోయాయి" భర్త చేయి పట్టుకొని అడిగింది.

చేయి విదిలించుకుని, "నా భోజనం అయిపోయింది. స్నేహితుడు పార్టీ యిచ్చాడు" అన్నాడు రఘు.

సుధ పిచ్చిగా చూస్తోంది భర్త వంక. ఏనాడూ బయట భోంచేసి ఎరగడు రఘు. తను అతనొచ్చేవరకు కనిపెట్టుకుని వుండేది. ఇద్దరు కలిసి తినేవారు, సరదాగా కబుర్లు చెప్పుకుకుంటూ, ఛలోక్తులు విసురుకుంటూ! అలాంటిది ఈ రోజు మొదటిసారిగా భర్త బయట తిని వచ్చాననటుంటే ఆమె మనసు నెవరో పిండేసినట్టు ఫీలయింది.

మౌనంగా వెళ్ళి వంటగది సర్దుకుని వచ్చింది. ఆమె వచ్చేసరికి రఘు మంచం మీద అటు తిరిగి పడుకుని వున్నాడు. చూడగా నిద్రపోతున్నట్టు కనిపిస్తున్నాడు.

లైటు తీసేసి బెడ్ లైటు వేసి మౌనంగా తనూ ఓ పక్కకు తిరిగి పడుకుంది.

గుమ్మంలోకి వస్తూనే తూలి పడబోయిన భర్తను పొదివి పట్టుకుంది సుధ.

అతని మొహం చూస్తేనే తెలిసిపోతోంది.

రఘు తాగి వచ్చాడు. తాగుడన్నా, తాగుబోతులన్నా అసహ్యించుకునే భర్త మొదటిసారిగా యీ రోజు తాగొచ్చాడు.

భగవాన్, ఏమయిందీయనకు?

"జాగ్రత్తండి, పడిపోతారు" పట్టుకుని నడిపించబోతున్న భార్యను విదిలించుకున్నాడు రఘు.

"నన్ను విడు. నడవగలను."

సుధ గుడ్ల నీరు కుక్కుకుంది.

రఘు ముందుకి తూలబోయి నిలదొక్కుకున్నాడు.

"ఎందుకండీ తాగొచ్చారు?" గద్గదంగా అడిగింది.

"తాగటం తప్పా, లేక తాగి ఎందుకొచ్చారు, ఎక్కడో వుండకపోయారా—అనా ఏమిటి నీ ప్రశ్న కర్థం?"

"అయ్యయ్యో! ఏదో అర్థంతో మాట్లాడలేదండి. ఈ తాగుడు వ్యసనాన్ని ఎందుకు అలవాటు చేసుకుంటున్నారా అని...."

"నోర్ముయ్, నా యిష్టం. తాగుతాను, తందనాలాడతాను, తిరుగుతాను. నోరెత్తావంటే తంతాను...." భార్యని తిడుతున్నాడు రఘు.

సుధ గుడ్ల నీరు కుక్కుకుంటూ అతనికి పరిచర్యలు చేయటంలో మునిగిపోయింది.

"నీ ప్లాను ఫెయిల్యూర్. నా భార్య పొరపాటున కూడా నాతో కీచులాడటం గాని, కోప్పడటంగాని, గొడవ పడటం గాని చేయలేదు. నేను ముందే చెప్పాను కదా!"

అన్నాడు రఘు.

రఘు చెప్పింది విని కనకారావు మొదట ఆశ్చర్య పోయాడు. తర్వాత తీవ్రంగా ఆలోచించాడు.

"సరే, యీరోజు మరో మంచి పథకం ఆలోచించాను. ఆడది ఏదయినా సహిస్తుంది గాని, తనకి పోటీ సహించ లేదు. నువ్వు ఎవత్తెనో ప్రేమించి దాంతో సరసాలాడు తున్నట్టు సీన్ సృష్టించావంటే చాలు, మీ మధ్య భగ్గున మంట లేస్తుంది. అనుకున్నదానికన్న ఎఫెక్టివ్‌గా వస్తుంది సీను" అన్నాడు.

"అయితే ఏం చెయ్యమంటావు?" వుత్సాహంగా ముందుకు వంగాడు రఘు.

కనకారావు గీతోపదేశం చేయసాగాడు.

5

రఘు లోపలి కొస్తూనే దుస్తులు మార్చుకోసాగాడు. సుధ అతని ప్రక్కనే నిలబడింది మౌనంగా.

ఈ నాలుగు రోజులూ యిద్దరి మధ్య ఎక్కువగా మాటలు జరగటం లేదు. ఏమంటే ఏమవుతుందోనని సుధ చాలా జాగ్రత్తగా మసలుకుంటోంది. రఘు ఎప్పటికప్పుడు ఆమె సహనాన్ని పరీక్షిస్తూ సూటిపోటి మాటలతో రెచ్చ గొడుతూనే వున్నాడు. అయినా ఆమె ఎదురు చెప్పటం లేదు.

రఘు జేబులో నుండి సుధ చూస్తూండగా ఏదో కాగితం పొరపాటున జారవిడచినట్టు కిందపడేశాడు.

సుధ దృష్టి నాకర్షించిందా కాగితం.

అతని షర్టుకి అంటిన ఎర్రటి రంగు తిలకం గుర్తుగా ఆమె దృష్టి పథం నించి తప్పించుకోలేదు. అతని జేబులో నుండి జారిన మల్లెలు ఆమెకు కొత్త కథని చెబుతున్నాయి.

భర్త అటు వెళ్ళగానే కాగితాన్ని తీసి జాకెట్టు లోపల దాచేసింది. రఘు క్రీగంట గమనిస్తున్నాడు.

ఉత్తరంలాంటి ఆ కాగితంలోని నాలుగు మాటలు చక చక భర్త స్నానం చేస్తున్న సమయంలో చదివేసింది.

"డార్లింగ్!

ఇంకా ఎన్నాళ్ళు మనకీ ముసుగులో వ్యవహారం? త్వరగా నీ భార్యతో తెగతెంపులు చేసుకుని నా మెడలో తాళి కడతానన్నావు? కాని యిప్పటిదాకా ఆ సంగతే ఎత్తటం లేదు. నేనే యిక స్వయంగా నీ యింట్లో కాపరం పెట్టేస్తాను, తర్వాత నీ యిష్టం! నాకు వెంటనే సమాధానం కావాలి! అవసరం తీరటం కోసమే ఆడదని భావించే మగవాళ్ళ లిస్టులోకి నువ్వు రావని నా నమ్మకం!"

—నీ రజని."

సుధ నిలువునా కూలిపోయింది.

ఏమిటీ విపరీతం? ఇన్నాళ్ళుగా యీాయన సాగిస్తున్న వ్యవహారం యిదా? అందుకే యీామధ్య బాగా ఆలశ్యంగా రావటం, తాగటం అలవాటు చేసుకున్నారా?

వెంటనే పోయి ఆ విషయం భర్తను నిలదీసి అడగా లనుకుంది. కాని, ఆలోచిస్తే అది తెలివయిన పని కాదని పించిం దామెకు. తనకు తెలిసిపోయిందన్న విషయం ఆయనకి తెలిస్తే యిక బాహాటంగానే మొదలుపెడతాడు. తనకు భయపడటం పూర్తిగా మానేస్తాడు. చేతులారా తనే ఆ అవకాశం కల్పించినట్టవుతుంది. తనకేమీ తెలియనట్టు వూరుకోవటమే వుత్తమం!

సుధ ఓ నిర్ణయాని కొచ్చి వుత్తరం మళ్ళీ భర్త జేబులో జాగ్రత్తగా పదిలపరిచింది.

రఘు అంతా గమనిస్తూనే వున్నాడు.

సుధ ఏదో అడుగుతుందనీ, పెద్ద హడావిడి చేస్తుందనీ ఏడుస్తుందనీ, పెడబొబ్బలు పెడుతుందనీ ఎన్నో చెప్పాడే కనకారావు? ఈమె అందులో ఏ ఒక్కటీ చెయ్యలేదు. పైగా యిదేమని తనని అడగనూ లేదు.

సుధని ఎంత క్షోభ పెడుతున్నదీ తల్చుకుంటేనే చాలా బాధగా వుంది రఘుకి. కాని తప్పదు. థ్రిల్లింగ్ మాట అలా వుంచి, యిది సుధ సహనానికి, ప్రేమకు పరీక్ష!

6

"మా యిద్దరి మధ్య ఎలాంటి మనస్పర్ధలు రాలేదు. నీ ప్లాన్ గ్రాండ్ ఫెయిల్యూర్ అయేలా వుంది" అన్నాడు రఘు.

కనకారావు దెబ్బ తిన్నట్టు చూసి, "నిన్న నే నిచ్చిన ఉత్తరం చూసేలా జాగ్రత్తపడ్డావా?" అనడిగాడు.

"ఆఁ! చదివి, ఏం ఎరగనట్టు నా పేంటు జేబులో పెట్టేసింది. మాట మాత్రంగానయినా నన్నడగలేదు దాని విషయం."

"ఇది నమ్మదగ్గదిగా లేదు. ఆడదానికి ఆడదే శత్రువు. తనకి పోటీగా మరో ఆడది వున్నదనీ, ఆ ఆడదానికి తన భర్త తాళి కూడా కడతానన్నాడని తెలిశాక ఏ భార్యా సహించదు. భర్తమీద భద్రకాళిలా విరుచుకు పడ్తుంది. మరి నీ విషయంలో అందుకు విరుద్ధంగా జరిగిందంటే.... నాకు ఎందుకో చాలా విచిత్రమనిపిస్తోంది!"

రఘు మందహాసం చేశాడు.

కనకరావే మళ్ళీ అన్నాడు "సరే, ఈ గేమ్ యిక ఆపేద్దాం. నీ భార్య అనుమానించటం లేదు కాబట్టి, ఇక మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేదు."

"నో, నో....మధ్యలో ఆపేదిలేదు. ఆ థ్రిల్ ఏమిటో

నేను అనుభవించాలి. మరో వుపాయం చెప్పు."

"నువ్వంతగా సరదా పడుతుంటే కాదనేదేముంది? రేపు నీతోబాటు ఓ అమ్మాయుంటుంది" అన్నాడు గీతోపదేశాని కుపక్రమిస్తూ కనకారావు.

* * *

గుమ్మం ముందు కారాగటం చూసి సుధ బయట కొచ్చింది. భర్త కారు దిగి ఎవరికో చెయ్యి వూపి 'బై' చెపుతున్నాడు.

సుధ పరీక్షగా చూసింది. కారు ముందుసీట్లో కూచుని వున్న ఆమె! ఆమె దృష్టి నించి తప్పించుకోలేకపోయింది. ఆమె కూడా చెయ్యి వూపి భర్తతో ఏదో చెపుతోంది. రఘు పెద్దపెట్టున ఏదో అంటూ నవ్వుతున్నాడు. చుట్టు ప్రక్కల ఇళ్ళవాళ్ళు అతడిని, కారులోని అమ్మాయిని వింతగా చూస్తున్నారు. సుధకు అవమానంతో చచ్చేటంత పనైంది.

కారు వెళ్ళిపోయింది.

రఘు లోపలికి వచ్చాడు. వెనకనే సుధ వచ్చింది.

రఘు షర్టు పేంటు హేంగర్‌కి తగిలించబోతూ షర్టు జేబులు తడిమాడు! మధ్యాహ్నం కనకారావు డిక్టేట్ చేస్తుండగా తను రాసిన ఉత్తరం కోసం! కాని, తేలేదు. ఆ ఉత్తరం, క్రితం రోజు రజని తనకి రాసిందని చెప్పిన ఉత్తరం రెండూ మర్చిపోయాడు అతని దగ్గరే! నే నాడు తున్న నాటకం నిజమని పూర్తిగా నమ్మేసేలా చేస్తుంది ఆ వుత్తరం సుధకు. కాని, అదే మర్చిపోయా డిప్పుడు?

ఈ సరికే కారులో అమ్మాయితో తన వ్యవహారం చూశాక సుధకి అనుమానం వచ్చేసి వుండాలి. తనతో కొట్లాడుతుందని చూశాడు. కాని అలాంటిదేమీ జరుగలేదు.

7

ఉదయం భర్త ఆఫీసుకి వెళ్ళేవరకు అన్యమనస్కంగానే వున్నది సుధ. తర్వాత కాగితం కలం పట్టుకుని కూచుంది.

తన భర్త వేరే స్త్రీ నెవరినయినా చేసుకోవటం తన కిష్టమేనని, తను మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నానని వుత్తరం రాసి టేబిల్‌మీద పెట్టి, దానిమీద పేపర్ వెయిట్ పెట్టింది.

సరిగ్గా అంతలో తలుపు చప్పుడు!

లేచి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా పోలీసులు!

ఆయనకేదైనా ప్రమాదం జరగలేదు కదా! ఆమె గుండె ఓ క్షణం ఆగి కొట్టుకుంది.

"నా పేరు ఇనస్పెక్టర్ శ్రీకాంత్. మీ నుంచి కొన్ని వివరాలు కావాలి" అన్నాడు యిన్‌స్పెక్టర్ ముందుకొచ్చి తనని పరిచయం చేసుకుంటూ.

"మీరు మిసెస్ రఘు కదూ?" అన్నాడు.

ఆమె యాంత్రికంగా తలూపింది.

"ఈ చేతి రుమాలు మీవారిదేమో కాస్త చూసి చెప్పండి" అన్నాడు శ్రీకాంత్, చేతి రుమాలు నొకదాన్ని ఆమెకి చూపించి.

తెల్లటి సిల్కు రుమాలుకి చుట్టూ బార్డరు కుట్టి ఓ చివర 'ఆర్' అన్న అక్షరం కుట్టింది తను! ఎలా మర్చిపో గలదు?

అవునన్నట్టు తలూపింది. భగవాన్, ఆయన ఏదయినా ఏక్సిడెంట్‌లో చిక్కుకోలేదు కదా!

"ఈ సిగర్ లైటర్?" సిగర్‌లైట్ చూపించాడు శ్రీకాంత్.

అదీ తన భర్తదే! ఈమధ్య సిగరెట్లు విపరీతంగా తాగుతున్నాడు రఘు. అది ఎప్పుడూ అతనితో వుండాల్సిందే! సుధలో దుఃఖం పెల్లుబికి రాబోయింది.

"వారిదే. వారికేదయినా ఆపద కలగలేదు కదా, ప్లీజ్, చెప్పండి!" అన్నది గద్గదికంగా సుధ.

"మీవారు క్షేమంగానే వున్నారు. మీవారికి రజని అనే అమ్మాయితో పరిచయ ముందా? కాస్త గుర్తు తెచ్చుకుని చెప్పండి" అడిగాడు ఇనస్పెక్టర్.

ఆమె వులిక్కిపడింది.

శ్రీకాంత్ గమనించాడు.

"లేదండి, ఆయనకి అమ్మాయిలతో పరిచయం లేదు" తడబాటుని కప్పిపుచ్చుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేసింది సుధ. ఇనస్పెక్టర్ యిలా తలా తోకా లేని ప్రశ్నలు ఎందుకడుగు తున్నట్లో అర్థం కాలేదు.

"ఇది, యిదిగో మీవారి దస్తూరీయేనా చూసి చెప్పండి" ఓ కాగితం ఆమె ముందు పెట్టి అన్నాడు శ్రీకాంత్.

ఆ కాగితం వంక చూసి అవునన్నట్లు తలూపింది.

"ఇది చదవండి, మీకే తెలుస్తుంది" అన్నాడు శ్రీకాంత్.

సుధ తీసుకుని చదివింది. శ్రీకాంత్ ఆమె చదువు తున్నంతసేపు గదిని పరీక్షగా గమనిస్తున్నాడు.

ఆ ఉత్తరంలో యిలా వుంది.

"డియర్ రజనీ!

నీవు మన పెళ్ళి గురించి అనవసరంగా తొందర పడుతున్నావనిపిస్తోంది నాకు. నాకు పెళ్ళయింది. భార్య వుందని నీకు తెలుసు. ఆమె బెడద వదిలించుకుని తొందరలోనే నిన్ను చేసుకుంటానని యిదివరకే చెప్పాను. ఎందుకు

నన్ను వత్తిడి చేస్తావు? నేనసలే మంచివాడ్ని కాదు. హద్దు మీరితే నిన్నేం చేస్తానో నాకే తెలీదు. తొందరపడి గుట్టు రట్టు చెయ్యకు. త్వరలో కలుస్తాను.

—నీ రఘు."

సుధ ఉత్తరం పూర్తిచేసి చూసేసరికి శ్రీకాంత్ చేతిలో మరో కాగితం వుంది. అది....అది....తను భర్త వేరే పెళ్ళి చేసుకోవటానికిష్టపడుతూ రాసిన అంగీకార పత్రం! తనీ వుత్తరం చదువుతుండగా టేబిల్ మీదున్న తన ఉత్తరం అతను చేజిక్కించుకున్నా డన్నమాట.

ఇంతకీ రఘు ఏమయినట్టు? వీళ్ళెందుకు వచ్చారు?

శ్రీకాంత్ ఆమె వంక సూటిగా చూస్తూ "ఈ అంగీకార పత్రం మీరు రాసిందే కదూ!" అన్నాడు.

ఆమె అవునన్నట్టు తలూపింది.

ఇనస్పెక్టర్ శ్రీకాంత్ తన సిబ్బందితో అక్కడి నుంచి కదిలాడు.

"ఇంతకీ మా వారు...?" అంటున్న సుధ వంక జాలిగా చూశాడు శ్రీకాంత్.

"పోలీసుల కష్టడీలో వున్నాడు, రజనిని హత్య చేసిన నేరానికి! మీరు చెప్పిన ఆధారాలు అతని నేరాన్ని రుజువు చేశాయి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

సుధ కెవ్వున అరిచి కుప్పలా కూలిపోయింది.

8

"నాకేం తెలీదు ఇనస్పెక్టర్! నాకీ హత్యతో సంబంధము లేదు" అరిచాడు రఘు.

శ్రీకాంత్ అతని వంక సూటిగా చూసి, "ఈ ఉత్తరం నువ్వు రజనికి రాసిందే కదూ!" అడిగాడు.

"రజని అన్న పేరు ఊహాగానం. నేను నా కొలిగ్

కనకారావు సరదాగా నా భార్యని ఆట పట్టించటానికి వుత్తరాలు రాసి మా ఆవిడని ఏడిపించాం. అంతేగాని రజని ఎవరో నిజంగా నాకు తెలీదు."

"మీ కోలిగ్ కనకారావుకి నీకు మధ్య శత్రుత్వం వుందని విన్నాను. నీకు రజనికి చాలా కాలంగా సంబంధం వుందని అతనే చెప్పాడు. ఆ కారణంగా మీ ఇద్దరికీ మాటల్లేవని కూడా చెప్పాడు."

"అబద్ధం! అంతా అబద్ధం!! రజనితో నాకు ఎలాంటి సంబంధం లేదు!"

"ఊఁ! ఈ చేతి రుమాలు. సిగార్ లైటర్ శవం పక్కన దొరికాయి. ఇవి నీవే కదూ!"

నీరసంగా తలాడించాడు అవునన్నట్టు.

"వీటికి కాళ్ళు లేవు కదా! శవం పక్కన ఎందుకున్నాయి? నిన్న రాత్రి నువ్వు హత్య చేసేటప్పుడు పొరపాటున వదిలేశావు. శవం హేండ్ బాగ్‌లో ఆమెకు నువ్వు రాసిన ఉత్తరం దొరికింది. అంతేకాదు. నీవు కారులో ఆ అమ్మాయితో తిరగటం చూసినట్లు మీ ఇంటి చుట్టుపక్కల వాళ్ళు సాక్ష్యం చెప్పారు."

తల పట్టుకున్నాడు రఘు.

ఇదంతా చాలా ప్లాన్‌డ్‌గా జరిగింది. దీనికి మూల కారకుడు కనకారావు. పాత కక్షని తీర్చుకోవటం కోసం, తనకి అడ్డంకిగా వున్న రజనిని తప్పించటానికి నేరాన్ని తనపై మోపడానికి అన్నిరకాల ఆధారాలు సృష్టించాడు.

ఆ రోజు తనతో కారులో వచ్చిన అమ్మాయే యీ రజని అని తనకిప్పుడు తెలుస్తోంది. సుధ చూస్తూండగా ఆ అమ్మాయి తనని చనువుగా పలకరించటం—కనకారావు పన్నాగమే! తను సుధని ఆటపట్టించటానికి అదీ ప్రణాళి

కలో ఓ భాగమని అనుకున్నాడేగాని, హత్యా పథకమని కల్లో కూడా అనుకోలేదు. ఇప్పుడెలా?

"సార్! నన్ను నమ్మండి. కనకారావు పన్నిన పన్నాగ మిది! అతను హత్యచేసి నన్ను 'ట్రాప్' చేశాడు. ఆధారాలు సృష్టించాడు. నా భార్యకి తెలియచెయ్యండి, ఆమె నన్ను నిర్దోషిగా నిరూపించటానికి ప్రయత్నిస్తుంది."

"సారీ మిస్టర్ రఘూ! మీ భార్య సాక్షం మీకు పూర్తి విరుద్ధంగా వుంది. మీరు నిర్దోషిగా కాదు, హంతకుడిగా నిరూపించటానికే ఆమె సాక్ష్యం బాగా ఉపయోగపడింది మాకు!"

"వ్వాట్? నా సుధ నన్ను హంతకుడిగా సాక్షం చెప్పిందా? నా కెవరు దిక్కు? ఇనస్పెక్టర్, నేనీ హత్య చెయ్యలేదు. నేను హంతకుడ్ని కాదు!" పిచ్చిగా అరుస్తున్నాడు రఘు. □

భలే ఉద్యోగం!!

సీను వాళ్ళమ్మతో, "అమ్మా! నాకు ఉద్యోగం దొరికిందే!" అన్నాడు గర్వంగా ఫోజు పెట్టి.

"వేలెడు లేవు. తుంటరి వెధవ్వి. నీ కెవడిచ్చాడ్రా ఉద్యోగం?" అంది తల్లి ఆశ్చర్యంగా.

"పక్కింటివాళ్ళమ్మాయిని గిల్లకుండా ఉంటే నెలకు ఐదు రూపాయలు యిస్తానన్నాడే వాళ్ళ నాన్న!" చెప్పాడు ఏడేళ్ళ సీను కళ్ళు చక్రాల్లా తిప్పుతూ.

—'జగన్నాధుడు', హన్మకొండ.

ఇమంది రామారావు

శెట్టిగారి శవం



రాంప్రసాదు, నేనూ మంచి ఫ్రెండ్సుం—

నిద్రలోనూ ఒకరినొకరు కలవరించుకునేటంతటి అనుభవాలు చాలా వున్నాయి మా మధ్య. వాడు గుర్తుకొస్తే నేనీ ప్రపంచాన్ని మరిచిపోయేవాడ్ని. నేను తలపుకువస్తే వాడి పరిస్థితికూడా అంతే.

మా ఊరికి రెండున్నర ఫర్లాంగుల దూరంలో కెనాల్స్ వున్నాయి గోస్థనీ నదీతీరం. పెద్ద బ్రిడ్జ్. సమీపంలోనే స్మశానం. అది స్మశానమని మరిపించే సరుగుడు తోట. ఆ తోటలో వీచే పిల్లగాలి. ఇవన్నీ ఏ పెట్టుబడి లేకుండా లభించే అమూల్య ప్రకృతి సంపదలు.

"రామూ! కెనాల్స్‌కి వెళదాం రారా!" అన్నాడు రాంప్రసాద్.

సమయం తొమ్మిదిన్నరయ్యింది. రాత్రి. పల్లెటూరు గనుక ఊరు సగం నిద్రపోతున్న సమయంలో మేము ఊరి పొలిమేరను దాటి స్మశానంకేసి వెళ్ళడం నాకిష్టంలేదు.

"వద్దురా! యిక్కడే వుండు. ఏవయినా కబుర్లు చెప్పరా!" అన్నాను. వాడి మాట నాకు మురళీ పాట. ఎంత హాయిగా ఫీలవుతానో మాటల్లో చెప్పలేను—వాడి మొహం మాడిపోయింది. వాడనుకున్నది రివర్స్ అయితే చాలు. అస్సలు మనిషి ఎమోషన్స్ కంట్రోల్ చేసుకోలేడు.

"నువ్వు వస్తున్నావా! రావా!" సూటిగా అడిగాడు. ఇక రానంటే వాడి 'ప్రళయ తాండవం' కళ్ళారా చూడలేను గనుక షర్టు వేసుకు బయలుదేరాను. వాడి ఆనందం ఆ మొహంలో మొగ్గలు వేసింది.

"రామూ! ఈ వెన్నెల సమయంలో నీతో కలిసి ఇలా రావడం ఎంత బావుంటుందనిరా! ఎందుకోరా—నువ్వు లేకపోతే ఈ ప్రపంచంలో తీయదనమే లేదనిపిస్తుంది!" అన్నాడు నా చేతిని గట్టిగా నొక్కి పట్టుకొంటూ.

"రాంప్రసాద్! నువ్వు బయటికి చెబుతున్నావ్ నేను చెప్పలేకపోతున్నాను అంతే తేడా. నాకూ ప్రపంచ మంటే ఏంటో తెలీదు. గాని నువ్వే ఒక ప్రపంచమని, నా ప్రపంచ మని మాత్రం తెలుసు!" అన్నాను.

కెనాల్స్ వచ్చాయి. ఇద్దరి మధ్య పిచ్చాపాటీ దొర్లు తుంది.

రివ్వుమంటూ ఎక్కడినుండో ఒక చింతపిక్క రంగు కారు దూసుకు వచ్చింది.

మా ముందు ఆగింది. మా కళ్ళు జిగేల్‌మన్నాయి. కారులోనుంచి బిలబిలమంటూ నలుగురు దిగారు. యింతకు ముందు అసలు పరిచయం లేని మనుషులు వారు.

క్షణంలో మా కళ్ళకు గంతలు కట్టారు.

"ఏయ్. ఏమిటిది. ఎందుకు మా కళ్ళకు గంతలు కడు తున్నారు. మీకేం అన్యాయం చేశామని!" అంటూ అరుస్తు న్నాడు రాంప్రసాద్.

నన్ను ఏదో బలమయిన చేయి వాటేసుకొని కళ్ళకు కడుతున్నాడు. వాడి మొహం తడిమాను. మీసాలు గడ్డం చేతికి దొరికాయి. గట్టిగా లాగాను. "అమ్మా" అన్నాడు.

"ఏమిటీ పని? ఎందుకీ దారణం!" అనడిగాను.

వారు సమాధానం చెప్పలేదు. అయిదు నిముషాలసేపు మమ్మల్ని మాట్లాడనీయలేదు. నోరుకూడా గట్టిగా మూసేరు. కారులోంచి ఏదో పెట్టె బయటకు దించేరు. డిక్కీలోంచి ఏవో తీస్తున్న చప్పుడు వినిపించింది. గంతలు విప్పుకోవా లని ప్రయత్నించాను. సాధ్యపడలేదు.

"ఊ! పదండి!" అన్నాడొకడు.

నేను విసురుగా వెళ్ళాను. అంచనా ప్రకారం శబ్దం వచ్చిన కేపి చెయ్యి చాపేను. కాలరు దొరికింది. గుంజేను. నా చేతిమీద ఇనుపరాడ్ తగిలింది. నరాలు జివ్వుమన్నాయి. అంతే! వాడు తప్పించుకున్నాడు.

కార్లో కూర్చున్న చప్పుడు, డోర్ వేసిన చప్పుడు విని పించింది.

"మన రహస్యం వీళ్ళు చెబుతే!" ఒకడి సందేహం, కీచుగొంతు.

"అదంత తేలికనుకుంటున్నావా. మనముండే చోటు కనుక్కోవడం పోలీసులకే వశం కాలేదు!" ఒకడి గర్వం.

"కారు స్టార్ట్ చెయ్యండి!" ఆర్డరు జారీచేసింది బొంగురు గొంతు. కారు కదిలింది.

2

ఎలాగైతేనేం రౌడీలు వెళ్ళిన పది నిముషాలకు కట్లు విప్పుకోగల్గాము.

నా చేతిలో గడ్డంవాడి బంగారు ఛెయినుంది. ఆ ఛెయిను మీద 'శిలువ' వుంది. క్రింద 'జె' అన్న ఇంగ్లీషు లెటరుంది.

రాంప్రసాద్ చేతులు వాచిపోయాయి. కళ్ళుకూడా ఎర్ర బడ్డాయి. ఒకరినొకరం చూసుకున్నాం.

"రామూ!"

"రాంప్రసాద్!"

"సారీరా. అనవసరంగా వచ్చాం. చచ్చాం" అంటూ అలా బిక్కచచ్చిపోయాడు రాంప్రసాద్.

ప్రక్కకు చూశాను. నాకు గుండాగినంద పనయింది.

పెట్టెలో ఎవరిదో శవం!

మనిషి బాగా స్థూలకాయుడు. గిరజాల తల. నల్లగా చింతపండు బస్తాలా వున్నాడు. మనిషి నాలుక బయటికి వచ్చింది. పెట్టెలో యింకా ఏమయినా వున్నాయేమో చూశాం. ఒక్క చుక్కయినా రక్తపుబొట్టు లేదు. అంటే చంపేసిన తరువాత ఈ పెట్టెలో పెట్టి తీసుకువచ్చి ఈ కెనాల్స్ దగ్గర విడిచిపెట్టేశారన్న మాట దరిద్రులు. కసిగా తిట్టుకున్నాం.

"ఈ శవం ఎవరయి వుంటారు!" అనడిగాను రాం

ప్రసాద్‌ని.

"డెఫెనెట్‌గా విజయనగరంలో ఒక సాహుకారుదై వుంటుంది!"

"సాహుకారయితే ఒంటిమీద బంగారం వుండాలికదా!"

"నీ మొహం ఆ బంగారం కోసమేకదా వీడిని చంపింది"

"ఛఛ బంగారంకోసమే అయితే మనిషిని చంపాల్సిన అవసరం ఏమొస్తుంది. దీని వెనుక ఏదో కథ వుంది."

శవం పోలీసుల కస్టడీలో వుంది. హత్య చేసింది ఎవరాని దర్యాప్తు చేస్తున్నారు.

మమ్మల్ని 'అసలు ఏం జరిగిందని' అడగడం, మేము జరిగింది జరిగినట్లు చెప్పడం, వారు నోట్ చేసుకోవడం యాంత్రికంగా ముగిసింది.

చెయిను పోలీసులకి ఒప్పగించాను. కాని కళ్ళముందు కదులుతోంది. 'శిలువ' అంటే క్రిష్టియన్ అయివుండాలి, పేరు 'జేమ్స్' అయివుండాలి. ఈ పరిశోధన నేను చేస్తే!? ఈ ఆలోచన నా కెప్పటి నుంచో వుంది.

నా కళ్ళముందే నేరం జరిగింది. ఇలా ఎన్నో నేరాలు జరుగుతున్నాయి. అన్ని నేరాలను పరిశోధించాలంటే యెంత పోలీసు సిబ్బంది, ఎన్ని ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్స్ యెందరు బ్యూరోలున్నా ప్రయోజనం లేదు. ఎవరికి వారే ముందడుగు వేసి నేరస్థుల ఆచూకీ కనిపెట్టడంలో సాహసించాలి. ఎలా? ఈ విషయం ఇన్‌స్పెక్టర్ గున్నారావుగారితో మాట్లాడితే!

గున్నారావ్ చాలా మంచి మనిషి. ఆయన యెంత గంభీరంగా వుంటారో, అంత సరళ స్వభావంగానూ, అంత ఆత్మీయంగానూ వుంటారు.

"ఒకవేళ ఈ కేసు మాలాంటి యువకులు పరిశోధన గావించవచ్చా సార్!" అడిగాను.

"వై నాట్?"

"నేరస్థుల్ని మీకు ఒప్పగి స్తే...."

"తగిన బహుమతి వుంటుంది! ప్రభుత్వం గు ర్తింపు వుంటుంది. అసలు సమాజంలో జరిగే అవినీతిని అరికట్ట డానికి ప్రతి పౌరుడికీ బాధ్యత వుంది! నై తికంగా మనిషి అప్పుడే ఎదుగుతాడు!" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"థాంక్యూ సర్! థాంక్యూ వెరీమచ్" అంటూ లేచాను. కొండంత బలం వచ్చింది. ఈ పరిశోధన విజయ వంతం ఔతుందన్న అచంచలమయిన విశ్వాసంతో బయలు దేరాను.

4

విజయనగరంలో గుడివీధి అత్యాచారాలు, వ్యభిచారాలు అన్నిటికీ కేంద్రస్థానం. అక్కడో రావిచెట్టు వుంది. ఆ చెట్టు కింద పనిలేని వాళ్ళంతా చేరుతుంటారు. కొందరు బ్రోకర్స్ కూడా కూర్చుంటారు.

నేను నీట్‌గా డ్రెస్ చేసుకున్నాను. నన్ను చూసి ఆ బాపతు అనుకున్నారు. బ్రోకర్సు ఆశగా చూస్తున్నారు.

"ఏం బాబూ వస్తారా?" అంటూ ఓ కుంటికాలు బ్రోకరు అడిగాడు.

మాటల ద్వారా అతడి పేరు ముసలయ్యని తెలుసు కున్నాను.

"ఎక్కడికి" అన్నాను అర్థంకానట్లు. నవ్వాడు.

"మంచి అమ్మాయి వుంది చూస్తారా?" అన్నాడు.

"ఊఁ నాకు బాగా పొగరుబోతు అమ్మాయి కావాలి. రౌడీ అయితే మరీ మంచిది!" అన్నాను.

నా మొహంలోకి పరీక్షగా చూశాడు అతగాడు.

"అలాగయితే డబ్బు ఎక్కువవుతుంది బాబూ!" అన్నాడు ఆశగా.

"ఫరవాలేదు!"

"వందవుతుంది వుంటారా!" అన్నాడు. నేను లేచి నిలబడ్డాను.

టైమ్ ఉదయం పదవుతుంది.

"రండి బాబూ!" అంటూ ఓ యిల్లు చూపించాడు. లోపలికి వెళ్ళాను. లోపల నలుగురు మనుషులు వున్నారు. ఏదో ఘర్షణ జరుగుతున్నట్టుంది. మేం వచ్చిన శబ్దం విని బిక్కుమంటూ వుండిపోయారు.

"సర్లెండి. బేరం వచ్చింది-వెళ్ళండి బయటికి" అంది ఆమె. ఆమె గొంతు బండగా వుంది. చూడ్డానికి ఎత్తు, ఎత్తుకు తగ్గ లావు. కాస్త నల్లగా వున్నా ఆకర్షణీయం గానే వుంది.

"ముందు మా విషయం సెటిల్ చెయ్యి!" అన్నా డొకడు.

"తర్వాత రా అంటున్నానా!" విసుక్కుంది.

"తర్వాత రావడానిక్కుదరదు! ముందు డబ్బు కక్కు!" అంటూ గొంతుని బలవంతంగా అదుపులో వుంచుకొని మాట్లాడసాగా డొకాయన.

"ఏమ్మా! వుండమంటారా? వెళ్ళమంటారా?" ముస లయ్య కేకేశాడు. ఆ ఇంట్లో ముసలయ్యకు కాస్త అధికారం వున్నట్లుంది.

"ఉండు ముసలయ్యా! ముందీ పెంట ఒదిలించుకోనీ!" అంటూ బీరవా తెరిచి డబ్బు ఒకదికి యిచ్చింది. లెఖ్ఖ చూడకుండానే పేంటు జేబులో పెట్టుకొని బయటకు నడి

చాడు. నలుగురూ హాలో అయ్యారు.

రాత్రి నేను చూపిన వాళ్ళు వీరుకారు. గొంతు కూడా వ్యత్యాసంగా వుంది. వీళ్ళు కూడా రౌడీలే. కని మామూలు కిరాయి రౌడీలు అయివుంటారనిపించింది.

"రా బాబూ! రా! క్షమించండి. వెధవలకి బుద్ధీ జ్ఞానం వుండదు. ఆకలికి మాడుతూ అమ్మా, ఏదయినా పని చెప్పమని వస్తారు. పని చెప్పేక, అదిచేసి, డబ్బు ఇంత కావాలి అంత కావాలి అని పీకలమీద కూర్చుంటారు. మాయవారి సంత? ఏంటి వుంటారా? వందవుతుంది" అంది నిర్మోహమాటంగా.

రెండు వందరూపాయల నోట్లు అందించాను.

నన్ను చూసింది. లక్షాధికారి అనుకుందేమో. చేతి వుంగరం మార్కెట్‌లో అమ్మితే వెయ్యిరూపాయలకి మాత్రమే నేను అధికారినని తనకు తెలీదు. లోలోపలే నవ్వుకున్నాను.

"ఏ వూరు మీది!" డబ్బు కళ్ళకద్దుకొని బీరువాలో పెట్టింది. చెప్పేను.

"కొత్తా!" అని అడిగింది.

"ఉహూం. పాతే!" అన్నాను.

"రండి!" అంటూ మంచం మీద కూర్చుంది. ఆమె చేతిమీద కత్తిగాట్లు వున్నాయి. ఆమె మెడలో లాకెట్ వుంది. ఆ లాకెట్ చివర 'జె' అన్న అక్షరం వుంది. నా కళ్ళు గదంతా కలయ చూశాయి. ఎక్కడా ఏసుప్రభువు ఫోటో లేదు. ఒకచోట మాత్రం చిన్న 'శిలువ' వుంది.

"మీరు క్రిష్టియానిటీ తీసుకున్నారా?"

"మీకెందుకవన్నీ?"

"నేను క్రిష్టియాన్ని....ఆ ప్రభువు గురించి, ఎక్కడ

వీలయితే అక్కడ ప్రచారం చేయడం నా ధర్మం!” అన్నాను.

“మీ పేరు?” అని అడిగింది.

“జేమ్స్” తడబడకుండా చెప్పేను. తృళ్ళిపడింది.

“ఆ పేరంటే నా కసహ్యం!”

“ఎందుకని?”

“నన్నీస్థితికి దిగజార్చింది ఆ పేరుగల మనిషే....” అంది ఉక్రోషంగా. ఆమె గుండె బుసలు కొడుతోంది.

“అంటే మీ మెడలో అందంగా వ్రేలాడుతున్న మనిషా?”

కత్తిలాంటి కళ్ళతో చురక అంటించేలా చూపింది. నా పెదవులమీద నవ్వు దొర్లిపోయింది.

“మాటలు తరువాత, ముందు మీరు వచ్చిన పని చూడండి” అంది మూతి తిప్పి.

“నేనెందుకు వచ్చాననుకుంటున్నారు?”

“ఒళ్ళు కొవ్వెక్కి!” కోపంగా అంది.

“అలా మాత్రం కాదు. నేను ఓ రెండు గంటలు ఎవరికీ కనిపించకుండా అజ్ఞాతంగా వుండాలి. నిన్న ఈ ఊళ్ళో ఒక హత్య జరిగిందని మీరు వినే వుంటారు!”

“ఎవరు సుబ్రమణ్యంగారి గురించా!”

“కరెక్టు .... ఆ శెట్టిగారు కొన్ని రహస్యమైన వ్యాపారాలు నాచేత చేయించారు. బ్రతికున్న రోజుల్లో నాకు కేవలం వ్యాపారంతో సంబంధం వుంది తప్ప డబ్బు విషయంలో జోక్యం కల్పించుకునే వాడ్నికాను.”

“మరెవరు మనీ డీలింగ్స్ చూస్తూండేవారు!”

“మా నాన్నగారు ఇక్కడ లేరు మద్రాసు వెళ్ళిపోయారు. ఏదో సినిమా ఫీల్డులో స్థిరపడి నిర్మాతగా

సెటిలవుదామని!....కాని శెట్టిగారి తాలూకా వాళ్ళు ఆ రహస్యాలు ఆ డబ్బు వ్యవహారాలు నన్ను సెటిల్‌చేయమంటున్నారు. నేనేం చేయను. నన్ను రౌడీలకు ఒప్పగించే ప్రయత్నంలో వున్నారని తెలిసింది. ముల్లుని ముల్లుతోనే తీయాలి. రౌడీలను రౌడీలతోనే ఎదురించాలి. నాకు రక్షణ కల్పించాలంటే పోలీసుల వలన కాదు. నేను నేరస్థుడ్ని. నన్ను రక్షించరు. శిక్షిస్తారు. ఈ ఊళ్ళో మీ రొక్కరే అందుకు తగ్గవారని తెలుసుకొని వచ్చాను. నన్ను కాపాడండి!" అన్నాను.

నా కళ్ళల్లో భయాన్ని వ్యక్తం చేశాను. ఆమె నన్ను కాస్సేపు పరీక్షగా చూసింది. కరిగినట్లుంది.

"సరే నాయనా నీకేం సహాయం కావాలో చెప్పు!" అంది. వీపుమీద అప్యాయతగా నిమిరింది.

"నీ ఒడిలో....సాయంత్రందాకా వుండాలి. నా గురించి ఎవరొచ్చినా, వాళ్ళ బారినుండి కాపాడాలి. యిందుకు నీకెంత కావాలన్నా ఇస్తాను" అన్నాను.

"చూడు మైడియర్! నా యింట్లో దౌర్జన్యంగా అడుగు పెట్టడానికి వాడికి వెయ్యి గుండెలు కావాలి" అంది గర్వంగా.

"అందుకేగా నీ ఆశ్రయం కోరింది!" అన్నాను.

"వెల్. మై డియర్! చూడ్డానికి భలే ముద్దొస్తున్నావు" అంటూ దగ్గరికి లాక్కుంది—కాస్సేపు నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది.

"జేమ్స్ నీ భర్తా?" అన్నాను చనువుగా.

"ఒకప్పుడు!"

"యిప్పుడు కాదా!"

"ఒక రౌడీ."

"అంటే కిరాయికి ఎవర్నయినా కొడుతూ వుంటాడా?"

"అవసరమయితే చంపుతాడు కూడా!"

"నీకూ ఆయనకీ యింకా సంబంధం వుందా!"

"ఏం, ఎప్పుడో తెగిపోయింది!"

"అబద్ధం....అదిగో యింకా నీ మెడలో వ్రేలాడుతుంది కదా" అన్నాను. కిసుక్కున నవ్వింది ఆమె. ఆమె నవ్వితే ఆమె బుగ్గమీద అందంగా సొట్టపడుతుంది. ఆమె కామాటే చెప్పేను. పొంగిపోయింది. ఆడవాళ్ళను తమ అందాన్ని పొగిడితే చాలు. తెగ మురిసిపోతారు. తమ ఉనికిని మరిచిపోతారు.

"ఈ లాకెట్ కి 'జె' వుంది. జేమ్స్ అనుకుంటున్నారా, నో. ఇది 'జయ'కి సింబల్" అంది తన పేరు పరిచయం చేస్తూ.

"ఎనీవే. అతుక్కుపోయాయి పేర్లు కూడా!" అన్నాను.

యింతలో తలుపు తట్టిన శబ్దం వినిపించింది. నా గుండె గుభేలుమంది. ఏం చేయడమో పాలుపోవడంలేదు. ఆమె మొహంలోకి చూశాను. తనేం తడబడలేదు.

"యిదిగో మంచం క్రింద దూరండి!" అంది.

గుండెలు అరచేతిలో పెట్టుకొని మంచంకింద దూరాను.

జయ తలుపులు తీసింది.

ఖాకీ దుస్తులు కళ్ళబడేసరికి కలవరం బయలుదేరింది నాకు. వ్యభిచారుల కొంపల్లో ఇదే బాధ. తాడిచెట్టుకింద పాలు తాగుతున్నట్టుంది నా పరిస్థితి. ఆ వచ్చే ఆయన హెడ్డులా వున్నాడు.

"జయా! కొంప మునిగింది. సాయంత్రం నీ యిల్లు సోదా చేస్తారట ఇన్స్పెక్టరుగారు. శెట్టిగారి హత్యకు

సంబంధించిన ఆధారాలు ఏవయినా నీ యింట్లో వున్నా యేమోనని — జాగ్రత్త! ఆ జేమ్స్, గంగారాంలను ఈ ఇంటి ఛాయలకు రానివ్వకు!" అంటూ ముందు జాగ్రత్త చెప్పేడు హెడ్డు. జయ భుజాలమీద చెయ్యివేసి దగ్గరకు లాక్కున్నాడు. నేరస్థులు ప్రభుత్వానికి దొరకడం లేదంటే ఎందుకు దొరుకుతారు కంచె చేనుమేస్తుంటే .... ముచ్చెమటలు పట్టాయి.

"సరే—వెళ్ళండిక!" అంది.

"మరి నా మామూలు...." అన్నాడు హెడ్డు ఆశగా.

బీరువా తెరుచుకుంది. అతగాడి చేతిలో పచ్చనోటు పడింది. తోకాడించుకుంటూ వెళ్ళిపోయే కుక్క గుర్తు కొచ్చింది హెడ్డును చూస్తే! తలుపులు మూసింది.

"రండి!" అని పిలిచింది.

"అమ్మయ్య .... ప్రాణం పోయింది. గండం గట్టెక్కింది" అన్నాను భయంగా నిట్టూర్పు విడుస్తూ.

"జేమ్స్! నువ్వు అర్జంటుగా వెళ్ళిపో!" అంది నా పేరు జేమ్స్ అనే భ్రమపడుతూ.

"ఏం—ఎందుకని!"

"పరిస్థితి ప్రమాదకరంగా వుంది! అవసరమయితే మళ్ళారా!""

"మరి నన్ను సురక్షితంగా కాపాడతానన్నావు?"

"నన్ను నేను కాపాడుకోవాలిగా!" అంది కోపంగా.

"సరే!" అంటూ లేచి నిలబడ్డాను.

"జేమ్స్ ఒక పని చెయ్—నువ్వు పోలీసుల కంటపడకుండా దొంగల స్థావరంలో వుండాలి అంతేకదా!" అంది. చిటికెవేసి కనుబొమలు ఎగరేస్తూ.

"అంతే! అంతే!"

"అయితే పెద్ద చెరువుగట్టు పక్కన తుమ్మలపల్లి వారి వీధిలో 'శ్రీ కృష్ణ మందిరం' వుంటుంది. నేను లెటరు రాపిస్తాను. వెళ్ళి కలువు. ఒకరోజు నిన్ను కాపాడ్డానికి వంద తీసుకుంటారు. నీకు పోలీసుల భయంగాని, యితర రౌడీల భయంగాని వుండదు! వాళ్ళ ప్రాణాలకు తెగించి మరీ రక్షించుకుంటారు!" అంది.

వెదకబోయిన తీగ కాళ్ళకు ఎదురయినట్లయింది నా పరిస్థితి. జయ ద్వారా జేమ్స్ విజయనగరంలోనే వుంటున్నాడని అపుడపుడు జయ దగ్గరికి వస్తుంటాడని తెలుసుకోగలిగాను. జేమ్స్‌ని పోలీసులకి ఒప్పగించినట్లయితే, మిగతా ముగ్గురి వివరాలు జేమ్స్ చెబుతాడు.

ముందు సుబ్రహ్మణ్యం శెట్టిగారింటికి వెళ్ళాలి. ఎలా మర్డర్ చేశారో కనుక్కోవాలి. ఏ పరిస్థితులో మర్డర్ చేశారో కనుక్కుంటే, మిగతా విషయాలు అవ్వే బయట పడతాయి. శెట్టిగారి యింటికని బయలుదేరాను.

5

పి.డబ్లు.డి. మార్కెట్‌లో శెట్టిగారింటికి వెళ్ళాను. శెట్టిగారింటి దగ్గర జనం లేరు. పలచగా సైకిళ్ళు, స్కూటర్లు మాత్రం ఆగాయి.

యింట్లోకి వెళ్ళాను. ఎవరో ఒక వయసు పండిన ఆసామి నన్ను పలకరించాడు. "ఎవరు నాయనా! ఎవరు కావాలి!" అంటూ.

"శెట్టిగారు ఎలా చనిపోయారండీ!" అన్నాను.

"ఆ భోగట్టా నీ కెందుకు బాబూ!" అన్నాడు వొణుకుతూ.

"నేను రిపోర్టర్‌నండీ. వివరాలు సేకరించి దిన పత్రికలో వేయించాలి!" అన్నాను తడుముకోకుండా.

"సరే నాయనా! యిదిగో అమ్మాయ్ ధనలక్ష్మి. పేప రాయన వచ్చారు. మాట్లాడు!" అంటూ పరిచయంచేశాడు నన్ను. ఆమె నమస్కారం చేసింది.

ఆమె కళ్ళు ఎర్రగా వున్నాయి. ఏడ్చి ఏడ్చి వుండటం వలన వుబ్బివున్నై.

"బాబూ! నిన్న సాయంత్రం టిఫిను చేశారు. బాత్రూంకి వెళ్ళారు. యింతలో 'కెవ్వ'మంటూ కేక వినిపించింది. అంతే! నలుగురు మనుషులు బయటికి మోసుకుపోయి కార్లో కూర్చోబెట్టారు" అంది.

"ఆ కారు నెంబరు చూశారా?"

"అదే చూడాలనుకున్నాను. అప్పటికే కారు కనుచూపు మేరలో వుంది. ఇంట్లో టేబిల్ డెస్కులో ఒక లెట రుంది. ఆ లెటరు చూశాక మాకు తెలిసింది. ఆ హంతకులు ముందుగానే మా వారికి డబ్బు యిమ్మని వార్నింగ్ యిచ్చారని ఈయన అలక్ష్యంచేస్తే చంపేస్తారని. ఇంతలో మా బంధువులొకాయన వచ్చి చెప్పేరు. మా వారిని పెద్ద చెరువు దగ్గర ఆ నలుగురూ బలవంతంగా పొట్టన పెట్టు కున్నట్లు...." అంటూ కళ్ళు మూసుకుంది. ఆమె దుఃఖం ఆపుకోలేకపోతోంది. వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఆ లెటరు మీ దగ్గరుందా?"

"ఉఁహూ. ఎడ్రసు రాసిన కవరు మాత్రం వుంది. యిస్తాను చూడండి. లెటరు పోలీసులు తీసుకెళ్ళారు" అంటూ కవరు ఇచ్చింది. అక్షరాలు పడుకోబెట్టినట్లున్నాయి. అంటే ఎడమచేతి వ్రాతగాళ్ళు ఎక్కువగా అలా రాస్తారు. హంతకుల్లో ఒకడు ఎడమచేతి రాతగాడయి వుండాలి.

నా బుర్రలో ఆలోచనలు వాయువేగంతో పరుగెడు తున్నాయి. కవరు వుంచాను.

"కారు రంగు చింతపిక్క రంగు కదూ!" అన్నాను.

అవునన్నట్లు తలూపింది ఆమె.

లేచి నిలబడ్డాను....'వస్తానమ్మా' అంటూ శలవు తీసుకున్నాను. కారు మెకానిక్ దగ్గర్లో వున్నాడేమో కనుక్కున్నాను. ఒకడు దొరికాడు.

"బాబూ! ఎవరయినా స్కూటర్లు, కార్లు దొంగిలిస్తే ఎక్కడ రంగులు వేయించడం, పార్టులు మార్పించడం చేస్తారు. దొంగలకు అనువయిన ఇంజనీరింగ్ షాపు ఎక్కడుంది?" అని అడిగాను.

"ఏమండీ! మీదేవయినా పోయిందా?"

"స్కూటరు పోయింది?" అన్నాను.

"స్కూటర్లు సైకిళ్ళయితే జొన్న వలస. కార్లు హెవీ వెహికల్స్ అయితే నెల్లిమర్ల!" అన్నాడు కంఠస్థం పట్టినట్లు.

నెల్లిమర్ల బయలుదేరాను. నెల్లిమర్లలో ఊరు చివర పాడుబడిన మెకానిక్ షెడ్‌లా వుందిగాని, చాలా బిజీగా వుంది.

ఒక కారుకి అర్జంటుగా పార్టులు మారుస్తున్నారు.

ఆ బండి రంగు చింతపిక్క రంగు.

నెంబరు బోర్డు ఎ.పి.వి. 2727 తీసేసి, ఎ.పి.వి.9191 పెడుతున్నారు. నన్ను ఎవరూ పోల్చుకోకుండా మొహానికి బ్లాక్ పౌడర్ రాసుకున్నాను. అంటే కారు ఇక్కడే వుంది. రాత్రి చూపిన నలుగురిలో ఏ ఒక్కడూ యిక్కడ లేడు. అంటే—అందరూ 'కృష్ణమందిరం'లో వున్నారన్నమాట.

6

"జయగారు నన్ను పంపించారు!" అన్నాను నన్ను పరిచయం చేసుకుంటూ....జేమ్స్ నన్ను ఎగాదిగా చూశాడు.

"ఏంకావాలి?" బొంగురు గొంతు రాత్రి గొంతు యిదే.

"మీ రక్షణ కావాలి!"

"ఎంతిస్తావ్!"

"మీరడగండి. నాకు శక్తున్నంతిస్తాను!" అన్నాను.

"మీ పనిని చెప్పండి. దాన్ని బట్టి రేటుంటుంది?" కీచుగొంతు.

"ఒకర్ని మర్డర్ చెయ్యాలి. ఎంతుంటుంది?"

"అది ఆ మనిషి అంతస్థుని బట్టి, మా రిస్క్‌నిబట్టి!"

"మీకు రిస్కేం వుండదు. పనిలో పని" అన్నాను.

"ఏవిటా పని?"

"సుబ్రహ్మణ్యం శెట్టిగారి భార్యను చంపాలి. మీకెంత కావాలన్నా యిస్తాను!" అన్నాను. క్షణం తెల్లబోయారు. ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"నువ్వెవ్వరివి?"

"శెట్టిగారి రెండో భార్య గజలక్ష్మి కొడుకుని. దొంగ ముండ మా అమ్మనీ నన్ను అన్యాయంచేసి తన కొడుకుల పేరిట తన పేరిట రాయించుకుంది ఆస్థినంతటినీ—" కసిగా తిట్టాను.

"సుబ్రహ్మణ్యం శెట్టిగార్ని ఎవరు చంపేరో నీకు తెలుసా?"

"నాకు తెలీదు. ఎవరు చంపితేనేం పుణ్యకార్యం చేశారు. వాళ్ళు కనిపిస్తే, నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టిస్తాను" అన్నాను.

గలగలా నవ్వింది బొంగురు గొంతు.

"సరే! ఆమెను చంపాలంటే పదివేలు. అడ్వాన్సుగా వెయ్యి పారెయ్. సాయంత్రంలోగా ఆ పని ఫినిష్

చేస్తాం!" అన్నాడు జేమ్స్.

"మనదగ్గర వెయ్యి.అరా పనికిరావ్ సార్! ఒకేసారి రెడీ కాష్ యిస్తాను. ఆమె శవం చూడగానే!"అన్నాను కపిగా.

యింతలో ఒక కుర్రాడు'ఫోన్ సర్!' అంటూపిలిచాడు.

నేను జేమ్స్‌ని ఫాలో అయ్యాను. జేమ్స్‌కి దగ్గర్లో నుంచున్నాను.

"హలో. నేను జేమ్స్‌ని మాట్లాడుతున్నాను!" అన్నాడు జేమ్స్ గొంతు మార్చి. దరిద్రులు వేషాలు మార్చినట్టు, గొంతులు కూడా మారుస్తారన్న మాట!

"ఏం జేమ్స్ నువ్వెళ్ళి ఎంత సేపయింది ఫోన్ చేయ వేంటి?" లాలనగా అడిగింది. బహుశా నేననుకొని వుంటుంది పిచ్చిజయ.

"నాన్సెన్స్ నేను వెళ్ళడమేంటి? ఫోనేంటి? నీ మొహం చూసి ఇరవై నాలుగ్గంటలయింది!" మండిపడ్డాడు.

"ఓహో నువ్వా! అక్కడికి 'జేమ్స్' అని కుర్రాడ్ని పంపించాను వచ్చాడా?" అంది అవతల గొంతు కీచు మంటూ ఫోన్లో వినపడుతుంది.

"జేమ్సా! ఏవిటి జయా! జేమ్స్ ఎవరు? యిక్కడికి నువ్వు పంపించడమేమిటి?" తడబడుతూ అడిగాడు జేమ్స్.

నా పరిస్థితి పులుసులోపడ్డ ఎలకలా తయారైంది.

"ఎవరో శెట్టిగారి అబ్బాయి వచ్చాడు. వాళ్ళ పినతల్లిని ఫినిష్ చేయాలంటూ. ఇంకెవరూ రాలేదు!"

"ఎలా వుంటాడు!"

"వయసులో వున్నాడు!"

"రంగు!"

"కారు నలుపు!"

"కాదు. బ్రైట్‌గా వుంటాడు చూడండి! ఆయనే జేమ్స్

నాకేదో అనుమానంగా వుంది. వాడ్ని ఫినిష్ చేయండి!" అంటూ ఫోను పెట్టేసింది. ఆకలిగొన్న పులిలా నాకేసి చూశాడు జేమ్స్.

"ఏంరా నీ పేరు!"

"జేమ్స్!"

"మరి శెట్టిగారి కొడుకన్నావు!"

"అవసరాన్నిబట్టి!" అన్నాను భయపడకుండా.

"ఏంరా! నీ పేరు!" ఈ సారి కీచుగొంతు ప్రశ్నించింది.

"రాము" అసలు పేరు చెప్పాను అనుకోకుండా.

అంతే చెరోటి ఇచ్చారు. తల గింగుర్లు తిరిగిపోయింది. ఎగిరి జేమ్స్ మొహంమీద గుద్దాను. రాత్రి గెడ్డం యిదే.... యిదే స్పర్శ. కాలరు పుచ్చుకున్నాను. వెనుక మారుగా రంగారాం కత్తి తీసుకుని వస్తున్నాడు. ఝళిపిస్తున్నాడు.

"మమ్మల్ని మోసం చేద్దామనుకున్నావ్రా రాస్కెల్" అంటూ కత్తి గాల్లోకి ఎత్తాడు. అంతే! 'ఢాం' అంటూ పిస్తోలు పేలింది.

ఎదురుగా ఇన్‌స్పెక్టర్ గున్నారావు అండ్ స్టాఫ్ పోలీసులు బిలబిల మంటూ దిగి జేమ్స్‌నీ, గంగారాంనీ, మరో ఆయన్ని పట్టుకున్నారు. నాలుగోవాడు లేడు. బహుశా కారు షెడ్‌కి వెళ్ళుంటాడు.

"మిస్టర్ రామూ! వీరినేనా నువ్వు రాత్రి చూసింది!" అని అడిగారు గున్నారావుగారు చిరునవ్వుతో.

"అవున్సార్! ఈ జేమ్స్ స్పర్శ కూడా గుర్తుపట్టాను. రాత్రి నేను చూసినపుడు వీరి కారురంగు చింతపిక్క రంగు. కాని ఆ కారు యిప్పుడు రీమోడల్ చేయించు కుంటుంది నెల్లిమర్లలో. రాత్రి కారు నెంబర్ 2727 ఎ.పి.వి. ఈ రోజు కారు నెంబర్ ఎ.పి.వి. 9191.

ఇప్పుడు రంగు కూడా తెలుపు. ఇలా రంగులు మారుస్తూ హత్యలూ, దోపిడీలు చేస్తూ బ్రతుకుతున్నారు వీళ్ళంతా!" అంటూ చూపించాను.

"మోసం సార్! మాకేం తెలీదు. మాకా శెట్టిగా రెవరో తెలీదు. మాకే హత్యతో సంబంధం లేదు" అని అరిచాడు జేమ్స్.

జేమ్స్ కళ్ళముందు జేమ్స్ ఛెయిను మెరిసింది. ఆగి పోయాడు.

"ఆగిపోయావేం? ఈ ఛెయిను నీదే. తీసుకో! అంటూ విసిరాడు ఇన్స్పెక్టర్ గున్నారావ్. జేమ్స్ ఛెయిను అందు కుని అప్రయత్నంగా శిలువను అద్దుకున్నాడు అలవాటుగా—

"గంగారాం! ఈ ఛెయిను నీదా!" అంటూ ఛెయిను విసిరాడు ఇన్స్పెక్టర్.

అది స్టీలు ఛెయిను. ఎడమ చేతితో అందుకున్నాడు. అంటే యెడమచేతివాటమన్నమాట. బ్లాక్ మెయిలింగ్ లెటరు రాపిందీ యితనే అయివుండాలి. గంగారాం చేత సిగ్నేచర్ చేయించమని ఇన్స్పెక్టర్గారి చెవిలో చెప్పేను.

"గంగారాం నీ సిగ్నేచర్ ఈ పేపరు మీద చెయ్యి!" అంటూ బుక్కు, పెన్ను అందించాడు. జేమ్స్ వద్దు అన్నట్లు సైగ చేస్తూన్నా గంగారాం యెడమచేతితో సిగ్నే చర్ చేశాడు.

"నాకేం తెలీదు. నన్ను వదిలేయండి!" అన్నాడు కీచు గొంతుతో భోరుమని ఏడుస్తూ.

జేబులో ఎడ్రసు రాపిన కాగితాన్ని తీసి టాలీ చేశాను. రెండు పేపర్ల మీద వున్న అక్షరాల స్టయిలు ఒకేలా వుంది. ఈ పోలిక ఇన్స్పెక్టర్గారు చూసి ఆశ్చర్య పోయారు. వెంటనే ఆయన ధనలక్ష్మిగారి దగ్గర సేకరిం

చిన బ్లాక్ మెయిలింగు లెటరుతీసి చూశాడు. ఒకే రైటింగ్.

"అన్యాయం! మాకేంతెలీదు!" అంటూ అరిచాడు జేమ్స్.

"ఏది అన్యాయం! నిన్న సాయంత్రం బాత్రూం నుండి సుబ్రహ్మణ్యం శ్రేష్ఠిగార్ని ఎత్తుకెళ్ళడం అన్యాయమా. పెద్ద చెరువు వద్ద బలవంతంగా చంపడం అన్యాయమా? చిట్టివలస వాగు దగ్గర మమ్మల్ని అంటే - నన్ను, నా మిత్రుణ్ని కళ్ళకు గంతలుకట్టి మా ముందు ఒక పెట్టెలో శెట్టిగారి శవాన్ని వదిలి వెళ్ళడం అన్యాయమా! నీ కారు నెంబరుమార్చడం అన్యాయమా! రంగులు మార్చడం అన్యాయమా? ఏది అన్యాయం?" అని అడిగాను ఆవేశంగా.

"నువ్వా! రాత్రి కనిపించిన...."

"అవును. నేనే—నా కళ్ళముందే నేరం జరుగుతుంటే సహించలేకపోయాను. ఈ కేసుకు నేనే పరిశోధించాలనుకున్నాను. ఇన్స్పెక్టర్‌గారి ఆశీస్సులతో ప్రారంభించాను. ప్లాన్డ్‌గా స్టెప్‌వేసి, ముందు నీ ప్రేయసి యింట్లో పాగా వేసి, నీ చరిత్ర కనుక్కొని, రాత్రి నేను చూపిన కారు స్థితి కళ్ళారా చూసి, మీ మందిరానికి వచ్చేముందు ఇన్స్పెక్టర్‌గారితో అన్ని విషయాలు ఫోన్లో మాట్లాడి వచ్చాను" అన్నాను ఉక్రోషంగా.

"శభాష్ రామూ! వుయ్ ఫీల్ ప్రౌడ్ ఆఫ్ యూ! నీలాంటివాడు పోలీస్ డిపార్ట్‌మెంటుకి అవసరం! బై దిబై ప్రభుత్వం నిన్ను గుర్తిస్తుందనీ, నీకు తగిన బహుమతి యిస్తుందనీ ముందే చెప్పాను కదూ. ఆ ఏర్పాట్లు రేపే చేస్తాను....సరేనా?" అంటూ భుజం చరిచాడు ఇన్స్పెక్టర్.

"ఓ. కే. థాంక్యూ సర్!" అన్నాను.

జీప్ కదిలింది హంతకులతో నెల్లిమర్ల వైపు. గర్వంగా ముందుకు అడుగేసి తృప్తిగా నిట్టూర్పు విడిచాను. □

జారిపడిన జవ్వాని

సికిందర్

ఇన్‌స్పెక్టర్ వినాయకరావు ఒక సిగరెట్ ఉత్సాహంగా వెల్గించుకుని "చెప్పు గోవిందరావ్, ఏమిటి ఊళ్ళో గొడవలు?" అని అడిగాడు.

హెడ్ గోవిందరావ్ అలవాటుగా పొట్ట తడుముకొని "ఏమీలేవు సార్. ఊరు చల్లగా వుంది" అన్నాడు.

"సెక్స్ గొడవలేం లేవుగా?"

"మన దృష్టికి వస్తే తప్ప, లేవనే అనుకోవాలి సార్."

"కనిపెట్టి వుండాలి గోవిందరావ్. ప్రతిక్షణం కని పెట్టాలి" బోధించాడు ఇన్స్పెక్టర్ రావ్, "సెక్స ఈజె సాక్రెడ్ థింగ్," గుర్తుంచుకో. దాన్ని దుర్వినియోగపర్చే వాళ్ళు దున్నపోతులకన్నా హీనం! సెక్స అనాచారాల్ని అరికడితే మనం చాలావాటిని నివారించగలం, గోవింద రావ్. పోట్లాటలు, పోటెక్కిపోవడాలు, పొడుచుకోవ డాలూ....మన జమీందారు కేసు చూశావుగా?"

"చాలా ట్రాజడీ సార్."

"అంతే, గోవిందరావ్. రంకు అనేది జరుగుతున్నంత వరకు రంజుగానే అన్పిస్తుంది. రంగులు బయటపడ్డాయా అది ట్రాజడీగానే ముగుస్తుంది. ప్రతీ సెక్స అనాచారం ట్రాజడీగానే ముగుస్తుంది....మన జమీందారు అంత 'పెద్ద మనిష'ని నే నెప్పుడూ అనుకోలేదు."

"సంఘంలో యింకా వున్నారు సార్, ఇలాంటి పెద్ద మనుషులు."

రావ్ తలెగరేశాడు: "వాళ్ళందరికీ యెప్పుడో మూడు తుంది...." అతడింకా ఏదో అనబోతూండగా, బయట ఎవరో పరుగెత్తుకొస్తున్న చప్పుడైంది. ఆ వెంటనే అరుపు విన్పించింది.

"సార్, మీరు వెంటనే రావాలి! అవతల టీచరు గారింట్లో ఘోరం జరిగిపోయింది."

"ఏ టీచరుగారింట్లో?" ఎదురుగా వచ్చి వగురుస్తూ నిల బడ్డ నెం. 58 ని చూస్తూ అడిగాడు రావ్ నింపాదిగా.

"వెంకట్రావ్ టీచరుగారింట్లో సార్!"

"ఏం జరిగిందాయన ఇంట్లో?"

"వాళ్ళమ్మాయి కింద పడిపోయింది సార్!"

"ఏ అమ్మాయి కింద పడిపోయింది?"

"రెండో అమ్మాయి సార్!"

"ఎక్కడ్నించి పడిపోయింది?"

"మిషను—కుట్టుమిషను మీదనుంచి, సార్!"

"కుట్టుమిషను—దా నిమీదెందుకుందామె?"

"ఇంటి బూజు దులుపుతోంది సార్!"

"బూజు దులుపుతూంటే ఏమైంది?"

"జారిపడి చచ్చిపోయింది, సార్!"

రావ్ హెడ్ వైపు తిరిగి విస్మయంగా చూశాడు. హెడ్ కలవరంగా చూస్తున్నాడు. "గోవిందరావ్ ఇది నమ్మొచ్చా?" అడిగాడు రావ్ నింపాదిగానే.

హెడ్ తేరుకుని నెం. 58 ని చూశాడు చురుగ్గా.

"కుట్టుమిషను మీద నుంచి పడిపోతే చచ్చిపోతారా?" అడిగాడతను.

"మీరు చావకపోవచ్చు" చెప్పాడు నెం. 58, హెడ్ ఆకారాన్ని చూస్తూ.

"ఏమిటీ! నన్ను చావమంటున్నావా?"

"మీరు చావకపోవచ్చన్నాను."

"నిన్నా—నిన్నా—సార్, ఇతన్ని తక్షణం డిస్మిస్ చేయాలి!"

"డిస్మిస్ నిన్ను చేయాలి!" కసిరాడు రావ్ కోపంగా. "నువ్వు బుర్ర సరిగ్గా తోముకోవు గోవిందరావ్. ఇది నమ్మొచ్చా—అనడిగాను. అంటే ఏమిటి దానర్థం? ఇంత కాలం ఆడుతూ పాడుతూ మనమధ్య ఆరోగ్యంగా తిరిగిన పదిహేడేళ్ళ పిల్ల, ఇలా అకస్మాత్తుగా మనమధ్య నుంచి వెళ్ళిపోవడం నమ్మలేను గోవిందరావూ—అని! అంతే

గాని, కుట్టుమిషను మీదనుంచి పడితే చచ్చిపోరని కాదు. ఇక పద, వెళ్ళి చూద్దాం!"

2

ఆకుపచ్చ రంగు జాకెట్, పసుపురంగు లంగా, అదే రంగు పరికిణీలో వున్న ఆమె, కటికనేల మీద రక్తపు మడుగులో పడివుంది, నిర్జీవంగా.

వయసు పదిహేడు మించదు. చామన ఛాయ రంగు. గుండ్రని చంద్రబింబంలాటి మొహం. పల్చగా, ఆకర్షణీయంగా వుండే నాసిక, పెదాలు. ఇంకా వర్ణించడానికి చాలా వుందిగానీ, మృత్యుభావం ముల్లులా తగులుతూంటుంది....

ఆమె తల ఒకవైపు రక్తంలో మునిగివుంది. కళ్ళు మూసుకునే వున్నాయి. శరీరం ఎడమ ప్రక్కకు, గోడ వారగా ఒత్తిగిలి వుంది. తల మాత్రం కుడివైపు తిరిగి వుంది. చేతులు గోడవైపే చాపివున్నాయి. ఆ ప్రక్కనే ఒక పుల్లల చీపురు పడివుంది.

ఆ చీపురుకు బూజు అంటివుంది.

ఆమె చేతులకి, తలకి కూడా బూజు అంటుకుని వుంది.

ఆమె తలదగ్గరే అడుగు దూరంలో పడివుంది అడ్డంగా మిషను గుడ్డ.

ఆమె కాళ్ళ దగ్గర తలక్రిందులై వుంది కుట్టుమిషను.

ఇన్స్పెక్టర్ రావ్ చక్షువులు చురుగ్గా వీక్షిస్తున్నాయి కనిపిస్తున్న దృశ్యాన్ని.

అతని మంద (ది ఫేమస్ నెం. 325, 275, 58 ప్లస్ హెడ్ జి.వి. రావ్) ఉద్వేకాందోళనలతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు చూస్తూ.

ఓ ప్రక్కనుంచి ఇంటివాళ్ళ రోదనలు విన్పిస్తూంటే,

బయటి నుంచి వస్తున్న జనం రొద మరోవైపు.

రోదిస్తున్నవారిలో మృత్యురాలి తల్లి మీనాక్షి (36), అక్క ఉమ (19), అన్న రమేష్ (21) వున్నారు. తండ్రి వెంకట్రావు నిశ్శబ్దంగా విలపిస్తున్నాడు.

ఇన్స్పెక్టర్ వాళ్ళని సానుభూతిగా చూశాడు.

దుర్మరణంపాలైన ఉష మీనాక్షి సొంత కూతురనీ, మిగిలిన ఇద్దరు వెంకట్రావ్ మొదటి భార్య సంతానమనీ అతనికి తెలుసు.

ఉమని, రమేష్ని చూశాడు ఇన్స్పెక్టర్. వాళ్ళు ఉషని ఎంతో అభిమానం, ప్రేమతో చూస్తారని అతనికి తెలుసు.

రావ్ ఉమని చూశాడు. ఆమె ఏడుస్తోంది. ఆమె వళ్ళు, బట్టలు, తల తడిశాయి.

రావ్ తల తిప్పి హుంకరించాడు. మంద కదిలింది.

"ఎవర్నీ రానివ్వకుండా ఆపండి! అందర్నీ దూరంగా వుంచండి! మూడుంపాతిక వెళ్ళి ఫోటోగ్రాఫర్ని పట్టుకు రావాలి. సగం నూటపదహార్లు టౌనుకి బండి సవారీ మాట్లాడుకు రావాలి—వెళ్ళండి!"

ఆజ్ఞ జారీ చేశాడు రావ్.

హెడ్ కలవరంగా చూశాడు. "సార్, మీరేమనుకుంటున్నారు దీన్ని?"

"ఏమీ అనుకోవడంలేదు. కానీ ప్రతిసంఘటనకు ఇన్వెస్టిగేషన్ వుంటుంది."

"మీరనవసరంగా అనుమానిస్తున్నారేమో...."

రావ్ రెచ్చిపోయాడు "ఏమిటి అంటున్నావ్ గోవింద రావ్? సోమరితనం ఎక్కువైంది నీకు. ప్రతివాన్నీ చూసీ చూడగానే మూతపెట్టేయాలని చూస్తావు. నిన్నెప్పుడో గోనెబస్తాలో కుట్టేసి షిప్పులో పడేస్తాను చూడు—"

"సార్ గోనెబస్తాలో పట్టను."

"కోసి నింపుతాను!" అరిచాడు రావ్, అంతా అదిరి పడి చూసేలా.

అపుడు చల్లబడి శవంవైపు తిరిగాడు. జేబులోంచి చిన్న బుక్కుతీసి పాయింట్స్ వ్రాసుకోసాగాడు:

తల వెనుక భాగం ఫ్రాక్చర్. మిషను బ్రాండ్ మెరిట్. మిషన్ గడ్డ తలవైపు దూరం అడుగు. పొజిషన్ సమాంతరంగా. ఫేస్ప్లేట్ తలవైపు. టాప్‌వీల్ గోడవైపు. ఫేస్ప్లేట్ క్రింద పార్ట్సకి రక్తం. పైన త్రెడ్ పిన్ను, టేకప్‌లీవర్‌లకి కూడా రక్తం. నీడిల్ బార్, మిగతా భాగాలన్నీ శుభ్రం.

మిషను బాడీ కాళ్ళదగ్గర. దూరం ఆరంగుళాలు. పొజిషను నేల బారుగా తలక్రిందులు, స్టాండ్‌వీల్ కాళ్ళవైపు బెల్టు జారిపోయి. టేబుల్ నట్స్ పైకిలేచి....

ఆ తర్వాత శవం పొజిషన్ కూడా రాసుకున్నాడు.

బుక్ జేబులో పెట్టుకుని, తలెత్తి గోడలవంక, కప్పువంకా చూశాడు. ఆమె పడిపోయిన వైపే శుభ్రంగా వుంది. మిగిలిన మూడు మూలలూ అలాగే వున్నాయి, దులపకుండా.

రావ్ కుటుంబ సభ్యుల దగ్గరికి కదిలాడు. నెం. 275 ని శవం దగ్గర పెట్టి.

వెంకట్రావు ప్రక్కన కుర్చీలో కూర్చొని "ఎలా జరిగింది మేష్టారూ?" అని అడిగాడు.

అతను వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు, కన్నకూతురి మరణానికి మీనాక్షి గుండెలు పగిలేలా రోదిస్తూంది.

"ఏడవకండి, చెప్పండి."

"నేను స్కూల్లో వున్నాను. అబ్బాయి రాజుగాడి

హోటల్‌లో వున్నాడు. వీళ్ళు ముగ్గురే యింట్లో వున్నారు. మీనాక్షి వంటగదిలో వుందట. ఉమ స్నానం చేస్తోంది. ఉష ఇల్లంతా బూజుపట్టిందని దులపడానికి బయలుదేరిం దట. పది నిమిషాలయిందో లేదో పెద్ద చప్పుడూ, కేకా విన్పించాయట మీనాక్షికి. పరుగెత్తుకొచ్చి చూస్తే అమ్మాయి యిలా పడిపోయి వుంది. గాభరాపడి అరిస్తే ఉమ కూడా పరుగెత్తుకొచ్చిందట బాత్‌రూంలోంచి...."

"అప్పుడు?"

"అప్పుడు ఇద్దరి అరుపులూ విని బయటివాళ్ళు వచ్చా రట....అమ్మాయి తలలోంచి రక్తం వచ్చేస్తోంది....కదిపి చూస్తే పలకలేదట. కళ్ళు తెరవలేదట. జరిగింది గ్రహించి వెంటనే మీకు నాకూ కబురు పెట్టించారు."

రావ్ తలూపాడు, "ఆమెను బూజు దులపమని యెవ రన్నారు?"

"అక్కాచెల్లెళ్ళు అనుకున్నారట. అక్క స్నానానికి వెళ్ళిపోయింది. ఉష చీపురు తీసుకుని వెళ్తుంటే మీనాక్షి చూసిందిట. అది చూసుకోకుండా మిషను ఎక్కింది. పనిలోపడి జరుగుతూ, చివరికి రాగానే మిషను పైకిలేచి పోయింది ...ఎడమవైపు చెక్కకింద స్టాండుకంటే ఎంత పొడవు వుందో చూడండి. దాని మీదికి వస్తే బ్యాలెన్సు వుంటుందా?"

"ఉండదు."

వెంకట్రావ్ అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ "అది పైకి లేవగానే కిందికి జారి పడిపోయింది. మిషను గడ్డ వూడి వచ్చి ఆ విసురుకు తలమీద పడినట్టుంది....అంతే! అది వచ్చిపడితే ఏమైనా వుందా! ఎంత బరువుంటుందది! ఖర్మ, ఇన్‌స్పెక్టర్‌గారూ, ఖర్మ! పొద్దున్నే ఎవరి మొహం

చూపిందో...."

రావ్ లేచి, లోపలి కొచ్చిన ఫోటోగ్రాఫర్ దగ్గరి కెళ్ళాడు. అతనికి సూచనలిచ్చి, కావలసిన కోణాల్లో ఫోటోలు తీయించాడు.

వేలిముద్రలు తీసుకున్నారు.

3

"గోవిందరావ్ వేలిముద్రలు బోలెడు వున్నాయి."

మర్నాడు ఉదయం పది గంటలకి, అప్పుడే అందిన వేలిముద్రల ఫోటోలు చూస్తూ చెప్పాడు రావ్.

హెడ్ ఆసక్తిగా చూశాడు "ఎక్కడెక్కడ సార్?"

"చాలా చోట్ల!" అన్నాడు రావ్ చూపిస్తూ. "ఇదిగో ఇది టాప్ వీల్‌మీద—బొటన, చూపుడు, మధ్యవేళ్ళు. ఈ నెక్‌మీద చూడు రెండు చేతులవీ అయిదు వేళ్ళు—ఓ గాడ్! ఉండకూడదని మనమెలా అంటాం! అది ఇంట్లో వస్తువు. ఎవరివైనా వుండొచ్చు. ఎన్నైనా వుండొచ్చు—

సరే, ఇది చూడు! ఫేస్‌ప్లేట్‌మీద రెండు చివర్ల దగ్గరా నాలుగేసి ముద్రలు! అవునోయ్ గోవిందరావ్రా. గడ్డని ఎత్త డానికి రెండు చేతులు అవసరం—అది పదిహేను కిలోల బరువుంటుంది....ఓహ్. ఓహ్, ఇక్కడ చూడు ..."

"ఎక్కడ సార్?"

"టేబులు అంచులమీద! కుడివైపు కాదు, ఎడమ వైపు. బట్ట జరిగే వైపు. రెండు పక్కలా రెండు బొటన వేలిముద్రలు! టేబుల్ కింది తలంమీద వేలిముద్రలు రావట—అది గరుగ్గా వుంది."

"ఇందులో ఏదో కుట్ర వుంది సార్!"

వెంకట్రావ్ గబగబా లోపలికి వచ్చి, నమస్కరించి కూర్చున్నాడు.

రావ్ అతన్ని కుతూహలంగా చూశాడు. "చెప్పండి మేష్టారూ, ఏం జరిగింది?"

వెంకట్రావు నోరు విప్పాడు. "ఇప్పుడే మీనాక్షి చెప్పింది.

"ఏమని?"

"ఆమె నిన్న ఉదయం డాబామీద బట్టలారేస్తోందట...."

"ఏ సమయంలో?"

"అప్పుడే, అది జరగడానికి పావుగంట ముందు."

"అయితే?"

"అప్పుడు ఇంటిముందు రాజుగాడు కన్పించాడట."

"ఏ రాజుగాడు?"

"హోటల్ రాజుగాడు."

"వాడు—అయ్యో మ్మా హోటల్ రాజుగాడేనా?"

"అవును. వాడు యింటి ముందు నించి పోతూ, ఇటు చూసుకుంటూ వెళ్ళాడట. అప్పుడే మీనాక్షి కిందికి వచ్చి వంటగదిలోకి వెళ్ళడం, అమ్మాయి చీపురుతో ఇంట్లోకి వెళ్ళడమూ జరిగిందట...."

"ఓహ్, అయితే నాతో ఎందుకు చెప్తున్నారు?

"ఆ రాజుగాడు అమ్మాయిని వేధించేవాడు...."

రావ్ హెడ్‌వైపు ఓ చూపు వేశాడు. అతను ఉద్రేకపడ్డాడు. "ఆ రాజుగాడే...."

"ఆపు" రావ్ వెంకట్రావ్ వైపు తిరిగాడు. "ఏం చేసేవాడు?"

"ఊరికే వెంటపడి సతాయించేవాడు. ఏవో పిచ్చి పిచ్చి సైగలు చేసేవాడట....మా వీధిలోనే తిరిగేవాడు. మూడు రోజుల క్రితమే వాడ్ని చెంపదెబ్బ కొట్టినట్టు చెప్పిందట ఉష, అక్కకి. ఉమ నాతో అంది...."

రావ్ కోపంగా చూశాడు "మీరీ విషయం నాకు చెప్ప కుండా యెందుకు వుంచారు మేష్టారుగారూ? యిలాంటి వేషాలు వేసే వెధవల్ని ఎలా దారికి తెస్తానో మీకు తెలియదూ?"

"ఎలా చెప్పను ఇన్స్పెక్టర్‌గారూ? పరువు మర్యాదల విషయం. ఇలాటివి అనుభవిస్తాంగానీ బయటికి చెప్పు కుంటే.... అందులోనూ పెద్దమ్మాయి పెళ్ళికి ముందు ఈ గొడవలు పెట్టుకోవడం...."

"అవునవును, పెద్దమ్మాయి పెళ్ళి. అదెంతవరకూ వచ్చింది...." అంటూ రావ్ హెడ్ వైపు తిరిగి అన్నాడు "ఆ రాజుగాడ్ని చెవులుపట్టి ఈడ్చుకురండి. వెధవకి పెళ్ళయింది. సెక్స్ దొంగల్ని కనిపెట్టమంటే ఏం చేస్తున్నారు మీ మంద అంతా!"

ఆ సమయంలో మాట్లాడకపోవడమే మంచిదని వెళ్ళిపోయాడు హెడ్.

"వాడు ఇంట్లోకి వెళ్ళగా ఎవరైనా చూశారా?" అడిగాడు రావ్.

"లేదట" అన్నాడు వెంకట్రావు.

"వీధిలో ఎవరికైనా కన్పించాడా?"

"ఏమో, నేనడగలేదు—"

"ఇప్పుడు మేష్టారూ, మీ రీ రాజుగాడ్ని గురించి నాకు చెప్తున్నారంటే, మీ అమ్మాయి చావుని మరో విధంగా భావిస్తున్నారా? ఎలా?"

"అవును, భావిస్తున్నాను. వాడి కారణంగానే జరిగిందనిపిస్తోంది....వాడు అమ్మాయి కోసమే అటు వచ్చాడు. ఆ సమయంలో వీధిలో యెవ్వరూ వుండరు. అది చూసి వాడు లోపలికి జొరబడి వుంటాడు. అంతకు ముందు అమ్మాయి

కొట్టిన కోపంతో వాడేం చేయాలనుకున్నాడో చెప్పలేను. కానీ వాడ్నలా చూడగానే మిషనెక్కి వున్న అమ్మాయి బెదిరివుంటుంది. ఆ కంగారులో బల్ల అంచుకి వెళ్ళిపోయి మిషను దొర్లడంతో పడిపోయి వుంటుంది....వాడప్పుడే పారిపోయి వుంటాడు. ఇక్కడ మిషను గడ్డ వూడివచ్చి అమ్మాయిమీద పడి...."

"అవునవును, తలమీద పడి చచ్చిపోయింది. అలా జరిగివుంటే, గడ్డ ఒక్కసారే పడుతుంది. కానీ ఒకటి కంటే యెక్కువసార్లు తలమీద పడిందని పోస్టుమార్టమ్ రిపోర్టు చెప్తోంది. అంతే కాదు....సరే, యీ విషయం అలా వుంచుదాం. మీ పెద్దమ్మాయి పెళ్ళి యిప్పు దేమయింది?"

"ఇప్పుడే తెలియదు. వాళ్ళ కింకా తెలియపర్చలేదు. రెండు నెలల్లో జరుగవల్సింది, యిప్పుడేమవుతుందో చెప్ప లేను. నా శక్తికి మించి కట్నకానుకలు యివ్వడానికి సిద్ధ పడ్డాను. వాళ్ళిప్పుడేదో కారణం పట్టుకుని వదులుకుంటే.... నేనేమవుతానో వూహించలేను...."

మాట్లాడుకుంటూ వుండగా రాజుని తీసుకువచ్చారు వెళ్ళినవాళ్ళు.

అతను వణుకుతూ వచ్చి నిలబడ్డాడు.

రావ్ అతన్నిచూసి ఆగ్రహోదగ్రుడయ్యాడు. "నువ్వేనా రాజుగాడివి?"

"అవును, సార్. అయ్యోయమ్మా కాఫీక్లబ్ అండ్ రెస్టురూం ప్రొప్రయిటర్ని...."

"రెస్టురూంలో ఏం జరుగుతూంటుంది?"

"ఏమీ జరుగదు సార్. జనం కూర్చుంటారు."

"నువ్వు వూరిమీద తిరుగుతుంటావా?"

"లేదు సార్, హోటల్‌లోనే కూర్చుంటాను."

"పెళ్ళయిందా?"

"అయింది, సార్. ఇద్దరు పిల్లలు."

"ఈయన—వెంకట్రావు మేష్టారిని ఎరుగుదువా?"

"బాగా ఎరుగుదును, సార్."

"వాళ్ళ అమ్మాయిని?"

"తెలుసు సార్—" నాలిక కరుచుకుని, "తెలియదు!" అన్నాడు రాజు.

రావు గబాల్న లేచి మెడ పట్టుకున్నాడు, "నిజం చెప్పు, చంపేస్తాను."

"నిజమే చెప్తున్నాను సార్, నిజమే...."

"మేష్టారుగారి చిన్నమ్మాయి వెంటపడి **వేధించి**, మొన్న చెంపదెబ్బ తిన్నది నిజమేనా?"

"ని—నిజమే."

"అలా చెప్పు అయితే నిన్న ఏం చేశావ్?"

రాజు గజ గజ వణికిపోతున్నాడు: "నిన్న ఏమీ చేయ లేదు సార్!"

"మేష్టారుగారి యింటివైపు వెళ్ళలేదా?"

"లేదు—లేదు సార్.

రావ్ కోపంతో లాగి చెంపమీద కొట్టాడు.

దెబ్బతిని రాజు, "అయ్యోయమ్మా!" అన్నాడు.

"రాస్కెల్, చెప్పకపోతే మళ్ళీ కొడ్తాను. అమ్మమ్మా అంటావు. అప్పటికీ చెప్పకపోతే మళ్ళీ కొడతాను—నానమ్మా అంటావు. ఇంకా మొండికేస్తే చితక బాదేస్తాను - తాత ముత్తాతల నుంచీ మొత్తం నీ వంశవృక్షాన్ని తలచుకుంటావు! చెప్పు—"

"నేను నిన్న మాష్టారుగా రింటివైపు వెళ్ళలేదు, సార్."

"రావ్ చెయ్యెత్తాడు.

"కొట్టకండి సార్! నిజం చెప్తున్నాను. అమ్మతోడు!"

"వెధవా, తోడూ—తాడు అంటే సరిపోదు. రుజువు కావాలి రుజువు!"

"నిజం చెప్తున్నాను సార్! నిన్న నే నెక్కడికీ...."

"వెధవా, నీకు పెళ్ళయింది. ఇద్దరు పిల్లలున్నారు. నీ వయసు ఇరవైతొమ్మిది. నీ కిదేం రోగంరా? వున్న వూళ్లో బుద్ధిగా వుండక?" హెడ్‌వైపు తిరిగాడు రావ్. "వీడు సెక్స్ దొంగ. లాకప్‌లో పడెయ్యి వీడ్ని. తర్వాత టైము తీసుకుని తోముదాం. వీడిలా అడిగితే చెప్పడు...."

అతన్ని ఈడ్చుకుపోతూంటే వెంకట్రావ్ కలవరంగా చూశాడు.

"ఏమిటి, మేష్టారూ?" అడిగాడు రావ్.

"ఏమీ లేదు, ఏమీ లేదు...." సర్దుకున్నాడు వెంకట్రావ్.

"వాడికి చికిత్స వేరేవుంది. మీరు చెప్పాల్సింది యింకేమైనా వుందా?"

"ఏమీలేదు. ఏమీలేదు...." అతను లేచి గబగబా వెళ్ళిపోతూంటే రావ్ అయోమయంగా చూశాడు.

"సార్! పోలీస్, సార్!"

లాకప్‌లోంచి అరిచాడు రాజు.

"ఏమిట్రా, అరుస్తున్నావ్?"

"పోలీస్ సార్! మీకు రుజువు కావాలా రుజువు? అయితే మేష్టారుగా రబ్బాయి నడగండి! అత నక్కడే వున్నాడప్పుడు....నా కాఫీ క్లబ్ అండ్ రెస్టురూంలో!"

4

"అవును, నిన్న నేను వాడి హోటల్‌లోనే వున్నాను. నాన్నగారు మీకు చెప్పేవుంటారు. వాడక్కడే వున్నాడు నే నున్నంతసేపు. నే నక్కడ ఆక్సిడెంట్ జరగడానికి గంట ముందునుంచి వున్నాను" అన్నాడు రమేష్ ఇన్‌స్పెక్టర్‌తో.

రావ్ సాలోచనగా తలూపాడు. "రమేష్, యిప్పుడు నాన్న యెక్కడున్నాడు?"

"ఇంట్లోనే."

"ఏం చేస్తున్నాడు?"

"అమ్మని కోప్పడుతున్నాడు."

"ఎందుకు?"

"ఆమె అబద్ధం చెప్పిందట, రాజుగాడు నిన్న యింటి వైపు వచ్చాడని. రాగానే నన్నడిగి తెలుసుకుని ఆమెని కోప్పడ్డాడు ...."

"ఆమె ఏమంది?"

"ఒప్పుకుంది. ఉషని వా డలా అల్లరిపెడితే, మనసూరుకోక అలా చెప్పిందట. ఆమె అబద్ధంతో అనవసరంగా రాజు ...."

"ఉష నీకు చెల్లెలు. రాజు ఆమెని అల్లరిపెట్టాడు. అయినా నువ్వతనితో స్నేహం చేస్తున్నావా?"

"లేదు సార్!"

"మరి వాడి హోటల్ కెందుకెళ్తున్నావ్?"

"అలవాటు చొప్పున.... ఫ్రెండ్స్ తీసికెళ్తే...."

"ఉష అంటే నీ కిష్టం లేదుకదూ?"

"సార్ ...."

"నీ పెద్దచెల్లెలు ఉషకి కూడా!"

"సార్, మీరేమంటున్నారో అర్థంగావడం లేదు."

"ఏమీలేదు, సమయం వస్తే అన్నీ అర్థమవుతాయి. నువ్వొక పని చేస్తావా?"

"ఏమిటి?"

"మీ కుట్టుమిషనుమీద చాలా వేలిముద్ర లున్నాయి. అవి గుర్తించాలంటే ముందు మీ యింట్లో అందరి వేలి ముద్రలు కావాలి. హెడ్‌ని నీతో పంపుతాను. మీ అమ్మవి, నాన్నవి, చెల్లెలివి, నీవి వేలిముద్రలు పంపు?"

"అలాగే....అలాగే...."

రావ్ హెడ్‌కి సైగ చేశాడు. హెడ్ కొన్ని తెల్లకాగితాలు, ఒక స్టాంప్‌పాడ్ తీసుకుని బయల్దేరాడు.

వాళ్ళు వెళ్ళిపోతూంటే సెల్‌లోంచి రాజు అరిచాడు!

"పోలీస్ సార్! మరి నా సంగతి?"

రావ్ దగ్గరికెళ్ళి చెప్పాడు, "నీతో ప్రైవేట్ బిజినెస్ వుంది. ఇలాగే వుండు."

"ఏమిటది? నన్నింకేం చేస్తారు? నా వేలిముద్రలిచ్చాను. అవి కలవలేదన్నారు. ఇంకేం చేస్తారు?"

"అఫీషియల్‌గా యేమీ చేయను. నా అతిథిగా వుండు."

"ఎందుకు?"

"ఉషని యేడ్పించినందుకు నిన్ను వరండాలో వేలాడదీయాలి."

"అరగంట తరువాత గోవిందరావ్ తిరిగివచ్చాడు.

"సార్, అందరూ వేలిముద్ర లిచ్చారు!" అన్నాడతను.

"ఎవరూ జంకలేదుగా?"

"పెద్దమ్మాయి—ఉమ—భయపడింది."

"అలాగా....గోవిందరావ్, అసూయా ద్వేషాలు నీకు తెలుసునా?"

"వాటితో అఘాయిత్యాలకి పాల్పడతారు కదూ, సార్?"

"నీ బుర్ర తోమివుందా?"

"వుంది సార్!"

"నీకేం తోచిందో వినిపించు...."

హెడ్ గొంతు సవరించుకున్నాడు. తనకింది ముగ్గుర్ని ఎలుకల్ని చూసినట్టు చూశాడు.

"సార్, అసలేం జరిగిందంటే....ఆమె జారిపడలేదు. అంతా జారిపడిందనే నమ్ముతున్నారు. కానీ ఆధారాలు చూస్తే—మిషను పట్టికొడితే గడ్డ వూడిరావాలని లేదు. అది కష్టమయిన పని. ఎందుకంటే అప్పుడు టాప్‌వీల్ నుంచి బెల్టు తొలగాలి. తరువాత ఫేస్ ప్లేట్ నుంచి టేబుల్ నట్స్ తొలగాలి. అప్పుడే గడ్డ రిలీజ్ అవుతుంది, సార్!"

"సరిగ్గా చెప్పావు."

"ఇక విధి వశాత్తున యీ రెండూ జరిగి గడ్డ వూడిందనుకుందాం, అప్పుడది యెక్కడ పడుతుంది? టేబుల్‌కిందే పడుతుంది. పదిహేను కిలోల బరువున్న గడ్డ, ఇరవై యేడంగుళాల యెత్తున్న టేబుల్‌మీంచి, అయిదున్నర అడుగుల పొడవున్న ఆమె తల దగ్గర వెళ్ళి పడడమన్నది అసంభవంలో కెల్ల అసంభవం, సార్."

"నమ్ముతాను."

"మిషన్ బాడీ పొజిషన్, శవం కాళ్ళవైపు టేబుల్ యెడమభాగం, అంటే కింద స్టాండుని దాటి బ్యాలెన్స్ అవుటయ్యే భాగం, లేక గుడ్డ జరిపే భాగం వచ్చి వుంది

సార్! అదెలా సంభవం? ఆమె ఆ చివరకి వెళ్ళి మిషను లేచిపోయి పడిపోతే, కాళ్ళ దగ్గర మిషను స్టాండ్ వీల్ భాగం వుండేది."

"అవును గోవిందరావ్."

"కాబట్టి ఆమె మిషను దొర్లడంవల్ల పడిపోలేదని అనుకోవచ్చు కదా సార్?"

"అనుకోవచ్చు. ఆమె బూజు దులుపుతున్నప్పుడు టేబుల్‌మీద దుమ్ము పడింది. ఆ దుమ్ములో ఆమె పాద ముద్రలు బ్యాలెన్స్ అవుటయ్యేవైపు లేవు గోవిందరావ్. మధ్యలోనే వున్నాయి. ఆమె జాగ్రత్తలోనే వుందప్పుడు. ప్రొసీడ్!"

"జాగ్రత్తలో వున్నప్పుడు జారిపడే అవకాశం లేదు" అన్నాడు గోవిందరావ్.

"ఒకవేళ ఎవర్నో చూసి బెదిరి పడిపోతే, మిషను దొర్లే అవకాశం లేదు. ఆ సమయంలో రాజు అక్కడ లేడని తెలిసింది గనుక—ఆమె మరే ఆగంతకుడ్ని చూడ లేదు. ఇంటి మనుషుల్ని కూడా చూడలేదు. తల పైకెత్తి తన పనిలో వుంది. అప్పుడు—యెక్కడ్నించి వచ్చా రెవరో. వచ్చి—సార్—ఆమె చూడకుండా...."

"ఆమె చూడకుండా?"

"కాళ్ళు పట్టి లాగేశారు. అప్పుడు ఆమె—కింద పడింది. పడుతూండగానే ఆ వచ్చిన మనిషి క్షణాల్లో గడ్డని తొలగించి, దాంతో ఆమె తలమీద కొట్టి—కొట్టి—ఒక సారి అడ్డంగా, ఒకసారి తల కిందులుగా, ఒకసారి నిట్ట నిలువుగా ఆగకుండా కొట్టడంవల్ల ఆమె ప్రాణం పోయింది. త్రెడ్ పిన్నూ, టేకప్ లీవర్ ఆమె తలలోకి అప్పుడే గుచ్చుకున్నాయి, సార్.

అప్పు డా మనిషి మిషను బాడీని ఆమె కాళ్ళదగ్గర తిర గేసి మాయమవడం జరిగింది సార్. అప్పుడు టేబుల్ ఎడమవైపు అంచులు పట్టి లేపడంవల్ల అక్కడ ఆ రెండు బొడిన వేలిముద్రలు ఏర్పడ్డాయి."

"వెరీగుడ్! అయితే ఆ మనిషి ఎవరంటావు?"

"వేలిముద్రలు పరిశీలిద్దాం సార్!"

"ఇద్దరూ కూర్చున్నారు. హెడ్ ఇచ్చిన స్పెసిమన్స్‌ని రావ్ ఫోటోగ్రాఫ్‌తో పోల్చసాగాడు. "మిషన్‌మీద వేలి ముద్రలు రేడియల్ లూప్స్ తరగతికి చెందినవి గోవింద రావ్! అలాటివి ఇందులో వున్నాయా?...."

భూతద్దంతో చూస్తూ తిరిగి అన్నాడు. "ఇవి వెంక ట్రావువి....ప్లెయిన్ ఆర్చెస్, నో! ఈ కాంపోజిట్ సెంట్రల్ పాకెట్ వైపు యెవరివి....ఓహ్, ఇదిగో, మనకి కావలసిన రేడియల్ లూప్స్ ఈ ఇద్దరికి వున్నాయి.... వీటిని పరిశీలిద్దాం!"

రావ్ శ్రద్ధగా చూడసాగాడు.

హెడ్ అన్నాడు, "సార్, ఈ రాజు రమేష్ తోడు దొంగల్లా వున్నారు. ఒకరి కొకరు ఎలిబీ యిచ్చుకుంటున్నా రేమో...."

"తెలుస్తుంది...." రావ్ వులిక్కిపడ్డాడు. "ఇవెవరివి? ఓహ్, గోవిందరావ్!"

"ఏమిటి సార్?"

"పద, అక్కడికి పోదాం! కేసు తేలిపోయింది!"

రావ్ లేచి బయటికురికి మోటార్‌సైకిల్ స్టార్టు చేశాడు వేగంగా.

వెనుక హెడ్ పరుగెత్తుకెళ్ళాడు.

వేంకట్రావు గాభరాగా చూశాడు ఇన్‌స్పెక్టర్ని.

"మీ అమ్మాయేది ఉమ?" రావ్ గద్దించాడు.

ఆమె పరుగెత్తుకొచ్చింది లోపల్నుంచి.

రావ్ ఆమెని కోపంగా చూశాడు, "నువ్వు నిజం చెప్పు!"

ఆమె బెదిరిపోయింది, "నేనేం అబద్ధం చెప్పాను?"

"నువ్వు స్నానానికి వెళ్ళడం మీ అమ్మ చూసిందా?"

ఆమె తడబడింది.

"చెప్పు!"

"లేదు, చూడలేదు!"

"అప్పుడామె ఎక్కడుంది?"

"పైన డాబా మీద-బట్టలారేయడానికి వెళ్ళింది. అప్పుడే నేను స్నానానికి...."

"ఉషని బూజు దులపమని నువ్వెందుకు చెప్పావ్?"

"నేను వెళ్ళమన లేదు. నేనే దులుపుతానన్నాను. ఆమే స్నానానికి వెళ్ళమని నన్ను బలవంతం చేసి వెళ్ళింది."

"మీరీ మాటలు ఎక్కడ అనుకున్నారు!"

"వెనక వరండాలో."

"అప్పుడు మీ అమ్మ ఎక్కడుంది?"

"బావి దగ్గరే బట్టలు పిండుతోంది."

"బాగా ఆలోచించి చెప్పు-ముందు నువ్వు దులుపుతానన్నావు. తర్వాత నీ చెల్లెలు తను దులుపుతానని నిన్ను స్నానానికి వెళ్ళమంది. ఈ రెండు మాటలు మీ అమ్మ విన్నదా?"

ఆమె ఆలోచించింది. "లేదు. విని వుండదు. నా మాటలే విని వుంటుంది. అప్పుడామె డాబా మీదికి వెళ్ళి

పోతోంది."

"రైట్, నువ్వు స్నానానికి వెళ్ళినప్పుడు ఏ దుస్తుల్లో వున్నావ్?"

"అప్పుడు మేమిద్దరం ఒకే రకం దుస్తుల్లో వున్నాం."

"ఆకుపచ్చ జాకెట్. పసుపురంగు లంగా, పరికిణీ.... అవునా?"

"అవును,"

"నువ్వెంత అదృష్టవంతురాలివి...."

ఆమె తికమకగా చూసింది. ఇన్స్పెక్టర్ వుద్రేక పడుతున్న హెడ్ని చూపి, వెంకట్రావ్ వైపు తిరిగాడు.

"చాలా విషాదం మేష్టారూ చాలా విషాదం."

"ఏం జరిగింది ఇన్స్పెక్టరుగారూ?"

"మీ పెద్దమ్మాయి పెళ్ళి విషయంలో మీ ఆవిడ మీతో సామరస్యంగా వుందా?"

వెంకట్రావ్ సంకోచించాడు.

"చెప్పండి."

"లేదు. పూర్తిగా వ్యతిరేకం. అంత కట్నం ఇవ్వడం ఆమె కిష్టం లేదు. తన కూతురికి ఎక్కడ్నించి తెస్తారని మాట్లాడేది."

"అవును. సవతి తల్లి. పరసంతానం అదృష్టాన్ని సహించదు. ఓ. కే. ఆమె ఇప్పు డెక్కడుంది?"

"తన గదిలోనే....నిన్నట్నించి ఏడ్పు మానడంలేదు."

"కన్నకూతుర్ని పోగొట్టుకున్నాక....మేష్టారూ, నిన్న మీ ఆవిడ రాజుగాడి విషయంలో అబద్ధం చెప్పింది కదూ?"

"అవును....ఆ దుఃఖభారంలో ఏం చేస్తుందో ఆమెకే తెలియదు."

"దుఃఖభారం కాదు. పాపం చేసిన మనసు గమ్మున

వూరుకోదు మేష్టారూ, వాళ్ళనీ వీళ్ళనీ ఇరికించాలని చూస్తుంది."

"అంటే!"

"నిన్న జరిగిందానికి మీ ఆవిడే కర్త అంటున్నాను."

"ఇన్‌స్పెక్టర్!"

"వినండి మేష్టారూ! ఇందులో అర్థం చేసుకోవడానికి పెద్ద చిక్కులేమీ లేవు. నిన్న మీ ఆవిడ బట్టలు పిండుతున్నప్పుడు అక్కా చెల్లెళ్ళిద్దరి మాటలు వింది. ఉమ తను బూజు దులుపుతానని అంటూండగా విని ఆమె డాబామీదికి వెళ్ళిపోయింది. కానీ తర్వాత ఆ పని ఉష తీసుకుని అక్కని స్నానానికి పంపింది. ఈ విషయం మీ ఆవిడకు తెలియదు. ఆమె కిందికి వచ్చి స్నానాల గదిలో చప్పుడవుతోంటే ఉష అనుకుంది. ఆమె మనసు వేగంగా ఆలోచించింది. ఇంట్లో ఉమ వంటరిగా వుంది....ఏదయినా చెయ్యవచ్చు అనుకుని వెళ్ళింది. మోటివ్ మీకు తెలుసు. అలా నిశ్శబ్దంగా ముందు గదిలోకి వెళ్ళినప్పుడు-మిషను మీద బూజు దులుపుతూ ఉష వుంది.

"పొరపాటు ఎక్కడ జరిగిందంటే, అప్పుడు అక్కచెల్లెళ్ళిద్దరు ఒకే రకం బట్టల్లో వున్నారు. మిషనుమీద వున్నది ఉమయే అనుకుంది. అప్పుడామె తల పైకెత్తి గోడవైపు తిరిగి వుంది. ఆమె ముఖం చూడాలని మీ ఆవిడకు అన్పించి వుండదు. పని వెంటనే జరిగిపోవాలి. అప్పుడామె వేగంగా కదిలి వెళ్ళి వెనక నుంచి ఉష రెండు కాళ్ళూ పట్టి లాగేసింది ...ఇంకో దురదృష్ట మేమంటే అప్పుడూ ఆమెకు ఉష ముఖం కన్పించలేదు. బోర్లా పడింది!

"ఆ వెంటనే మీ ఆవిడ మిషను కడ్డీ వూడబీకి మీ

అమ్మాయి తలమీద బాది - స్టాండుని దొర్లించి పరుగెత్తి పోయింది.''

వెంకట్రావు నిశ్చేష్టుడయ్యాడు.

ఉమ తక్కున కూలబడి, ముఖం చేతుల్తో కప్పుకుంది.

"ఎలా అంటున్నారు?" వెంకట్రావు అస్పష్టంగా గొణిగాడు.

"ఆధారా లున్నాయి - మిషను మీద అన్నీ మీ ఆవిడ వేలి ముద్రలే!" రావ్ సానుభూతిగా చూశాడు "ఆమెని అడుగుతాను, ఏ గదిలో వుంది?"

వెంకట్రావు చూపించాడు రావ్ హెడ్‌కి సైగచేసి కదిలాడు. మూసి వున్న ఆ గది తలుపు మీద చప్పుడు చేసి తెరిచాడు. అతని ముఖం వివర్ణమైంది.

"అరె....మనం ఆలస్యం చేశాం" అన్నాడతను, గదిలో మెదకి చీరతో వేలాడుతున్న మీనాక్షి ఆకారాన్ని చూస్తూ ☐

దంత వైద్యుడు?

తన పళ్ళకు పాచి బాగా ఉందని దంతవైద్యుని కన్సల్ట్ చేయడానికి స్నేహితుడితో వెళ్ళాడు రమేష్.

"ఏం ఇప్పుడే వెళ్ళావుగా, వెంటనే వచ్చేశావ్?" అడిగాడు స్నేహితుడు దంతవైద్యుని కన్సల్టింగ్ రూమ్‌లో కెళ్ళి వచ్చిన రమేష్‌ని.

"లోనికి వెళ్ళగానే ఆయన పలకరింపుగా నవ్వేడు. అంతే, ఇక ఉండలేకపోయాను" చెప్పాడు రమేష్.

—ఆర్. వెంకటేశ్వర్, బెల్లంపల్లి.

డిస్మిస్ ఆర్డర్

జె. రామలక్ష్మి

దమ్మన్న వుద్యోగం వూడింది.

అతడిది మామూలు వుద్యోగం కాదు. సెంట్రల్ గవర్నమెంట్ వుద్యోగం.

అసలా సంవత్సరం అతడిని పెర్మనెంట్ చేయవలసి వుంది. అలాంటిది వుద్యోగం వూడిపోయింది.

"మిమ్మల్ని డిస్మిస్ చేయడ మేమిటండీ—" అని వాపోయింది అతని భార్య సీతాదేవి.

"మీ బాస్‌కూ నీకూ ఏమైనా గొడవలొచ్చాయా?" అనడిగాడు అతడి మామగారు కాంతారావు.

"ఆయన దేవుడిలాంటివాడు. ఆయన నన్ను డిస్మిస్ చేయాలనుకుంటే అది న్యాయమే అవుతుంది." అన్నాడు దమ్మన్న.

"అంటే నువ్వు తప్పు చేశావా?" అన్నాడు కాంతారావు.

"లేదు. ఎవరో నామీద కుట్ర పన్నారు. లేనిపోనివి సృష్టించి బాస్‌ను నమ్మించారు. నమ్మడం ఆయన తప్పు కాదు...." అన్నాడు దమ్మన్న.

"తప్పు ఆయనదయినా కాకపోయినా నష్టపోయింది నువ్వేకదా—" అన్నాడు కాంతారావు చిరాగ్గా.

"అవును....అన్నాడు దమ్మన్న సాలోచనగా.

"వెధవ్వుద్యోగం పోతే పోయింది. నాతో వచ్చేసేయ్. వ్యాపారంలో నాకు కాస్త అండగా వుండు. నీకు బుద్ధి పుట్టడం లేదని దేవుడు ఈ విధంగా చేశాడేమో—అంతా మన మంచికే అంటారు...." అన్నాడు కాంతారావు.

"కాలుమీద కాలేసుకుని కూర్చుని సంపాదించడానికి అలవాటుపడ్డవాణ్ని. నేను వ్యాపారానికి పనికిరాను" అన్నాడు దమ్మన్న.

"అయితే ఏం చేస్తావ్?"

"బాగా చదువుకుని ఇంతకంటే మంచి వుద్యోగం సంపాదిస్తాను."

"ఇప్పుడు చదువు మొదలెడతావా?"

"నాది మొండిపట్టుదల....ఏ ఆఫీసునుంచయితే నన్ను

తొలగించారో అక్కడే ఇంకో పెద్ద వుద్యోగం సంపాదించాలి."

"బాగుంది. నిన్ను డిస్మిస్ చేసినవాళ్ళు మళ్ళీ నీకు వుద్యోగ మిస్తారా?"

"నన్నాలోచించుకోనివ్వండి" అన్నాడు దమ్మన్న దిగులుగా.

2

"ఇది నిజమా?" అన్నాడు భీమయ్య.

"ఏమిటి?"

"నిన్ను డిస్మిస్ చేశారటగా!"

"అవును!"

"ఎవరు చేశారు?"

"ఇంకెవరు చేస్తారు....నా బాస్!"

"వాడ్ని కాళ్ళూ చేతులు విరిచెయ్యమంటావా?"

"ఎందుకు?"

"అరేభాయీ - ఈ ఊళ్ళో హేమాహేమీలకే నేనంటే అదురు. ఎవడో అల్లాటప్పా బాస్‌గాడు నిన్నుద్యోగం లోంచి పీకేస్తే గాజులు తొడిగించుకుని కూర్చోమంటావా? వెళ్ళి వాణ్ని పులుసులోకి ఎముక లేకుండా చావదన్ని వస్తాను."

"అందువల్ల ఏమిటి ప్రయోజనం?" అన్నాడు దమ్మన్న తాపీగా.

"ప్రయోజనం గురించి ఆలోచించను నేను. నీకు అపకారం చేసినవాణ్ని శిక్షించకుండా వూరుకోలేను."

"ప్లీజ్-భీమయ్యా నా బాస్ నేమీ అనొద్దు. ఆయన దేవుడిలాంటి మనిషి."

భీమయ్య ఆశ్చర్యంగా అతడి వంక చూసి "నిన్ను

డిస్మిస్ చేసినవాడు దేవుడా? అసలు నువ్వేం మాట్లాడు తున్నావో నీకు తెలుస్తోందా? డిస్మిస్ కావడంవల్ల నీకు మతి పోయినట్లుంది" అన్నాడు భీమయ్య కోపంగా.

"నువ్వు దేవుణ్ణి నమ్ముతావా?" అన్నాడు దమ్మన్న శాంతంగా.

"ఆఁ మొన్నే తిరపతి కూడా వెళ్ళి వచ్చాను. అయినా నాలాంటి గూండావెధవల్ని ఆ దేవుడు కాకపోతే ఇంకె వ్వరు కాపాడగలరు?" అన్నాడు భీమయ్య.

"మరి నిన్న నీ కొడుకు చెట్టుమీద నుంచి పడి చెయ్యి విరగగొట్టుకుని మంచం మీదున్నాడు. అందుకు దేవుణ్ణి తప్పుపట్టవా?"

"ఎవడి కర్మకు ఎవడు కర్త? ఆ అల్లరి వెధవచెట్టెక్కి క్రిందపడితే అందుకు దేవుడేం చేస్తాడు?" అన్నాడు భీమయ్య.

"అందుకే నేనూ బాస్‌మీద కోపం తెచ్చుకోలేకపోతు న్నాను" అన్నాడు దమ్మన్న శాంతంగా.

"ఏంటి కథ....చెయ్యకూడని తప్పేదయినా చేశావా?"

"నేనే తప్పూ చెయ్యలేదు. కానీ ఎవరో వెధవలు నా మీద తప్పుడు అభియోగం సృష్టించారు. బాస్ నన్నేమీ చేయకపోతే సహేంద్ర తక్షకాయస్వాహా అన్నట్లు మా ఇద్దరి వుద్యోగాలూ వుమ్మడిగా పోతాయి. ఆయన డ్యూటీ ఆయన చేశాడు. ఇప్పటికీ ఆయనకు నేనంటే అభి మానమే."

"ఏడిసినట్లుంది అభిమానం.... ఇప్పుడు నువ్వేం చేస్తావ్?"

"నా తప్పు ఏమీ లేదని ఋజువు చేసుకుంటాను."

"ఎలా?"

"అదే తెలియడం లేదు."

"ఏ వెధవల మీదయినా నీకు అనుమాన ముంటే చెప్పు. ఓ చూపు చూసేసి వస్తాను" అన్నాడు భీమయ్య.

"దయుంచి ఈ వ్యవహారంలో నువ్వు జోక్యం కలుగజేసుకోకు. అందువల్ల నా తప్పు మరింత బలపడు తుంది" అన్నాడు దమ్మన్న.

"అయినవాళ్ళంతా వుండి చేతులు ముడుచుకుని మీసాలు దింపుకుని కూర్చోవలసిందేనా? ఏమీ చేయ లేమా?" అన్నాడు భీమయ్య.

"ఒకోసారి నీలాంటివాళ్ళు చేతులు ముడుచుకుని, కూర్చోవడమే ఓ పెద్ద సహాయంగా వుంటుంది ..." అన్నాడు దమ్మన్న ఏదో ఆలోచిస్తూ.

3

"ఏమండీ...." అంది సీతాదేవి దిగులుగా.

"ఏం సీతా?"

"ఇప్పుడింక ఎలాగండి?" అందామె.

"మనకేమైనా లోటా, పాటా? పొలం మీంచి వచ్చే దాంతోనే మనకు రోజులు గడిచిపోతాయి" అన్నాడు దమ్మన్న'

"అది కాదండి_చుట్టుపక్కల వాళ్ళంతా మనల్ని చిన్న చూపు చూస్తున్నారు. నలుగురిలోను మనకు అవమానంగా వుంది" అంది సీతాదేవి.

"ఊరు మార్చేద్దాం" అన్నాడు దమ్మన్న.

"అసలిలా ఎందుకు జరిగిందండి?"

"మన రోజులు బాగుండక."

"మీ బాస్ మన ఉసురు పోసుకుంటాడు లెండి."

"పాపం_ఆయన్నేమీ అనవద్దు."

"బాగుందండి_ఆయనేమో మిమ్మల్ని డిస్మిస్ చేసి కూర్చున్నాడు. మీరేమో ఆయన్ని దేవుడని అందరి దగ్గర పొగుడుతున్నారు" అంది సీతాదేవి.

"ఎవరి కర్మకు ఎవరు కర్తలు సీతా?" అన్నాడు దమ్మన్న,

"ఇందాక పక్కింటి రాధారాణి వచ్చి వెళ్ళిందండి."

"ఊఁ"

"మీ ఆయనలో ఏదో తప్పు లేకపోతే అలా ఎందుకూరుకుంటారు? కోర్టుకెళ్ళొచ్చుగా...." అంది.

"కోర్టు కెళ్ళేవాడినే....కానీ అందువల్ల బాస్‌కిబ్బంది కలుగుతుందేమోనని భయపడుతున్నాను...." అన్నాడు దమ్మన్న.

"మిమ్మల్ని డిస్మిస్ చేసేటప్పు డాయన మీ యిబ్బంది గురించు ఆలోచించాడా?" అంది సీతాదేవి కోపంగా.

"ఆయన నన్ను కావాలని డిస్మిస్ చేయలేదు. నా స్థానంలో ఆయన ఆయన స్థానంలో నేను వుండి వుంటే అదే జరిగుండేది. అంటే నేనాయన్ని డిస్మిస్ చేసి వుండేవాణ్ని!" అన్నాడు దమ్మన్న.

"ఏమిటో మీ మాటలు నాకు అర్థం కావటం లేదు" అంది సీతాదేవి.

"అలాగని ఊరుకోకు. అర్థం చేసుకుందుకు ప్రయత్నించు" అన్నాడు దమ్మన్న.

"సీతారామారావుగారు మీరే కదండీ?" అన్నాడు కాంతా రావు.

"ఆఁ నేనే!"

"నా పేరు కాంతారావు."

"మీ రెవరో కూడా చెబితే....?"

"మీరు డిస్మిస్ చేసిన దమ్మన్న నా అల్లుడు."

"అలాగా-చాలా సంతోషం."

కాంతారావుకు ఏమనాలో తోచలేదు. "దేనికండి సంతోషం!"

"మిమ్మల్ని కలుసుకున్నందుకు."

"మిమ్మల్ని కలుసుకున్నందుకు నేనూ సంతోషిస్తా నంటారా?"

"ఏమో అది మీరు చెప్పాలి!"

"మా అల్లుడు ఏం తప్పు చేశాడని అతడి వుద్యోగం తీసేశారు?"

"ఆ విషయం అతణ్ణి డిస్మిస్ చేసిన ఆర్డరు కాగితంలో తెలియబర్చడం జరిగింది."

"మా అల్లుడికి మీరంటే ఎంతో అభిమానం."

"నాకూ అతడంటే అభిమానమే!"

"తన్ను డిస్మిస్ చేసినా మీరు దేవుడేనని అంటున్నాడు"

"వృద్ధిలోకి వస్తాడు."

"ఎలా వస్తాడండీ-మీరే అతడ్ని కరుణించాలి."

"మాలాంటి ఆఫీసర్లకు శపించే శక్తి మాత్రమే వుంది. అనుగ్రహించే శక్తి లేదు" అన్నాడు సీతారామరావు

తాపీగా.

"అనుగ్రహించే శక్తి కోర్టు కుంది" అన్నాడు కాంతా రావు.

"అయితే యిక్కడి కెందు కొచ్చారు?"

"మా అల్లుడు కోర్టు కెక్కడానికి ఒప్పుకోనడం లేదు."

"తెలివయినవాడు."

"అతడిది తెలివి కాదు. తెలివితక్కువతనం."

"ఏం?"

"కోర్టు కెక్కితే తను గెలిస్తే మీకు చెడ్డ పేరు వస్తుందని భయపడుతున్నాడు. తన కన్యాయం చేసిన మీకు అపకారం జరక్కూడదని కోరుకుంటున్నాడు."

"సుమతిశతకం బాగా వంటపట్టించుకుని వుంటాడు."

కాంతారావుకు రక్తం మరిగింది. అయినా శాంతం వహించి "మీకు డబ్బు కావలిస్తే చెప్పండి. ఎంతయినా నేనివ్వగలను" అన్నాడు.

"నేను డబ్బు యింట్లో తీసుకోను" అన్నాడు సీతారామారావు.

"పోనీ ఆఫీసుకు రమ్మంటారా."

"అక్కడా తీసుకోను."

"మరెక్కడ తీసుకుంటారు?"

"నేను తీసుకునేచోట మీరివ్వగలరు."

"నా శక్తి గురించి మీకెందుకు? ఎక్కడివ్వాలో చెప్పండి. తీసుకొచ్చి యిస్తాను" అన్నాడు కాంతారావు.

"కోర్టులో—యివ్వగలిగితే చెప్పండి...." అన్నాడు సీతారామారావు.

కాంతారావు దిగులు, అవమానం, కోపంతో అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

5

"నమస్కారం-లాయరు ధర్మారావుగారూ-ఈ కాలంలో మీలాంటి వాళ్ళుండబట్టే ధర్మం ఒక పాదం మీదయినా నిలబడి వుంది" అన్నాడు కాంతారావు.

"అబద్ధ మెందుకండి-మీ మాట లబద్ధ మని నాకు తెలుసు. నా కిలాంటి పొగడ్తలు నచ్చవు. మాది వ్యాపారం. మీరు వచ్చిన పని చెప్పండి...." అన్నాడు ధర్మారావు.

కాంతారావు తన సమస్య పూర్తిగా వివరించి "మా అల్లుడి వుద్యోగం అన్యాయంగా పోయినట్లు ఋజువు చేయాలి మీరు" అన్నాడు.

"అయితే ముందుగా నేను మీ అల్లుడితో మాట్లాడాలి" అన్నాడు ధర్మారావు ఆలోచిస్తూ.

"అతడితో పెద్ద చిక్కు వచ్చిందండి? సీతారామారావు గారు చేసిందాంట్లో తప్పేమీ లేదంటున్నాడు. ఆయన వీడికి ఏం మందు పెట్టారో ఏమో నాకు అర్థం కావడం లేదు. తన్ను డిస్మిస్ చేసినాసరే ఆయన దేవుడిని అంటున్నాడు."

"అయితే ఇందులో నేను చేయగలిగిందేమీ లేదు."

"చెయ్యాలి సార్...." అన్నాడు కాంతారావు దీనంగా.

"ఏం చేయమంటారో చెప్పండి."

"సీతారామారావుగారి దేమీ తప్పు లేదంటూనే తనూ ఏ తప్పూ చేయలేదని అంటున్నా డతడు. రెండింట్లో ఒకటి తప్పు కావాలి కదా-మీరు మీ లాయరు బుర్ర వుపయోగించి ఎలాగో అలా అతడిచేత కోర్టులో మనకు పనికివచ్చే

సాక్ష్యాలు పలికించాలి."

"అప్పుడే ధర్మం ఒంటిపాదం మీదయినా నిలబడుతుం దంటారా?"

"అమ్మమ్మ.... మీరు నా మీద జోకు లెయ్యొద్దు. మీ తెలివి ముందు నేను ఏపాటివాణ్ణి. ముందు మీరు నాతో పాటు ఒక్కసారి మా యింటికి బయల్దేరి రావాలి...." అన్నాడు కాంతారావు.

ధర్మారావు కాంతారావు కోరిక మన్నించాడు.

ఇద్దరూ కలిసి ఇల్లు చేరుకున్నాక కాంతారావు ధర్మారావును దమ్మన్నకు పరిచయం చేశాడు.

"దమ్మన్న-ఈ రోజుల్లో ఇదేం పేరయ్యా!" అన్నాడు ధర్మారావు.

"నేను డిస్మిస్సవడానికి ఈ పేరే కారణ మంటారా?" అన్నాడు దమ్మన్న దిగులుగా.

"పేరెందుకు కారణమవుతుంది? నీ బాస్ సీతారామా రావు అయుంటాడు."

"అయ్యో-ఆయన దేవుడండి" అన్నాడు దమ్మన్న.

"ఈ మాటే ఇంకెవరో కూడా అన్నారు....ఆఁ గుర్తొచ్చింది. అతడి పేరు శ్రీకాంత్" అన్నాడు ధర్మారావు.

"శ్రీకాంత్ ఎవరండి?" అన్నాడు దమ్మన్న.

"నీ వుద్యోగం పోయిందిగా-నీ స్థానంలో అతడిని తాత్కాలికంగా వేశారు సీతారామారావుగారు."

"ఆ శ్రీకాంతా....అతడిని సీతారామారావుగారు వేయ లేదు. నేనే అతడిని సిఫారసుచేశాను" అన్నాడు దమ్మన్న.

ధర్మారావు గుడ్లు తేలవేసి "నువ్వు సిఫారసు చేశావా- ఇదంతా ఏదో కుమ్మక్కు వ్యవహారంలా వుందే....,అస

లేమిటిదంతా?" అన్నాడు.

"నా వుద్యోగం ఎలాగూ పోయింది. నాకు తెలిసిన వాడి కది ఇస్తే మెరుగనిపించింది" అన్నాడు దమ్మన్న మామూలుగా.

"నిన్ను చూస్తుంటే ఆ శ్రీకాంత్ కోసం కావాలని వుద్యోగం నుంచి డిస్మిస్ చేయించుకున్నావా అనిపిస్తుంది" అన్నాడు ధర్మారావు.

"ఎవరయినా వుద్యోగంలో పైకి పోవాలనుకుంటారు గాని డిస్మిస్ అవ్వాలనుకుంటారాండి?"అన్నాడు దమ్మన్న.

"కరెక్టుగా చెప్పావు. శ్రీకాంత్ సీతారామారావుకి కావలసినవాడు. అదెలాగో ఋజువు చేయాల్సిన బాధ్యత నాది. శ్రీకాంత్ కుద్యోగ మిప్పించడం కోసం నిన్నాయన అబద్ధపు టభియోగంతో డిస్మిస్ చేయించాడు" అన్నాడు ధర్మారావు.

"సార్-ఇది అన్యాయం. కోర్టుకెక్కి నా వుద్యోగం నేను మళ్ళీ సంపాదించుకోడానికి సిద్ధమే! కానీ ఈ ప్రయత్నంలో సీతారామారావుగారిమీద ఈగ వాలినా నేను సహించను. ఆయనకు వ్యతిరేకంగా ఏం చెప్పాల్సివచ్చినా ముందుగా మీకు నేనే ఎదురు తిరగుతాను" అన్నాడు దమ్మన్న.

"అయితే యింక కేసెందుకు!"

"బాగుంది సార్-సాక్ష్యాలన్నీ సరిపోయి ఓ నిర్దోషిని హంతకుడిగా నిరూపిస్తాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్. డిఫెన్స్ లాయర్ సాక్ష్యాధారాలను దెబ్బ తీయడానికి చూస్తాడు తప్పితే ఇన్‌స్పెక్టర్ని నేరస్థుడ్ని చెయ్యాలనుకోడు. నా మీద వచ్చిన అభియోగం గురించి పరిశోధించండి. సీతా

రామారావుగారి జోలికి వెళ్ళకండి" అన్నాడు దమ్మన్న.

"ఇలా అయితే కేసు సంవత్సరాల తరబడి నడుస్తుంది" అన్నాడు ధర్మారావు.

"నడిస్తే నడవ నివ్వండి. నాకు న్యాయం జరగడంలో సీతారామారావుగారికి అన్యాయం జరగడం నేను బొత్తిగా సహించలేనిది" అన్నాడు ధమ్మన్న.

6

ఆ కేసు కోర్టులో మూడు సంవత్సరాలపాటు నత్త నడక నడిచింది.

చివరికి దమ్మన్న నెగ్గాడు. సీతారామారావుకు చెడ్డ పేరు రాలేదు. ఎదయినా రాబోయినా దమ్మన్న కోర్టులో గూడా ఆయన్ను పొగుడుతూనే వుండేవాడు.

"అదేంటయ్యా-ఆయన్ను పొగుడుతావు!" అని ఎవ రయినా అంటే "బాగుందండి-రేపు నా వుద్యోగం వస్తే మళ్ళీ ఆయన దగ్గరే కదా పని చేయాలి...." అనేవాడు.

దమ్మన్నకు గడచిన మూడు సంవత్సరాల జీతమూ ఇయ్యవలసిందిగా కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అతడకి రావలసిన ఇంక్రిమెంట్సూ, ప్రమోషన్సూ ఏవీ ఆగిపోవడానికి వీలులేదని కూడా కోర్టు తీర్మానించింది.

దమ్మన్న వుద్యోగంలో చేరిన నెలరోజులకే పై వుద్యోగానికి ప్రమోట్ అయ్యాడు. ఆ సందర్భంగా అతడొక పార్టీ కూడా ఇచ్చాడు.

పార్టీ అయిపోయినాక భార్యతో—"ఒకప్పుడు అంతా అవమానిస్తారని బాధపడ్డావు. ఇప్పుడేమంటావు?" అన్నాడు.

"అంతా మా నాన్న చలవ...." అంది సీతాదేవి.

"చలవ మీ నాన్నదీ కాదు. ఆ ధర్మారావుదీ కాదు. అంతా ఆ సీతారామారావుగారిది" అన్నాడు దమ్మన్న.

"ఇంకా మీరాయన్నే పొగుడుతున్నారు" అంది సీతాదేవి.

దమ్మన్న ఏదో అనబోయి ఆగిపోయాడు.

డిపార్టుమెంట్లో కొత్త రూలు వచ్చింది. పై ఉద్యోగాలకి ఎమ్మెస్సీ క్వాలిఫికేష నుండాలి. ప్రస్తుతం ఉద్యోగాల్లో వున్న బియస్సీ వాళ్ళకు అయిదు సంవత్సరాల వరకూ స్టడీ లీవ్ ఇవ్వబడదు.

ఈ కొత్తరూలు వల్ల దమ్మన్నకు చాలా నష్టం! అతడు అర్జంటుగా ఎమ్మెస్సీ చదవాల్సి వుంది. కానీ స్టడీ లీవ్ దొరకదు.

ఎలాగో తప్పుడు అభియోగాలు సృష్టించాడు. బాస్ అభిమానంతో అతణ్ణి డిస్మిస్ చేశాడు. దమ్మన్న కోర్టుకెక్కాడు.

కోర్టు కేసు తేలేలోగా దమ్మన్న ఎమ్మెస్సీ చదవడమే కాక ఎంఫిల్ పరీక్ష కూడా ప్యాసయ్యాడు. అతడికి జీతం నష్టంలేదు. ఉద్యోగంలో సర్వీస్ బ్రేకులేదు.

ఈ పథకం తనకు చెప్పి—పారేలా చేసిన బాస్ సీతారామారావును అతడెలా ద్వేషిస్తాడు? ఎవరైనా ద్వేషించమని అన్నప్పటికి ఎలా సహిస్తాడు?

అయితే ఈ రహస్యం అతడు ఎవరికి చెప్పుకోలేదు.... ఆఖరికి కట్టుకున్న భార్యకు కూడా!

ఎందుకంటే తన కారణంగా సీతారామారావుకు చెడ్డ పేరు రాకూడదు మరి! □

సాగరలోయ

సీరియల్

బొమ్మిడి అచ్చారావు

(గత సంచిక తరువాయి)

"ఇంకా రాజేష్ బతికే వున్నాడని నీ పిచ్చి కాబోలు! ఎప్పుడో సముద్రం పాలయిపోయి వుంటాడు. అయినా నీ భ్రమగాని, అతనెక్కడున్నాడని వెతుకుతావు? అసలు నువ్వు బతికి బయటపడతావనే గ్యారంటీ ఏముంది? బతికిన

నాలుగు గడియలు ఆనందాన్ని అనుభవించి ఆనక హాయిగా చచ్చిపోతే సుఖంకదా!" కరుణాకర్ ఆమె చీరని పట్టి లాగేశాడు.

అర్చన చిగురాకులా ఒణికిపోతోంది.

"వదిలెయ్యి. నీకు దణ్ణం పెడతాను, నన్ను పాడు చెయ్యకు. నీ చెల్లెలిలాంటి దాన్ని" నేలమీద ముడుచుకు పోయి దీనంగా వేడుకుంటోంది అర్చన.

"స్టాప్ దట్ నాన్సెన్స్! ముందే చెప్పాను కదా, మనిద్దరం ప్రకృతి—పురుషుడు! ఆనందాన్ని అనుభవించాల్సిన వాళ్ళం. డోంట్ వేస్ట్ టైం" ఆమెని రెండు చేతుల్లోను బంధించాడు. ఆమె జాకెట్టు హూక్స్ టపటప తెంచేశాడు. బ్రాసరీ హూక్ చేత్తో పట్టుకున్నాడు.

అర్చన ఒక్కసారిగా అతని పట్టు వదిలించుకోవటానికి, శరీరాన్ని పూర్తిగా వంచి అతని చేతిని కండవూడి వచ్చేలా కసుక్కున కొరికేసింది.

కరుణాకర్ 'అబ్బా' అంటూ బాధతో చేతిని పట్టుకున్నాడు. అదే అదనుగా అతని పట్టు వదిలించుకుని లేచి నిలబడింది.

కింద పడున్న చీరని అందుకొని, పరుగు అందుకొంది. "ఏయ్, ఆగు - నిన్ను యీరోజు వదిలేది లేదు. నా చేయి కొరికి పారిపోగలననే అనుకొంటున్నావా?" అని అరుస్తున్నాడు కరుణాకర్. అతని చేతినుండి ధారలుగా రక్తం కారిపోతోంది. కండ వూడి వచ్చేసింది.

అర్చన పరుగు పరుగున ముందుకు చొచ్చుకుపోతోంది. నల్లకోతుల భయంగాని, మరేదైనా క్రూరమృగం భయం గాని యిప్పుడామెకు లేదు.

కరుణాకర్ తన పాలిట రాక్షసుడిగా మృత్యువులా కని

పిస్తున్నాడామెకు. అతన్నించి తప్పించుకోవాలి! అతనికి లొంగకూడదు. అవసరమైతే శీలరక్షణ కోసం ప్రాణమైనా తీసుకోవాలి! అంతే! అతనికి మాత్రం చిక్కకూడదు.

ముందు అర్చన, వెనుకగా కరుణాకర్ పరుగు పందెం వేసుకున్నట్టు పరుగెడుతున్నారు.

ఓ క్షణం అలుపు తీర్చుకోవటానికి ఆగి, వెనుతిరిగి చూసింది అర్చన. కరుణాకర్ బాగా వెనకపడి వున్నాడు. హృదయవిదారకంగా అరుస్తున్నాడు.

అర్చన విస్తుపోయి పరికించి చూసింది. ఆ దృశ్యం చూపిన ఆమె వళ్ళంతా గగుర్పాటు చెందింది. వెన్నున జరజర ఏదో పాకినట్టయింది.

కరుణాకర్‌ని నల్లకోతులు చుట్టుముట్టాయి. అతను వాటికి చిక్కిపోయి కదల్లేకుండా నిల్చుని అరుస్తున్నాడు ప్రాణభయంతో.

కరుణాకర్ అరుపులు ఆగిపోయాయి అకస్మాత్తుగా.

అదిరే గుండెలతో అటే చూస్తోంది అర్చన.

నల్లకోతులు కరుణాకర్ కంఠాన్ని కొరికేశాయి. వెచ్చటి చిక్కటి రుధిరం పొంగెన్‌లా విరజిమ్మింది.

భయంతో, అదురుబాటుతో చిగురాకులా వణికిపోతోంది అర్చన.

కోతులు అతని శరీరం నుండి ఒక్కోభాగం పట్టి లాగేశాయి. పంచుకుని ఫలహారంలాగా తినేస్తున్నాయి. కొద్ది నిమిషాల్లోనే కరుణాకర్ శరీరం పూర్తిగా కోతులకి ఆహారంగా మారిపోయింది.

ఎముకలగుట్ట పోగుపడిందక్కడ.

ఈసారి వంతు తనదేమోనన్న ఆలోచన రాగానే అర్చన నవనాడులూ క్రుంగిపోయాయి. పారిపోవాలనుకుంటోందే

గాని కాళ్ళు సహకరించటం లేదు.

తప్పించుకోవాలి, పారిపోవాలి. లేకుంటే యీ కోతులు తననికూడా కరుణాకర్ గతే పట్టిస్తాయి.

ఇవేం కోతులు? నిజానికి కోతుల రూపంలో వున్న నరమాంస భక్షకులు. చాలా భయంకరమైన జంతువులు!

అర్చన అవయవాల్ని కూడదీసుకుంది. మళ్ళీ పరుగు అందుకొంది.

వెనక్కి చూస్తూనే పరుగులు పెడుతోంది.

అదృష్టవశాత్తు కోతులు తనని గమనించలేదు. ఎప్పటి లాగా చెట్లెక్కేశాయి. అయినా అది మరీ ప్రమాదం! చెట్లమీద నుండి తనింకా స్పష్టంగా కనిపిస్తుంది వాటికి.

అర్చనలో ప్రాణభయం నరనరాన జివ్వుమనిపిస్తోంది. అయినా పరుగు ఆపలేదు.

చీర చుట్టుకోవటానిక్కూడా తనకి యింతవరకు సమయం చిక్కలేదు. కరుణాకర్ లాగేసిన చీర తన చేతిలో అలాగే వుంది. అతను తెంపేసిన హుక్స్ తన వక్షస్థలాన్ని నగ్నంగా బహిర్గతం చేస్తోంది. ఒక్క బ్రా, లంగా తప్ప ఒంటిమీద ఆచ్ఛాదన లేదు.

ఎంత దుర్భర పరిస్థితి! భగవాన్, పగవాళ్ళకు కూడా యిలాంటి అవస్థ రాకూడదు! ఆమె మూగగా రోదిస్తోంది!

ఓ నిమిషం ఆగి చీర చుట్టుకుంది.

చుట్టూ పరీక్షగా చూసింది. చెట్లమీదికి చూసింది. ఏవేవో పేరు తెలీని పక్షులు కూచుని వున్నాయి. వింత కోతుల్లాంటి మృగాలేవైనా ఎదురవుతాయేమోనని ఆమెకి అనుక్షణం అదురు బెదురుగానే వుంది.

ఇప్పుడు తనేం చేయాలి? ఎక్కడికి పోవాలి? ఈ దీవికి తుది, మొదలు ఏమీ కనిపించటం లేదు. తను, కరుణాకర్

ఎలా వచ్చి పడ్డారో యీ దీవికొచ్చి పడ్డారు. ఇప్పుడు తను ఒంటరిది! ఎంత దుర్మార్గానికి ఒడికట్టినా కరుణాకర్ ఇంత వరకు తనకు తోడుగా వున్నాడన్న ధైర్యం తన ప్రాణాలను నిలబెట్టింది. కాని, యిప్పుడు? కరుణాకర్ ఘోరంగా కోతులకు బలయిపోయాడు.

11

ఆమెకు విపరీతంగా దాహం వేస్తోంది.

కనుచూపు మేరలో ఎక్కడా నీటి వనరు కనిపించటం లేదు. ఏదైనా చెట్టెక్కి చూస్తే కనిపిస్తుందేమో! తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది. తనకు చెట్లు ఎక్కటం తెలియదు.

అలాగే మరికొన్ని గజాలు నడిచింది. కాళ్ళు నొప్పులు పుడుతున్నాయి. ఎప్పుడో వారం రోజుల కితం తిన్న తిండి! శోష వస్తోంది. నిస్త్రాణగా వుంది. నీళ్ళు తాగకపోతే యీ కాస్త ప్రాణం పోయేలా వుంది.

అర్చన అలాగే మరికొన్ని అడుగులు వేసింది.

ఎదురుగా ఏదో సెలయేరు గలగల పారుతోంది.

ఆమెకు ప్రాణం లేచి వచ్చింది.

లేని ఓపిక తెచ్చుకుని సెలయేరు సమీపించింది. దోసిటితో నీళ్ళు పట్టి కడుపునిండా తాగింది. చల్లటి నీటితో మొహం కాళ్ళు చేతులు కడుక్కొంది.

చాలా హాయిగా వుంది. పోయిన ప్రాణం తిరిగొచ్చినట్టుంది. అక్కడే చెట్ల నీడన కూలబడింది.

నీళ్ళు తాగాక ఆకలిబాధకూడా కొంత మరుగున పడినట్టే వుంది. కాని యిలా ఎన్నాళ్ళు? ఉత్త నీళ్ళుతాగి ప్రాణాలు నిలబెట్టుకోవటం తేలికైన పనికాదు.

ఈ దీవిలో ఎక్కడా జన సంచారమే లేదు. అసలు

యిది మనుష్యులు తిరిగే ప్రాంతమే కాదనుకుంటుంటే, ఆమె గుండె భయంతో పీచుమంటోంది. తను క్రూర మృగాల మధ్య మనుషుల్లేని ఘోరమైన దీవిలో వొంటరిగా వున్నాననుకుంటుంటే, ఆమె నరనరాన పిరికిమందు ప్రవహిస్తున్నట్టు అనుభూతి కలుగుతోంది.

భగవాన్, ఎలాంటి కష్టాన్నయినా ఎదుర్కొనే గుండె ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని నాకు ప్రసాదించు—అని పదే పదే అనుకుంటోంది మనసులో.

అర్చన వాచీ చూసుకుంది. సమయం సాయంత్రం మూడు గంటలు కావస్తోంది. అప్పుడే చీకటి పడిపోయినట్టు తోస్తోంది. దీవి నిండా దట్టమైన చెట్లు! సూర్యరశ్మి సరిగా రావటం లేదు. అందుకే మూడుగంటలకే చీకటి పడిపోయినట్టనిపిస్తోంది.

యధాలాపంగా తల పైకెత్తిన అర్చన కెవ్వున అరవబోయి ఆగింది. చెట్టుమీది నుండి కొండచిలువ వేలాడుతోంది. దాని నోరు పెద్ద కొండగుహలా వుంది. చాలా పొడవున్నట్టు, అది చెట్టుకు చుట్టుకున్న చుట్టల్ని బట్టి తెలుస్తోంది.

ఒక్క క్షణం ఆమె గుండె ఆగి మళ్ళీ కొట్టుకుంది.

కొండచిలువ నోరు తెరిచి ఆమెని అందుకోబోయేంతలో పక్కకి దొర్లి లేచింది. ఒక్క వుదుటున పరుగందుకుంది.

కొండచిలువ తనని అందుకున్నట్టు అనుభూతి! ఒళ్ళంతా జలదరింపు.

చీర కాళ్ళకు చుట్టుకుని దబ్బున కిందపడిపోయింది. ఒళ్ళంతా రక్కుకుపోయింది. కొనదేలిన రాళ్ళు చర్మాన్ని చీల్చేశాయి. రక్తం స్రవిస్తోన్న గాయాలు!

ఇకముందుకు పరుగెత్తే ఓపికలేక కూలబడిపోయింది. ఆకలితో శోష వచ్చేలా వుంది. అవయవాలు సహకరించటం లేదు.

పక్కనే పళ్ళతో వొంగిన పెద్దపెద్ద చెట్లు. ఏం పళ్ళో తెలీదు. తింటే ఏమవుతుందో తెలీదు. కాని ప్రాణం ఆకలితో కడంటిపోతోంది. అలా పోయే ప్రాణం నిలుస్తే యీ పళ్ళతో నిలుస్తుంది; లేదా సరాసరి పోతుంది.

తెగింపు వచ్చేసింది అర్చనలో. లేచి నించుంది. చేతికి అందుతున్నాయి. ఎర్రగా పండిన పళ్ళు తేనెలూరుతున్నాయి. నాలుగు పళ్ళు తెంపింది. మామిడిపండు వాసన! గబగబ తిన్నది. రుచిగానే అనిపించాయి. మరి నాలుగు తెంపుకుని తిన్నది. పులుపు, తీపి కలసిన వింత రుచి! కడుపు నిండింది.

కాసిని నీళ్లు తాగాలి. చుట్టూ చూసింది. సెలయేరు అంత దాకా ప్రవహిస్తూనే వున్నట్టుంది. స్వచ్ఛమైన నీళ్లు గలగల శబ్దం చేస్తున్నాయి.

తనివి తీరా నీళ్ళు తాగింది. రాళ్ళవల్ల కలిగిన గాయాలను కడుక్కుంది. ఇప్పుడు అంత బాధనిపించటం లేదు. కడుపునిండాక కళ్ళమీదికి నిద్ర కూరుకు వస్తున్నట్టనిపిస్తోంది. కాని, నిద్రపోకూడదు! తనని ఏ జంతువో నిద్రలోనే భోంచేస్తుంది.

ముందు యిక్కడ్నుంచి తప్పించుకుపోవాలి! ఆమె మనసునిండా ఒకే ఆలోచన. ఇక్కడ్నుంచి బయటపడాలి. ఏదైనా మనుష్య సంచారమున్న ప్రాంతం చేరుకోవాలి. లేదా ఏదైనా నావగాని, షిప్పుగాని వస్తుందేమో చూసి వాళ్ళ సహాయమర్థించాలి!

అర్చన ఆలోచనకి ఓ రూపం రానేలేదు. ఇంతలో

ఎక్కడినుంచో పెద్ద గర్జన వినపడింది. ఆమె గుండెలు అవిసిపోయాయా కేకకు.

ఆది పులిదో, సింహానిదో, మరే జంతువుదో అర్థం కాలేదు. చాలా వింత గర్జన! తానిదివరకేనాడూ వినని గర్జన! ఒకసారి కాదు, రెండుసార్లు కాదు—అలా గర్జిస్తూనే వుంది.

చెట్లమీది పక్షులన్నీ చెల్లాచెదురుగా ఆకాశంలోకి ఎగిరి పోయాయి. ఒక్కసారిగా ప్రకృతిలో యిదివరకెన్నడు చూడని కలకలం చెలరేగింది. అంతా ఏదో గందరగోళంగా, హడావిడిగా వినిపిస్తోన్నాయి వింత శబ్దాలు. అవి జంతువులవి, పక్షులవి, యింకా రకరకాల కేకలు, కూతలు, ఊళలు!

అర్చన గుండె వేగం హెచ్చింది. ఏదో విపరీతం జరగబోతోంది. అదేమిటో తెలీదుగాని, మొత్తానికి ప్రాణ ప్రమాద మయినదే? ఏమిటది?

లేళ్ళు, దుప్పులు హడావిడాగా పరుగులు పెడ్తున్నాయి. కుందేళ్ళు, చెవుల పిల్లులు లాంటి చిన్న చిన్న జంతువులు ఆమె కళ్ళముందే ప్రాణభయంతో పరుగులు పెడ్తున్నాయి.

అర్చన లేచి నిలబడింది. తనూ పారిపోవాలి. ఎక్కడికి? ఎక్కడికని పారిపోగలదు? తనకీ దీవిలో దారి తెలీదు. ఎటుపోతే ఏమవుతుందో తెలీదు ఎక్కడికి చేరుకుంటుందో అసలే తెలీదు.

గర్జనలు మరీ దగ్గర్లో వినిపిస్తున్నాయి. ప్రశాంత వాతావరణంలో విపరీతమైన అలజడిని సృష్టిస్తున్నాయి. ఆ గర్జనలకే గుండె ఆగిపోతుందేమోనన్నట్టు అదురు పుట్టిస్తున్నదా జంతువేదో!

గర్జనలు యింకా దగ్గరయ్యాయి.

అర్చన మళ్ళీ పరుగందుకుంది. ఇక నిత్యమూ ప్రాణం కోసం యీ పోరాటం తప్పదా తనకు? ఎక్కడికీ పరుగు పందెం? ఏం కాబోతోంది?

చుట్టూ రాళ్ళు, రప్పలు, ముళ్ళ పొదలు—శరీరాన్ని చీరేస్తున్నాయి. రక్తం ధారలు కడుతోంది. అయినా ఆమె లెక్కచెయ్యలేదు. పరుగెడుతూనే వుంది. అక్కడ చెట్లు అంతగా దట్టంగా లేవు. క్రుంగిపోతున్న సూర్యుడి లేత కిరణాలు అక్కడి నేలమీద, రాళ్ళమీద వింత కాంతిని సృష్టిస్తున్నాయి.

అర్చనకు సుదూరంగా నీటి పొడ కనిపిస్తోంది. నీలంగా వున్న నీరు! అవును సముద్రం! అక్కడికి సముద్రం బాగా దగ్గరయింది. దీవి అంతమయి సముద్రాన్ని తాకుతున్న తీరం కనిపిస్తోంది. తను. కరుణాకర్ సముద్రం నుండి యీ దీవికి విసిరివేయబడ్డ తీరం, బహూశా, అదేనేమో! ఏమో, తనకి గుర్తులేదు.

కారుణాకర్ తనకి ప్రథమచికిత్స చేసి రక్షించాడు. అతని చేతుల్లోనే కళ్ళు తెరిచింది. ఒక విధంగా కరుణాకర్ తన ప్రాణదాత. కాని ఆ కరుణాకరే తన శీలాన్ని హరించబోయి దారుణంగా అంతమయిపోయాడు. అర్చనకు అతని పట్ల ఒక్క క్షణం జాలి, బాధ కలిగాయి.

తీరం దగ్గిరయ్యింది. వెనక ఆ మృగం తాలూకు గర్జనలు వినిపిస్తున్నాయి.

వెనక్కి తిరిగి అదే జంతువో చూడాలన్న బలమైన కోరిక ఆమెని ఓ క్షణం ఆగి, వెనక్కు తిరిగేలా చేసింది.

మరుక్షణం ఆమె గొంతు నుండి ఆక్రందన వెలు

పడింది.

అక్కడ పర్వతాకారంలో వున్న ఓ వింత జంతువు చిన్న జంతువుల్ని పట్టి తింటోంది. దాని ఆకారం చూడ బోతే ఏనుగులా వుంది. సింహంలా జూలుంది. పెద్ద పెద్ద కోరల మధ్య లేళ్ళు, దుప్పులు కరకరమంటూ నలిగిపోతు న్నాయి. దాని నాలుగు కాళ్ళకూ పంజాలున్నాయి. వాడి బాణాల్లాంటి పదునైన గోళ్ళు సూర్యుడి అంతిమ కిరణాల్లో బాకుల్లా మెరుస్తున్నాయి. చాలా పెద్ద చప్పుడు చేస్తూ తింటోంది. మధ్యమధ్య జీర్ణం కావటాని కన్నట్టుగా పెద్దగా గర్జిస్తోంది.

అర్చన ఇక మరోక్షణం కూడా ఆగలేదక్కడ. నాలు గడుగుల్లో తీరాన్ని చేరుకుంది. ఆ హడావిడిలో ఆమె చీర ఓ పెద్ద ముళ్ళ కంచెకు చిక్కుకుంది. దాన్ని విడిపించుకోవ టానికి టైం లేదు. చిక్కుకున్న చీరని అల్లే చించేసింది. ఓ బారెడు ముక్క మిగిలింది చీర. ఆ చీర ముక్కనే వల్లె వాటుగా వేసుకుంది.

తీరం వెంబడే ఆమె చూపులు పరుగెడుతున్నాయి. ఎక్కడయినా చెక్కముక్కో మరే అధారమో దొరుకుతుం దేమోనని! అలాంటిదేం కనిపించలేదు. గర్జనలు మరింత సమీపంలో వినిపించుతున్నాయి. ఆ వింత మృగం కదలి వస్తోంది. తనని గమనించలేదుకదా?

ఆ ఆలోచన రాగానే అర్చన గుండెలు అవిసిపోయాయి. తొందరపాటు హెచ్చింది. మెదడు ఏ ఆలోచనా లేకుండా మొద్దుబారిపోయింది.

ఎలా తప్పించుకోవాలి? సముద్రంలోకి పోయి ముందు ప్రాణం రక్షించుకోవాలి. తను ఆ దీవికి ఏ ఆధారంతో కొట్టుకొని వచ్చిందో గుర్తులేదు. అక్కడ ఏ విధమైన

దుంగగాని, కొయ్యగాని, చెక్కముక్కగాని ఏవీ లేవు. ఎలా?

గర్జనలు మరింత సమీపంలోకి వచ్చేశాయి. ఈసారి ఆ భయంకర మృగం స్పష్టంగా కనిపిస్తోంది. దాని ఆకారం చూస్తేనే గుండెలు పగిలిపోయేలా వున్నాయి. అంతటి భయోత్పాతం పుట్టిస్తోంది ఆ జంతువు ఆకారం!

కొంచెం దూరంలో ఏదో పెద్ద దుంగలాంటిది కొట్టు రావడం అర్చనకి కనిపించింది. ప్రాణం లేచివచ్చిందామెకు.

ఆ వైపు పరుగెత్తింది. అది దుంగకాదు! ఏనుగు కళేబరం! నీటిలో తేలుతోంది. గత్యంతరం లేదు. తనకీ కళేబరమే ప్రస్తుతం దుంగయినా, చెక్కయినా! తనని ముందీ జంతువు బారినుండి రక్షించేది ఆ కళేబరమే!

అర్చన యిక ఆలోచించలేదు. వెంటనే ఒక్క గెంతున ఆ కళేబరంమీదికి చేరుకుంది. ఒక్కక్షణ ప్రాణంపోతున్నట్టనిపించిదిది. చచ్చిన ఏనుగు నాశ్రయించి తన ప్రాణం రక్షించుకోవటానికి తను చేస్తున్న వ్యర్థప్రయత్నం చూసి ఆమెకి అంతటి దీనావస్థలోను తన పరిస్థితికి తనమీదనే జాలేసింది.

ప్రాణభయం ఎంత చెడ్డది!

అర్చనకు గట్టుమీద నుండి వింత మృగం కనిపిస్తోంది. దాని గర్జనలు వినిపిస్తున్నవి. అంతకంతకు తీరానికి దూరంగా సముద్రంలోకి ఏనుగు, ఏనుగుమీద తను— ప్రయాణం సాగుతోంది.

12

ఎప్పుడొచ్చాడో చక్రవర్తి, అవినాశ్‌కి తోడుగా బల్లకట్టు తయారుచేస్తున్నాడు.

రాజేష్, వినోద్, సురేఖ—అక్కడికి చేరుకునేసరికి వాళ్ళిద్దరు చాలా త్వర త్వరగా వెదురు బొంగులను ఒక దానితో మరొకటి చేర్చి వెడల్పాటి బల్లకట్టు తయారుచేసి సిద్ధంగా వుంచారు. నాలుగు వెదురుగడలకు చెట్ల బెరడులను ఓ చివర కట్టి తెడ్లుగా తయారుచేశారు.

దూరంగా పెద్దపెద్ద కేకలు, అరుపులు!

అందరూ తలలు తిప్పి చూశారు. ఆటవికులు పరుగు పరుగున అటే వస్తున్నారు.

"అనుకున్నంతా అయింది. వాళ్ళు మనల్ని గుర్తుపట్టేశారు. మన వునికి తెలిసిపోయింది. వాళ్ళకి చిక్కితే మనల్ని ఒకేసారి బలేయటం ఖాయం. ఊ, త్వరగా బల్ల కట్టుమీదికి సర్దుకోండి, క్విక్!" రాజేష్ తొందరపెట్టాడు.

అందరూ ఒకేసారి వెదురుబొంగుల బల్లకట్టు మీదికి ఎక్కగానే ఓసారి అటు యిటు వూగింది. నాలుగు వెదురు గడలను బల్లకట్టుమీద సిద్ధంగా వుంచుకున్నారు.

ఆటవికులు గట్టు చివరికి వచ్చేశారు.

"వినోద్, అవినాశ్, గడలు వెయ్యండి త్వరగా! వాళ్ళు నీటిలోకి కూడా వచ్చేస్తారు. బి ఎలర్ట్!" రాజేష్ తనో గడ అందుకున్నాడు.

వినోద్, అవినాశ్, చక్రవర్తి మూడు గడకర్రలను అందుకుని తెడ్లు వేస్తుండగా బల్లకట్టు వేగంగా సముద్రంలోకి వెళ్ళిపోయింది.

ఆటవికులు గురిచూసి వాళ్ళ చేతుల్లోని యీటెలు రాజేష్ బృందంమీదికి వరసగా విసిరేస్తున్నారు. అవి తగలకుండా తమని తాము రక్షించుకోవటం చాలా కష్టంగా వున్నది వాళ్ళకు.

నాలుగయిదు యీటెలు బల్లకట్టుమీదికి పడ్డాయి.

అయితే వాటివల్ల ఎవరికీ అపకారం జరగలేదు.

అప్పటికే బల్లకట్టు సముద్రంలో చాలాదూరం వెళ్ళి పోయింది.

"మనం కోరుకున్న ఆయుధాలు యీ విధంగా మనల్ని వెతుక్కుంటూ వచ్చాయి" అన్నాడు అవినాశ్ యీ టెలను తీసి పక్కన పెడుతూ.

రాజేష్ నవ్వాడు.

సురేఖకి టెన్షన్ తగ్గి గుండె గుండెలో సర్దుకుంది. దీర్ఘంగా నిట్టూర్చి "సమయానికి బాగా ఎలర్ట్‌గా గడలు వేశారు. లేకుంటే యీసరికి మనమంతా పై లోకానికి చేరిపోయుండేవాళ్ళం" అన్నది అభినందనపూర్వకంగా మిత్రులవంక చూస్తూ.

"ఈ ఆటవికులకి పెద్దగా ఆలోచించగల బుర్ర లేదు గాని లేకుంటే యిప్పుడు మన వెంట పడివుంటే యేం చెయ్యగలిగేవాళ్ళం?" అన్నాడు రాజేష్.

"నిజమే! వీళ్ళకి సముద్రంమీద ప్రయాణం చేయటం తెలిసుండదు. అందుకే యీ దీవిలో ఎక్కడా తీరం వెంబడి బల్లకట్టులేవీ కనిపించవు" అవినాశ్ అన్నాడు.

"అదిసరే, యిప్పుడెక్కడికి పోవాలి? మనమిప్పుడున్నది ఏ ప్రాంతం? ఇదే సముద్రం? బంగాళాఖాతమా, హిందూ మహాసముద్రమా, లేక అరేబియా సముద్రమా? అవేమీ కాక మరో ఎర్రసముద్రమో, నల్లసముద్రమో అంటారు-అదా?" చక్రవర్తి సందేహం.

"ఆ విషయాల్లో మా కెవరికీ ప్రవేశం లేదు. అన్నట్టు కరుణాకర్ వుంటే యీ సమస్యని పరిష్కరించి వుండే వాడు. అతను హిష్టరీ స్టూడెంటు కదా!" అన్నాడు వినోద్.

"మనం సాగరలోయకు బయల్దేరినవాళ్ళం—ఎనముండు గురం. ఇప్పు డిక్కడ వున్నవాళ్ళం—అయిదుగురం. తక్కిన ముగ్గురు—అంటే—కమలనాథ్. కరుణాకర్, అర్చన—యేమయిపోయారో, యెక్కడికి పోయారో అదేమీ మన కిప్పటివరకు తెలీదు. పొరపాటున వాళ్ళు యిదే దీవికి వచ్చి చిక్కుకుపోలేదు కదా!" అన్నాడు చక్రవర్తి.

"ఏమో యెవరు చెప్పగలరు? అసలీ దీవికి మొదలేదో, చివరేదో మన కేమయినా తెలిస్తే కదా! ఈ రాక్షసుల బారి నుండి తప్పించుకోవటమే గగనమైపోయింది. ఇక దీవిని చూసేందుకు తీరిక, సావకాశం ఎక్కడ దొరికాయి?" అన్నాడు వినోద్.

"నిజంగా పెద్ద గండం గడిచింది...." అన్నాడు అవినాశ్.

"వినోద్ సురేఖలకు మళ్ళీ పునర్జన్మ లభించినట్టే చెప్పుకోవాలి. నాకయితే ప్రాణాలతో బయటపడతామనుకో లేదు" అన్నాడు మళ్ళీ.

సురేఖ గుండెలమీద చెయ్యి వేసుకుంది. వినోద్ నవ్వుతూ చూశా డామెవంక. సిగ్గుపడిందామె.

"అర్చన, కరుణాకర్, కమలనాథ్‌ల ఆచూకీ తెల్సు కోవటం ఎలా? పాపం అర్చన అబల. ఎక్కడ చిక్కుకు పోయిందో, యెన్ని అవస్థలు పడుతోందో!" వినోద్‌తో బాటు అందరినీ కాసేపు విషాదఛాయ లావరించాయి.

రాజేష్ పైకి చెప్పుకోవటం లేదుగాని మానసికంగా నరకం అనుభవిస్తున్నాడు. ఆమె క్షేమంగావుందా? ఎందుకో అతనికి ధైర్యం సరిపోవటంలేదు. అర్చనని క్షేమంగా కాపాడమని కనపడని దేవుళ్ళకి పేరు పేరునా ఎన్నిసార్లు

మొక్కుకున్నాడో అతనికే గుర్తులేదు. అర్చన బతకాలి. తనకి కనపడాలి. అంతదాకా యీ మనోక్షోభ భరించక తప్పదు!

రాజేష్ వులిక్కిపడ్డాడు.

సముద్రంలో యేదో నల్లటి ఆకారం ఒక్క క్షణం కనిపించి మాయమయింది. యేమిటది? తక్కినవాళ్ళెవరూ అది గమనించినట్టు లేదు. తను చెప్పి భయపెట్టినట్టవు తుందేమో! చెప్పకుంటే వాళ్ళు అప్రమత్తతతో వుండ రేమో! ద్వంద్వ భావంలో పడి కొట్టుకున్నాడు కాసేపు.

ఈసారి ఆ వస్తువును అవినాష్, వినోద్ కూడా చూశారు. ప్రశ్నార్థకంగా రాజేష్ ముఖంలోకి చూశారు.

"నీటిజంతువుల గురించి విని వున్నాం కదా! ఏదయినా పెద్ద చేప కావచ్చును" అన్నాడు రాజేష్.

చక్రవర్తి తనూ విన్నాడా మాట! అతనింతదాకా ఆ వస్తువును చూడలేదు.

"జంతువంటున్నావేమిటి? ఏమయినా కనిపిస్తున్నాయా సముద్రంలో?"

"లేదు, నువ్వేం తొందరపడకు. నీ ఆవేశమే మనల్ని ఏనుగులచేత విసిరికొట్టించుకున్నది! ఆవేశం అన్నివేళలా మంచిది కాదు" మందలింపు ధ్వనించింది వినోద్ కంఠంలో.

ఈసారి వాళ్ళ బల్లకట్టుకి అతి దగ్గరగా కనిపించింది ఆ వస్తువు. ఈసారి స్పష్టంగా కనిపించింది.

"అదేదో షార్క్ తోకలా వుంది కదూ!" అన్నాడు వినోద్.

రాజేష్ మొదటిసారే అనుమానించాడు—అది తిమింగలం కావచ్చునని! తిమింగలాలు పెద్ద పెద్ద ఓడల్నే తిరగ

దోసేస్తాయని తను విన్నాడు, చదివాడు! అలాంటిది వెదురు బొంగులతో కట్టుకున్న తెప్ప తమల్ని రక్షిస్తుందా?

"జాస్ సినిమా చూశావా?" చక్రవర్తి అవినాష్‌ని వుద్దేశించి అన్నాడు.

"చూస్తే....? దాంట్లో హీరో బృందం వేటాడినట్టు యీ తిమింగలాన్ని మనం వేటాడుదామా? అది సినిమా బాబూ! పైగా వాళ్ళదగ్గిర మంచి ఓడ, ఆయుధాలు వుండి కూడా చివరికి డైనమైట్ దాని కడుపులోకి పంపించి పేల్చేవరకు అది చావనేలేదు. ఓహ్, అదీ ఎడ్వంచరంటే! ప్రతి క్షణం మన గుండెల్ని అదరగొట్టే దృశ్యాలతో—సస్పెన్స్‌తో—ఎంత గొప్పగా వుందో...."

"వినోద్, యిది సినిమాల గురించి మాట్లాడుకునే సమయం కాదు. ఈ షార్క్ తన తోకతో చిన్నగా జర్క్ యిచ్చిందంటే చాలు—మనందరం సముద్రం పాలయి పోతాం. ఈసారి నిష్కారణంగా చచ్చిపోతాం....అదిగో, దూరంగా మన కుడిపక్కగా ఏదో భూభాగమున్నట్టు తోస్తోంది. బహుశా అది దీవి ఏదైనా కావచ్చు. అక్కడికి గెడ వెయ్యండి, అందరూ. ముందు ఈ షార్క్ బారి నుండి తప్పించుకోవటం చాలా అవసరం!" రాజేష్ తొందరపెట్టాడు.

ఈ లోపల వాళ్ళకి మరింత సమీపంలో షార్క్ నీటిలో నించి లేచి మళ్ళీ లోపలకు పోయింది.

వినోద్ నీరసంగా అన్నాడు. "మళ్ళీ మరో దీవికా? ఇక్కడ యెలాంటి పరిస్థితులెదుర్కోవాల్సి వుంటుందో! దానికన్నా యీ తిమింగలంతో పోరాడి చస్తేనే నయమేమో! స్వర్గమయినా దొరుకుతుంది."

"హాస్యానికిది సమయం కాదు. ఊఁ వేగంగా గడలు వెయ్యండి. ఏదోక తీరం చేరుకోవటం చాలా అవసరం. అక్కడేదైనా సమస్య లెదురైతే యెలాగో ఎదుర్కొందాం. ఈ షార్క్ వాతబడితే శాల్తీలే మిగలవు" హెచ్చరించాడు రాజేష్. మగాళ్ళు నలుగురూ తెడ్లు వేస్తున్నారు గడ కర్రలతో. తెప్ప అనుకున్న వైపుకి మెల్లగా కదుల్తోంది.

షార్క్ దూరమయింది.

"అదృష్టవశాత్తు షార్క్ మన గురించి పట్టించుకోలేదు. లేకుంటే ఈసరికి మన పని అయిపోయుండేది" అన్నాడు అవినాశ్.

మరి కొద్ది నిమిషాల్లో బల్లకట్టు భూభాగాన్ని చేరింది.

"బల్లకట్టును యిలా వదిలేస్తే ఎలా? సముద్రంలోకి వెళ్ళిపోదూ?" అన్నాడు వినోద్.

"నలుగురం కలిసి యీ నేలమీదికి తెచ్చేద్దాం" అన్నాడు రాజేష్.

బల్లకట్టును నలుగురు పట్టి నేలమీద పెట్టారు. గెడ కర్రల్ని కూడా దానిప్రక్కన పడేశారు.

"ఈ బెలు తీసుకుందామా? ఏవైనా జంతువులో, జంతువులాంటి మనుషులో ఎదురుపడితే కనీసం ఆత్మ రక్షణ కుపయోగపడతాయి" అన్నాడు అవినాశ్.

రాజేష్ తలూపాడు. అందరూ ఒక్కో యీటెని చేతిలోకి తీసుకున్నారు.

13

చాలా జాగ్రత్తగా అడుగు తీసి అడుగు వేస్తూ నడుస్తున్నారు అయిదుగురూ ఆ దీవిలో.

"మిస్ సురేఖా! మీరు నడవగలరా? ఆకలి వేస్తోందా?" అనడిగాడు రాజేష్.

లేదన్నట్టు తలూపింది సురేఖ. కాని ఆమె ఆకలితో నకనకలాడ్తున్నట్టు చూడగానే తెలిసిపోతోంది.

"చూద్దాం, యిక్కడేమైనా పళ్ళవృక్షాలు కనిపిస్తాయేమో!" అన్నాడు రాజేష్.

"అరటిపళ్ళు, పట్టుతేనె దొరికినా చాలు!" అన్నాడు చక్రవర్తి. అతనికి ఆకలి దహించి వేస్తోంది.

దాదాపు అందరిదీ అదే పరిస్థితి!

"ఆకలి మహాచెడ్డది!" అన్నాడు వినోద్, తనూ అదే దుస్థితిలో వున్నట్టు తెలియజేస్తూ.

కొన్ని అడుగులు వేసి చటుక్కున ఆగిపోయాడు రాజేష్.

అక్కడ ముళ్ళపొదలకి చిక్కుకుని చీరముక్క వేలాడుతోంది. గాలికి రెపరెపలాడుతోంది.

"మైగాడ్, యిది అర్చన చీరలా వుందే!" అన్నాడు జనాంతికంగా.

సురేఖ గుర్తుపట్టి చిన్నగా కేకపెట్టింది.

"ఎస్. ఇది అర్చన చీరే! నాకు బాగా గుర్తు. బయల్దేరేటప్పుడు తను ఈ చీరనే కట్టుకొంది. నాకు ఆఫర్ చేసింది మొదట. నేను వద్దన్నాకే తను కట్టుకుంది, అందుకే నాకింకా బాగా గుర్తుంది" అన్నది.

రాజేష్ దగ్గరగా వెళ్ళి కంచె నుండి చీరను తప్పించి పైకి తీశాడు. "ఇది పూర్తి చీరకాదు. సగం ముక్కమాత్రమే! అంటే తక్కిన ముక్క అర్చనతోనైనా వుండాలి. లేకుంటే అర్చనని ఏ క్రూరమృగమో, నరరూపరాక్షసుడో...." ఆపైన మాటలు రాలేదతని గొంతు నుండి.

అవినాశ్ అతని భుజం తట్టి, దీన్నిబట్టి చూస్తే అర్చన

బ్రతికేవున్నట్టు ఖచ్చితంగా తెలుస్తోంది. అంటే ఆమె ఈ దీవిలోనే ఎక్కడో వుండి వుండాలి. జంతువో మనిషో ఆమెకి అపకారం తలపెట్టివుంటే పూర్తిచీర మనకు దొరికి వుండేది. కనీసం చీలికలు వాలికలైన చీర ముక్కలు దొరికేవి-అలా జరగలేదు కాబట్టి ఆమె ఇక్కడే ఎక్కడో క్షేమంగా వుందని నాకు ధైర్యంగా వుంది" అన్నాడు.

రాజేష్ మిత్రుడి చేతిని బలంగా పట్టుకున్నాడు. అతని చేయి కంపించడం అవినాశ్‌కి తెలుస్తోంది.

"నా కెందుకో ధైర్యం చాలటంలేదు. ఒంటరి ఆడది యీ దీవిలో ఎలా నెగ్గుకొస్తుంది? ఇక్కడ మనుషులే వున్నారో, జంతువులే వున్నాయో, ఎలాంటి క్రూరమృగా లున్నాయో మనకు తెలీదు. ఆమె గురించి ఏమని అనుకోవ టానికీ నాకేం తోచటంలేదు" అన్నాడు రాజేష్.

సురేఖ స్నేహితురాలి దురవస్థతి విచారిస్తోంది. ఆమె కళ్ళు స్రవిస్తున్నాయి. 'భగవాన్, అర్చనని క్షేమంగా కాపాడు'—అనుకుంటోంది మనసులో పదే పదే.

అప్పటికి పూర్తిగా చీకటి పడిపోయింది.

"ఈ చీకట్లో ఎక్కడ వెతుకుతాం? ఈ దీవి నైసర్గిక స్వరూపం మనకింగా అవగాహన కాలేదు. ఇది యెక్కడ మొదలై ఎక్కడ అంతమయిందో, యీ దీవి ఏ మూల ఏముందో అసలు మన ఊహకే అందటంలేదు. గుడ్డిగా లోపలికి ప్రవేశించి అందరమూ ఆపదలో చిక్కుకుపోతా మని భయంగా వుంది నాకు!" అన్నాడు రాజేష్.

అవినాశ్ మిత్రుడివంక వింతగా చూశాడు.

ఇంతవరకు తమని వుత్సాహపరుస్తూ, కార్యదీక్షకు మర లించిన రాజేషేనా యిలా బేలగా మాట్లాడుతున్నది! అత నిలో చెలరేగుతున్న సాగర మధనం అవినాశ్ ఒక్కడికే

తెలుసు. అర్చనని అతనెంత గాఢంగా ప్రేమించాడో, ఆమె దూరం కావటంతో ఎంతగా క్రుంగిపోయాడో కూడా తెలుసు.

అర్చన కోసం వెతకబోయి తామందర్నీ ఆపదలకు గురిచెయ్యాల్సి వస్తుందేమోనని యీ రాత్రిపూట దీవి లోపలికి వెళ్ళటానికి వారిస్తున్నాడే గాని, అర్చన క్షేమం తెలిసే వరకు రాజేష్ కన్ను మూయడని, తిండి తినడని, అంతదాకా మనశ్శాంతి వుండదని అవినాశ్ కి తెలుసు.

ఓదార్పుగా మిత్రుడి చేయి మెల్లగా నొక్కి వదిలాడు అవినాశ్.

"అయితే మనం యీ రాత్రికి యీ గట్టునే కాలక్షేపం చెయ్యాలా?" అడిగాడు వినోద్.

"ఈ లోపల చుట్టుపట్ల ఏమైనా తినడానికి దొరుకుతాయేమో చూద్దాం. నీటి వసరుకూడా ఎక్కడుందో వెతుక్కోవటం చాలా అవసరం" అన్నాడు రాజేష్.

"నేను, వినోద్ వెళ్ళి చూసి వస్తాం. మీరందరూ కాసేపు నడుములు వాల్చండి" అన్నాడు అవినాశ్.

"నేనేం చేస్తానిక్కడ? నేనూ వస్తాను" అన్నాడు చక్రవర్తి తనేం తీసిపోలే దన్నట్టు.

రాజేష్ వినోద్‌ని వారించి, "మేమందరం వెళ్తాం. మిస్ సురేఖకి తోడుగా నువ్వుండు" అన్నాడు.

వినోద్ వెంటనే ఆగిపోయాడు. సురేఖతో ఏకాంతాన్ని కోరుకుంటున్నాడతను. సురేఖ మనసులో మాత్రం ప్రస్తుతం అర్చన గురించిన ఆలోచనలే సుళ్ళు తిరుగుతున్నాయి. ఆమెకేదైనా ఆపద కలగలేదు కదా! చీర ఎందుకు సగం చిరిగిపోయింది? తాను సమాధానపరచుకోలేక పోతోంది సురేఖ.

వినోద్ ఆమె పక్కనే చతికిలబడుతూ, "బాగా ఆకలిగా వుందా?" అనడిగాడు.

ఆమె తల అడ్డంగా తిప్పింది.

"నీ మనసులో చెలరేగే సంక్షోభం మిస్ అర్చన గురించేనా?" అడిగాడు.

అవునన్నట్టు తలూపింది.

"ఆమెకే ఆపదా రాదని నా విశ్వాసం. ఆమె చాలా తెలివైనదే కాదు, సాహసికురాలు కూడా. నీలా బేలలా కుంగిపోదు. ఆపద ఎదురైతే మూర్ఛపోదు. ఎదిరించి పోరాడగల శక్తిమంతురాలే!" అన్నాడు.

సురేఖ నోరు విప్పింది. "ఇవాల్టికి మనం బయల్దేరి ఎన్ని రోజులయింది?" అనడిగింది.

"ఆరురోజులు. ఏం?"

"నాలుగైదు రోజుల్లో సాగరలోయ నించి తిరిగొస్తామని చెప్పాం మా యింట్లో. అర్చన నాతో వస్తూన్నదంటే మా వాళ్ళకి నిశ్చింత. అందుకే మారు మాట్లాడకుండా పంపించారు. వాళ్ళకి మన విషయం ఎలా తెలుస్తుంది? బయల్దేరిన వాళ్ళలో ఏ ఒక్కరం తిరిగి వెళ్ళలేదు కదా!"

"కమలనాథ్, కరుణాకర్ జాడ అసలు తెలియలేదు. వాళ్ళిద్దర్లో ఎవరైనా అదృష్టవశాత్తు సాగరలోయ దగ్గిరే వుండిపోయారేమో! గట్టున తేలిపోయి వుంటే తిరిగి విశాఖకు వెళ్ళిపోయి వుండొచ్చు."

"ఎలా చెప్పగలం? మనం అయిదుగురం దీవులకే కొట్టుకొని వచ్చాం. ఇప్పుడు అర్చన గురించి కూడా తెలిసింది. అంటే ఆరుగురం సముద్రంలో ప్రయాణంచేసి యిలా యిక్కడ కలిశాం. కమలనాథ్, కరుణాకర్ కూడా యిలాగే ఎక్కడో చిక్కుకుపోయి వుండొచ్చు."

సురేఖ వెంటనే మాట్లాడలేదు.

ఇంతలో దగ్గర్లో మాటల సవ్వడి వినిపించింది. వెళ్ళిన వాళ్ళు తిరిగొస్తున్నారు. దూరంగా జరిగి కూర్చున్నా రిద్దరు.

అప్పటికి పూర్తిగా చీకటి పడిపోయింది. అయితే చంద్రుడి మసక వెల్తురు మనుషుల్ని గుర్తుపట్టడానికి సరి పోతోంది.

"ఇవిగో, యీ పళ్ళు తినటానికి బాగానే వున్నాయి. మేము కొన్ని రుచి చూశాం. మీ రిద్దరు తిని చూడండి" అన్నాడు చక్రవర్తి. ఆకు దొప్పల్లో కొన్ని ఎర్రటి పళ్ళు తెచ్చారు. తియ్యటి వాసన వస్తోంది.

సురేఖ, వినోద్ తిన్నారు. పులుపు, తీపి కలిసిన వింత రుచి! తినటానికి రుచికరంగానే వున్నాయి. సురేఖ మొహ మాట పడింది. వినోద్ కొసరి తినిపించాడు.

"మేము యీ పక్కనే వున్న సెలయేట్లో నీళ్ళుకూడా తాగాం. తియ్యటి నీళ్ళు. చక్రవర్తి మీకు ఆ సెలయేటికి దారి చూపిస్తాడు. పోయి తాగిరండి" అన్నాడు రాజేష్.

సురేఖ, వినోద్—చక్రవర్తి వెంటరాగా సెలయేట్లో నీళ్ళు తాగటానికి పోయారు.

వాళ్ళు వచ్చేసరికి చెట్ల ఆకులు తుంచి పక్కలుగా పరు స్తున్నారు రాజేష్ బృందం.

సురేఖ కోసం బల్లకట్టు తెప్పను మంచంగా తయారు చేశారు. ఆకుల్ని బాగా ఒత్తుగా పరిచారు తెప్పమీద. సురేఖ ముందు వారించింది. కాని, ఆమెను కటిక నేలమీద పరుండచేయటానికి వాళ్ళకు మనస్కరించలేదు.

అప్పటికి ఆ దీవి అంతా మాటుమణిగింది. అప్పుడు అప్పుడు పక్షుల వింత శబ్దాలు, నక్కల ఊళలు, యింకా

ఏవేవో కోతుల కిచకిచలవంటి ధ్వనులు వుండి వుండి విని పిస్తున్నాయి.

వినోద్, సురేఖ, చక్రవర్తి కాసేపట్లోనే నిద్రాదేవత ఒళ్ళో చేరిపోయి గాఢంగా నిద్రపోయారు.

రాజేష్ అస్థిమితంగా కదలటం అవినాశ్ ఒక్కడికే తెలుసు. ఆ రాత్రంతా రాజేష్ కంటిమీద నిద్రలేదు.

11

రాజేష్ కంటిమీద కునుకులేదు.

తెల్లవార్తుండగా లేచి కాలకృత్యాలు తీర్చుకుని వచ్చి తక్కిన వాళ్ళను మేల్కొలిపాడు.

పక్షులు కిలకిలారావాలతో గూళ్ళు వదిలి ఎక్కడికో పోతున్నాయి. అంతదాకా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా వున్న ఆ దీవి వాతావరణంలో ఒక్కసారిగా కలకలం చెలరేగింది.

అందరికన్న ముందు అవినాశ్ తన పనులు ముగించుకుని వచ్చాడు.

"ముందు యిద్దరమో, ముగ్గురమో దీవి లోపలకు వెళ్ళి పరిస్థితులు పరిశీలించి వద్దాము. తర్వాత తక్కిన వాళ్ళు అవసరమైతే వెళ్ళవచ్చును. అసలు యీ దీవి లోపలికి వెళ్ళాల్సిన అవసరం ఏం లేదు—కాని, అర్చన విషయం నిర్ధారణ చేసుకోవలసి వున్నది" అన్నాడు రాజేష్.

తక్కినవాళ్ళు అతని మాటలకు తలలూపారు.

అందరిలోనూ ఒకటే ప్రశ్న? అర్చన దీవిలో వుందా?

వినోద్‌కి దీవి లోపలికి వెళ్ళటమంటేనే గుబులుగా వుంది. మళ్ళీ ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందోనని! సురేఖ పరిస్థితీ దాదాపు అంతే! కాని అర్చన జాడ తెల్సుకోవాలని మనసు ఆరాటపడుతోంది.

"మీ రిద్దరు యిక్కడ వుండగలరా? ఏమయినా భయం

వేస్తున్నట్టు ఫీలవుతున్నారా?" రాజేష్ అడిగాడు.

వినోద్ వెంటనే, "మాకేం భయం లేదు. మీరు చూసి రండి!" అన్నాడు. సమస్య తేలిగ్గానే పరిష్కారమయింది.

"చక్రవర్తిని మీకు తోడుగా వుంచుతాం" అన్న రాజేష్ మాటలకు అడ్డొచ్చి, "నేనూ వస్తాను బ్రదర్! ఇక్కడ కూచుని ఏం చేయను?" అన్నాడు చక్రవర్తి.

రాజేష్, అవినాశ్, చక్రవర్తి ఈ ముగ్గురూ తీసుకుని దీవి లోకి బయల్దేరారు.

చుట్టూ అంతా చెట్లు, తీగెలు, డొంకదారి. ఎక్కడా కాలు పెట్టడానికి వీల్లేకుండా చిందరవందరగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, ముళ్ళకంపలు.

"ఖచ్చితంగా యిక్కడ మనుషులు సంచరించటంలేదు. మనుషులే వుంటే నడకకోసమని కాలిబాటలు పడివుండేది. అవి లేవు" అన్నాడు రాజేష్.

తక్కిన యిద్దరు తలలూపారు.

చెట్లమీద అక్కడక్కడ పక్షులు వింత వింత శబ్దాలు చేస్తూ కనిపించాయి. అవి ఏ జాతికి చెందినవో అంతుపట్ట లేదు వాళ్ళకు—ఎన్నడూ చూసి వున్నవికాదు.

పొదల్లో జరజరమని చప్పుడు.

చటుక్కున ఆగిపోయారు అందరూ. తాచుపాముల్లా వున్నాయి, చాలా లావుగా మరింత పొడవుగా వున్నాయి. ఎండుటాకులమీద జరజర పాకుతున్నాయి.

వాటిని పోనిచ్చాక మళ్ళీ నడక సాగించారు.

దూరంగా ఏదో ఎముకల గుట్ట కనిపించింది. దగ్గరికి వెళ్ళేకొద్దీ మనిషి ఎముకలన్న విషయం వాళ్ళందరికి అర్ధ మయిపోయింది. ఎముకల్ని అంటిన మాంసం యింకా పచ్చిగానే వుంది! పుర్రెను యింకా జుట్టు అంటి పెట్టుకునే

వుంది.

"రాజేష్! అదిగో ఆ షర్టు పీలికలు చూశావా? యిటు పక్క పేంటు చీలికలు. అవి వచ్చేటపుడు కరుణాకర్ వంటి మీద చూశాను" చిన్నగా అరిచాడు అవినాశ్.

రాజేష్‌కి గుర్తొచ్చింది. చక్రవర్తి గుర్తించాడు.

"ఎస్. అయితే కరుణాకర్....?"

ఎవరినోటా మాట రాలేదు.

ఓ పక్కగా పర్సువంటి వస్తువు వాళ్ళ దృష్టి నాకర్షించింది.

రాజేష్ అందుకుని చూశాడు. మనిపర్సు.

అది కరుణాకర్‌ది!

అందరి గుండెలు ఝల్లుమన్నాయి. అయితే కరుణాకర్‌ని యీ స్థితికి తెచ్చినవాళ్ళెవరు? మనుషులా, జంతువులా? అయితే అర్చన గతికూడా....

ఇక ఆలోచించలేక పోయాడు రాజేష్.

"రాజేష్, అటు చూడు, చెట్లమీద...." చక్రవర్తి పిలిచాడు.

అందరి దృష్టి అటు తిరిగింది.

నల్లటి కోతులు! కిచకిచ మంటూ కొమ్మలమీద ఎగురుతున్నాయి. పొడవాటి కోరలు బయటికి పొడుచుకు వచ్చాయి. అయితే వాటికి కోతుల కుండాల్సిన తోకలు లేవు!

"ఈ కోతులు చాలా వింతగా వున్నాయి."

"కోతులు కావు. చింపాజీల ఆకారంలో వున్నాయి. కనుగుడ్లు పచ్చగా మెరుస్తున్నాయి. ఇవేదో వింత మృగాల లాగా వున్నాయి" అన్నాడు రాజేష్.

నల్లకోతులు వీళ్ళని గమనించాయి. అంతే! వాటిలో

విపరీతమైన అలజడి కనిపించింది. కిచకిచమని కోతుల్లాగానే నోటితో శబ్దాలు చేశాయి. ఒకదానితో మరొకటి సంకేతాలు అందించుకున్నాయి. యుద్ధానికి సిద్ధమవుతున్న భటుల్లా వున్నాయి.

రాజేష్‌కి పరిస్థితి ప్రమాదకరంగా తోచింది.

"బి రెడీ! ఇవి మనమీద ఎటాక్ యిచ్చేలా వున్నాయి. బహుశా, కరుణాకర్‌ని చంపి తినేసినవి యివే కావచ్చు. వాటి కోరలు గమనించారా?" అన్నాడు రాజేష్.

ముగ్గురు ఆయుధాల్ని చేతిలో సిద్ధంగా పట్టుకున్నారు.

ఒక్కసారిగా పదుల సంఖ్యలో నల్లకోతులు వాళ్ళ మీదికి దాడిచేశాయి.

"ఎటాక్!" అన్నాడు రాజేష్.

ముగ్గురు చేతులకు పని చెప్పారు. ఈటెల్ని సూటిగా వాటి పొట్టల్లోను, కళ్ళల్లోను గుచ్చేస్తున్నారు. అవి భయంకరంగా అరుస్తున్నాయి. ఇంతవరకు అవి ప్రతిఘటన ఎరక్కపోవటంతో, శత్రువులు తమకన్న బలవంతులని అర్థమైపోయింది.

కొన్ని నల్లకోతులు అక్కడికక్కడే గిలగిల కొట్టుకుని చచ్చాయి. తక్కిన కోతులు భయపడి పరుగులు పెట్టేయి.

అయిదు నిమిషాల్లో ఆ ప్రదేశం వాన వెలిసిన తర్వాతి ప్రశాంతతను సూచిస్తోంది.

రాజేష్‌కి, చక్రవర్తికి స్వల్పంగా గాయాలు తగిలాయి. ప్రమాదకరమైనవి కాదు.

"ఈ దీవి చూడగా చాలా ప్రమాదకరమైనదిలాగా తోస్తోంది. బహుశా అర్చనవెంట యీ కోతులే వెంబడించి వుండాలి. ఆమె ప్రాణరక్షణ కోసం తీరం వెంబడి పరుగెత్తి వుండాలి. తీరాన ఆమె చీర ముక్క కనిపించ

టాని కదే కారణం కావచ్చు!

"ప్రస్తుతానికి గండం గడిచినట్టు అనిపించినా దెబ్బతిన్న నల్ల కోతులు ఏ క్షణంలోనైనా తిరిగి దాడి చెయ్యవచ్చు. శత్రువుల యీటెలు యీ విధంగా మనకి ప్రాణరక్షణ చేశాయి" అన్నాడు రాజేష్.

"ఈ వింత గమనించావా? ఈటె మొన తగలటంతోనే కోతులు ఎక్కడివి కక్కడ చచ్చిపోయాయి. అంటే ఆటవికులు వాటి మొనలకు విషం పూసినట్టుగా వుంది కదూ!" అవినాశ్ అన్నాడు.

"అవునవును. యు ఆర్ రైట్! వాళ్ళకి యిలాంటి మారణహోమాలపై చాలా శ్రద్ధ కదూ! విషం పూసి వుంటారు. అందుకే యివి వెంటనే చచ్చాయి" అన్నాడు రాజేష్.

"అయితే వీటి విషయం మనం జాగ్రత్తగా వుండాలన్నమాట!" అన్నాడు చక్రవర్తి.

"అదిగో అటు చూడు, చెట్ల మీది నుండి వేలాడుతున్నవి కొండచిలువల్లా లేవూ?" అవినాశ్ చూపించాడు.

దూరంగా రెండు చెట్ల మీదుగా బలంగా పొడవుగా వున్న కొండ చిలువలు నోళ్ళు తెరుచుకుని ఒళ్ళు విరుచుకుంటున్నాయి.

"అవును. బాగా ఆహారం మేసినట్టున్నాయి. చెట్టు కొమ్మలకు చుట్టుకుని జీర్ణం చేసుకుంటున్నాయి." అన్నాడు రాజేష్.

కొండచిలువలు చాలా భయంకరంగా వున్నాయి.

"అర్థమయిపోయింది. ఈ దీవిలో ఎన్నడూ మానవ మాత్రుడు కాలుపెట్టి వుండడు. అంతా జంతువులకు ఆలవాలం. చాలా క్రూరమైన, మనం ఎప్పుడూ చూడని వింత

జంతువులున్నా యిక్కడ. వీటి గురించి నాగరీకులకు చాలా తెలియాల్సి వుంది" అన్నాడు రాజేష్.

"మళ్ళీ నీ సోషియాలజీ పరిజ్ఞానం విప్పకు" ఛలోక్తిగా అన్నాడు అవినాశ్.

"అయితే మిస్ అర్చన విషయం...." తక్కిన మాటలు ఉచ్చరించటానికి భయపడ్డాడు చక్రవర్తి.

"ఏది ఏమైనా ఓ సారి యీ దీవిని చుట్టిరావటం మేలను కుంటున్నాను. అర్చన విషయం ఏమైనదీ నిర్ధారణయి పోతుంది" ఎంతగా గుండె చిక్కబట్టుకున్నా రాజేష్ కంఠం యీ మాట అంటున్నప్పుడు రవంత ఒణికింది.

అవినాశ్, చక్రవర్తి మౌనంగా తలలూపారు.

నాలుగడుగులు వేసేసరికి అక్కడ చిన్న మైదానం లాంటి ప్రదేశం కనిపించింది.

"ముందుకి అడుగెయ్యవద్దు" రాజేష్ హెచ్చరించాడు.

"ఏం?" ఒకేసారి అడిగారిద్దరు.

"అదుగో అటు చూడండి" లో స్వరంలో అన్నాడు రాజేష్.

అందరి దృష్టి అటు మరలింది.

అక్కడ రెండు పాములు జతకడ్తున్నాయి. ఒకదాని నొకటి పెనవేసుకుని వున్నాయి. అలాంటి సమయంలో వాటికి ఆటంకం కలగచేయకూడదని నమ్ముతారు. అలా డిస్టర్బ్ చేస్తే అవి పగపడతాయని కూడా చెప్పుకుంటారు.

"త్రాచుపాము, జెట్టిపోతు కదూ జంట కడతాయని అంటారు" అన్నాడు చక్రవర్తి వుండబట్టలేక.

"ఉష్!" అన్నాడు రాజేష్.

కొద్ది క్షణాల్లో అవి తమ దారిన తాము వెళ్ళిపోయాయి.

"ఇప్పుడు పదండి. చాలా జాగ్రత్తగా అడుగు

వెయ్యాలి. ఏ క్షణంలో ఏది విరుచుకుపడుతుందో అర్థం కాకుండా వుంది'' అన్నాడు అవినాశ్.

"ఇవేమిటి? ఏదో పగిలిన గాజుల్లాలేవూ?'' అన్నాడు చక్రవర్తి.

రాజేష్ ఉలిక్కిపడి చూశాడు.

అవును, గాజులు పగిలిన ముక్కలు అక్కడక్కడ చెల్లా చెదురుగా వున్నాయి. ఆ గాజులు తనకి గుర్తే! ఆమె చెయ్యి సవరించినపుడు ఆ రోజు రాత్రి చూశాడు. ఇవే రంగు, యిదే డిజైను. అయితే అర్చనకు ఏదయినా....?

మరికొన్ని గజాలు ముందుకు సాగిపోయారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితు లెదురవుతాయోనని అందరూ అప్రమత్తతతో వున్నారు.

ఆ దీవికి అంత మెక్కడో అంతుబట్టడంలేదు. అర్చన జాడ ఏమీ తెలియలేదు. పులులు, సింహాలు వంటి క్రూర మృగాలు కనిపించకపోవడం కొంత వింతగానే అనిపించింది వాళ్ళకు.

ఎక్కడ నుండో పెద్ద గర్జన వినిపించింది వాళ్ళకు. ఆ గర్జనకు ఆ దీవి అంతా మార్మోగిపోయింది. అయితే అది ఏ జంతువు తాలూకు గర్జనో వాళ్ళకు అంతుబట్టలేదు. మళ్ళీ మరోసారి వినిపించింది. ఈ సారి ఆ గర్జన దీవి మొదట్లో తాము రాత్రి నిద్రించిన స్థలాన్నుంచి వస్తున్నట్టనిపించింది.

"అదేదో వింత గర్జనలా వుంది! సురేఖ, వినోద్‌లను వదిలి వచ్చినచోట నుంచి వినిపిస్తున్నట్టుంది కదూ!'' అన్నాడు రాజేష్.

వాళ్ళిద్దరు తలలూపారు.

"అయితే, ఆ గర్జన తాలూకు జంతువువల్ల వాళ్ళకే

అపకారం ఏదయినా వాటిల్లలేదు కదా!" అన్నాడు అవినాశ్.

ముగ్గురి గుండెలు గతుక్కుమన్నవి.

"అవును,ఆ విషయమే మరిచాము!వాళ్ళిద్దరు ఒంటరిగా వున్నారు. ఈటెలు వాళ్ళ చెంతనున్నా సమయానికి వాటిని ఉపయోగించాలని వాళ్ళకు స్ఫురిస్తుందో, లేదో!

పదండి! ఆ గర్జన వస్తున్న వైపు పోయి చూద్దాం!" అన్నాడు రాజేష్ వెనుతిరిగి.

"అదేమిటి, మిస్ అర్చన విషయం పూర్తిగా తేలలేదు. దీవి యింకా చాలా భాగం అలాగే మిగిలిపోయినట్టుంది!" అన్నాడు అవినాశ్.

"అది తర్వాత! అర్చన విషయం ఆలోచిస్తూ కూచుంటే అక్కడ వాళ్ళిద్దరినీ చేజేతులా వదులుకోవలసి వస్తుందేమో!" వెనక్కి చూడకుండానే అన్నాడు రాజేష్.

విధిలేక ఇద్దరూ రాజేష్ వెంట వేగంగా దీవిలో తాము రాత్రి నిద్రించిన స్థలానికి హుటాహుటిన పరుగులు పెట్టారు. అక్కడ వాళ్ళకు కనిపించిన దృశ్యం వాళ్ళకు నిర్ఘాంతపోయేలా చేసింది.

15

దూరంగా ఏదో గుడ్డి వెల్తుర్లా కనిపించిందామెకు. బాగా పరికించి చూచింది. స్పష్టతలేదు.

ఏనుగు మీద ప్రయాణం ఆమెకు చాలా కష్టంగా ఉంది. కళేబరం కుళ్ళిపోలేదు, నయమే! లేకుంటే తను ఆ వాసనకే ప్రాణాలు వదిలేసివుండేది. రెండు మూడుసార్లు జారిపోతున్నట్లు భ్రమ కలిగించి. కాని జారిపోలేదు. ఏనుగుది భారీ శరీరం కావటంవల్ల కొంతమేర జరిగినా మళ్ళీ సర్దుకోవటానికి బాగానే అవకాశం దొరికింది.

అప్పటికి చీకటిపడి చాలా సేపయింది. రేడియం డయిల్ ఎనిమిది గంటలు చూపిస్తోంది. ఇలా యెంతసేపు ప్రయాణం చేయాలి? తనెక్కడకు పోతోంది? ఏం కాబోతోంది? ఆమెకు అంతా అగమ్యగోచరంగా వుంది. ఏనుగు కళేబరం ఎటు కొట్టుకునిపోతే తనూ అటు పోవాల్సిందే! గత్యంతరం లేదు.

మినుకు మినుకు మంటున్న వెలుగు బాగా దగ్గరయింది. అది ఏ షిప్పో, నావో తాలూకు దీపాలయితే యెంత బావుండును!

అయితే అది షిప్పూ కాదు, నావా కాదు. ఏదో తీర ప్రాంతం. అంటే, మరో దీవినా? అలాగే కనిపిస్తోంది. కళేబరం ఆ తీరాన తాకుతూ వెళ్తోంది. ఈ దీవిలో దీపాలు కనిపిస్తున్నాయంటే మనుష్య సంచార ముందన్న మాట! కానీ అదీ నయమే! కనీసం మనుషులున్న ప్రాంతమయితే తనకి రక్షణ లభిస్తుంది.

ఆమెలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఏనుగు కళేబరంతో తనకిక పనిలేదు. కళేబరం ఒడ్డును ఒరుగుకుని ప్రయాణం చేస్తున్న సమయంలో చటుక్కున ఒడ్డుకు గంతేసింది అర్చన.

ప్రాణంలేని ఏనుగుకు కృతజ్ఞతలు చెప్పుకుంది.

తాను గుర్తించిన వెలుగు కాగడాల వెల్తురని గ్రహించటానికెంతో సేపు పట్టలేదామెకు.

ఉత్సాహంగా ఆ దీపాలవైపు నడుస్తున్నదల్లా చటుక్కున ఆగిపోయింది అర్చన.

ఈ దీవిమీది మనుషులు ఎటువంటివారో? వాళ్ళకి తన భాష తెలుసో, లేదో? వాళ్ళు ఏ దేశానికి సంబంధించిన వాళ్లో? వాళ్ళవల్ల తనకేదైనా కీడు సంభవిస్తే....?

ఆమె మనసు పరిపరి విధాల పోతోంది. సరాసరి పోయి ఆపదలు కొనితెచ్చుకునేకంటే చాటున దాగి పరిస్థితుల్ని ఆకళింపు చేసుకుని తర్వాత వాళ్ళముందు పడటం శ్రేయస్కర మనిపించిందామెకు.

అక్కడ చెట్లు గుబురుగా వున్నాయి. కొంత దూరం పోతే అక్కడి ప్రదేశం బాగా బాహాటంగా వుంది. దాక్కొని చూడటానికి పెద్దగా అవకాశంలేదు. ఎవరైనా గుర్తించే ప్రమాదముంది।

అర్చన ఆ చెట్ల గుబురుల్లో నిల్చోవటానికి సంకోచించింది. రాత్రి సమయం! ఏ పురుగో, పుట్రో వుంటే....?

కాసేపు సందిగ్ధంలో పడ్డాక దాక్కొని నిల్చోవటమే అన్ని విధాల క్షేమకర మనిపించిందామెకు. బాగా గుబురుగా వున్న చోట కాకుండా మనిషి బయటికి కనిపించని విధంగా నిల్చుని దీప కాంతులున్న వైపు దృష్టి కేంద్రీకరించింది.

అక్కడ మనుషులు తిరుగుతున్నారు. ఏవో కట్టెపుల్లల వంటి వానిని వెలిగించి ఆ వెలుగులో పని చేసుకుంటున్నారు.

దీక్షగా చూడగా ఆమెకు వాళ్ళు గుడిసెల మీద రెల్లుగడ్డివంటి గడ్డినేదో సర్దుతున్నట్టు కనిపించింది. అంటే గుడిసెలు వేసుకుంటున్నారన్నమాట! రాత్రిపూట వేస్తున్నారేం చెప్మా? అనుకున్నది.

మరి కొంతమంది కాలిపోయిన కట్టెపుల్లల్ని తీసివేసి వాటి స్థానే పొడవాటి కట్టెపుల్లల్ని తాళ్ళతో ఒకదానికొకటి కట్టి యింటి పైకప్పుగా తయారు చేస్తున్నారు. అంటే, వీళ్ళు కొత్తగా యిప్పుడు కట్టడంలేదన్న మాట! గూడెం ఏదో అగ్నిప్రమాదానికి లోనయినట్టు కనిపిస్తోంది.

పాపం, యిళ్ళు తగలబడిపోయాయా? ఆమెకు వాళ్ళ పరిస్థితికి జాలివేసింది.

ఆ గుడ్డి వెల్తుర్లో వాళ్ళ ముఖాలు సరిగ్గా కనిపించటం లేదు. మరికాస్త ముందుకి వెళ్తే దాక్కోవటానికి సరయిన మరుగుప్రదేశం లేదు.

అర్చన అటే గుడ్లప్పగించి చూస్తోంది. ఆ మనుషుల్ని చూస్తుంటే ఆమెకు సదభిప్రాయం కలగటంలేదు. ఒంటి మీద సరైన ఆచ్ఛాదన లేని ఆడవాళ్ళను చూశాక వాళ్ళు ఎంతగా వెనకబడివున్న ఆటవిక సంతతో ఆమెకు తెలిసి వచ్చింది.

సోషియాలజిలో తను చదువుకున్న 'కూర్గ్స్' జాతి మనుషులు, కొండజాతి మనుషులు వారి జీవన విధానం గుర్తొచ్చాయామెకు. వాళ్ళయినా యింత అనాగరికంగా వున్నట్టు వర్ణింపబడలేదు. వారికన్న బాగా వెనకబడిన ఆటవిక జాతుల వాళ్ళలా కనిపిస్తున్నారు వీళ్ళు.

ఇంతలో ఆమెకు మరో దృశ్యం కనిపించింది.

నలుగురు ఆటవికులు ఏదో జంతువును చర్మం వలిచి నాలుగు కర్రలు అటు యిటు పాతి, దానికి ఆ జంతువు శరీరాన్ని కట్టేశారు. కిందనుండి ఎండుకట్టెల్ని మంట పెట్టి దాన్ని కాలుస్తున్నారు. అంటే కాల్చిన జంతువుని వీళ్ళు ఆహారంగా భుజిస్తారన్న మాట.

ఒకడు యీటె తీసుకుని అది సరిగ్గా కాలిందో లేదో పొడిచి చూస్తున్నాడు. మరొకడు కొంత మాంసాన్ని కోసి నోట బెట్టుకుని రుచి చూస్తున్నాడు. తక్కిన యిద్దరు కొమ్ములతో ఏదో ద్రవాన్ని పట్టి తెచ్చి వాళ్ళందరికీ పంచుతున్నారు. బహుశా అది ఏ ఇప్ప సారాయేమో కావచ్చునని తోచిందామెకు.

ఇలాంటి స్థితిలో వాళ్ళమధ్యకు వెళ్ళటం ఎంత ప్రమాదకరమో ఆమెకు తెలిసివచ్చింది. ఉదయం వరకు ఎక్కడైనా సురక్షితంగా తల దాచుకోవటం మంచిదనే ఆలోచన వచ్చింది. కాని ఎక్కడకు పోయేటట్టు? ఈ దీవి తనకు పూర్తిగా కొత్త. ఏ పక్క ఏముందో తెలీదు. అనుకోకుండా వెళ్ళి కొత్త చిక్కుల్ని కొనితెచ్చుకోవలసి వస్తుందేమో!

అర్చన కాసేపు తర్జన భర్జనలు చేసుకుంది. తర్వాత ఓ నిర్ణయాని కొచ్చింది. మనుషుల కంటపడకుండా ఈ దీవిలో ఎక్కడైనా కొండ గుహల్లాంటి ప్రదేశం ఉందేమో వెతుక్కోవాలి! ఈ రాత్రికి అక్కడ కాలక్షేపంచేసి ఉదయమే యీ దీవి వాసులు ఎటువంటివారో, వాళ్ళవల్ల తనకేదైనా ఉపకారం జరుగుతుందేమో చూడాలి!

అర్చనకు తన పరిస్థితికి తనమీదే జాలేసింది. ఈ గుక్కెడు ప్రాణం కోసం యెంత తాపత్రయపడవలసి వస్తోంది? ఆమె తనకోసం బాధపడటంలేదు. తనని నమ్ముకున్నవాళ్ళ కోసం. తనని ప్రేమించే తనవాళ్ళకోసం, తను బతికుండాలి. ఆమె మనసులో ముందుగా రాజేష్ మెదిలాడు. తర్వాత అమ్మ, నాన్న, చెల్లి, తమ్ముడు వరసగా వచ్చి నిల్చున్నారు.

రాజేష్! అతనెలా వున్నాడో? ఎక్కడున్నాడో? తను మళ్ళీ అతన్ని చూడగలదా? కలుసుకోగలదా? ఎక్కడ? ఎప్పుడు? అదో తీరని కల తనకి! ఈ కల నిజం చెయ్యి భగవాన్!

ఆటవికులు ఇల్లు కట్టుకుంటున్నవాళ్ళు కూడా గుంపులో చేరారు. తాగుతున్నారు. ఆ జంతుమాంసం ఇష్టమొచ్చినట్టు నములుతున్నారు. కొందరయితే సరదాగా నృత్యం చేస్తు

న్నారు. రాను రాను పరిస్థితి విషమిస్తున్నట్టు అర్థం చేసుకుంది అర్చన.

ఇక తనక్కడ నిలవకూడదు. సురక్షిత ప్రాంతాన్ని వెతుక్కోవాలి.

ఆమె ముందుకు కదిలింది. చంద్రుడి గుడ్డి వెల్తురే తనకిప్పుడు దారి చూపాలి! కొంతదూరం వరకు కట్టె సెగళ్ళ వెల్తురు కనిపిస్తోంది. దూరమయ్యేకొద్దీ ఆ వెల్తురు తగ్గి చంద్రుడి వెలుగులోనే దారి చూసుకుంటూ నడవాల్సి వస్తోంది.

అర్చన చెట్లు పుట్టలు దాటింది. దూరంగా ఏవో పర్వత శ్రేణుల్లా కనిపిస్తున్నాయి. అక్కడ తనకేదైనా సురక్షిత ప్రదేశం దొరక్కపోదా? ఆమెలో మొండి ధైర్యం వచ్చేస్తోంది. అక్కడ పురుగు పుట్రా వుంటాయనిగాని, క్రూర మృగాలేవైనా గుహల్లో విశ్రాంతి తీసుకుంటూ వుంటాయనిగాని వెనుదీయటంలేదు. సరాసరి నడచి కొండ గుహలవైపు సాగిపోయింది.

అక్కడ అడుగు జాడలు కనిపిస్తున్నాయి యిసుకలో. అంటే మనుషులు తిరుగాడే ప్రాంతమే! ఫరవాలేదు, మనుషులు తిరిగే ప్రాంతంలో క్రూరమృగాలుండటానికి అవకాశాలు తక్కువ!

అర్చన ఆ కొండల నడుమ వెడల్పాటి గుహ ఉండటం చూపింది. అక్కడ లోపల నుండి ఏదో వెలుగు బయటికి ప్రసరిస్తోంది.

లోపలికి వెళ్ళవచ్చునా లేదా అని ఓ క్షణం తటపటాయించింది. ఆ తర్వాత లోపలికి అడుగు వెయ్యబోయి చటుక్కున ఆగిపోయింది. లోపల్నుండి ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది.

చటుక్కున పక్కనున్న బండలచాటుకు తప్పుకుంది. లోపల్నుండి కర్రను నేలకు తాకిస్తూ ఓ ముసలి స్త్రీ బయటి కొచ్చింది. ఆమె ఒంటిపై పైనుండి కిందిదాకా ఎలాంటి ఆచ్ఛాదనా లేదు. ఒంటినిండా సింధూరమో, కుంకుమో ఆపాదమస్తకం పూసుకుంది. నుదుటిమీద పొడవుగా సింధూరం బొట్టు పెట్టుకుంది. కర్రసాయంతో నడుస్తూ బయటికొచ్చింది.

ఆ మసక వెలుర్లో ఆమెని చూసి నిర్ఘాంతపోయింది అర్చన. ఈమె ఎవరో దీపీ ఉపాసకురాలిలా వుందే! ఈ సమయంలో ఈ గుహలో ఏం చేస్తోంది?

ఆమె సరాసరి నడుచుకుంటూ గూడెం వైపు, తను యిందాక వచ్చినవైపు—సాగిపోతోంది. ఆమెకు దారి చిరపరచితంలా వుంది. ఎటూ చూడకుండా చాలా సాఫీగా నిటారుగా వెళ్ళిపోతోంది.

అర్చన కొద్దిక్షణాలు ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఉండి పోయించి. తర్వాత తను లోపలికి వెళ్ళి ఆ రాత్రి తను గటపటానికి వీలుగా వుంటుందేమో చూడాలని ఆమె అను కొంటూ నిల్చుండిపోయింది

లోపల ఏ దేవత వుంది? ఏమైనా జంతుబలులు అలాంటి నైవేద్యాలు స్వీకరించే దేవతా? లేక కొండదేవత పేరున కొలిచే కాళీమాత వంటిదా? తను లోపలికి వెళ్ళాలా, మానాలా?

అయిదు నిమిషాల సందిగ్ధ పరిస్థితి తర్వాత లోపలికి వెళ్ళటానికే నిర్ణయించుకున్నది అర్చన.

చుట్టూ చూసింది. ఎవరైనా యింకా గుహకు వచ్చే వాళ్ళున్నారేమోనని పరీక్షగా కళ్ళు చీకట్లో గుచ్చి గుచ్చి చూసింది. అలాంటి సూచనలేం కనిపించలేదు. ధైర్యం

చిక్కబట్టుకుని లోనికి అడుగువేసింది. లోపల చాలా నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దం భయాన్ని పుట్టిస్తోంది. అయినా యిక వెనుదీయదలచుకోలేదామె.

వెలుగు వస్తున్న వైపు అడుగులు వేసింది.

లోనికి అడుగు పెడుతూనే గుండె ఝల్లుమనగా చటుక్కున ఆగిపోయింది అర్చన.

లోపల సిలువెత్తు దేవీ విగ్రహం, నాలుక భయంకరంగా బయటికి చాచుకుని నిల్చుంది. ఆమెకు ఆపాద మస్తకం ఎర్రటి సింధూరం పూశారు. ఆ దీపపు వెల్తుర్లో మరింత భయంకరమైన ఎర్రదనం కనిపిస్తోంది. ఆమె పాదాలచెంత అరటి దొన్నెల్లో ఏదో నారతో చేసిన ఒత్తులు వెలుగుతున్నాయి. దాంట్లో పోసిన ద్రవం ఏదో అది కూడా ఎర్రగా వున్నది.

వీళ్ళకి చమురుపోసి దీపం వెలిగించటం తెలుసా? అయితే ఆ దొన్నలోనిది ఏ చమురు? ఆమెకు అంతుబట్ట లేదు.

విగ్రహానికి ఓ పక్కగా పెద్ద మానుమొద్దు నిలబెట్టి వున్నది. దానికి తాళ్ళు చుట్టబడి వున్నాయి. పక్కగా జంతువుల్ని నరకటానికి వీలుగా మధ్య శిల వుంది. అంటే యీమెకు జంతుబలులు నైవేద్యంగా సమర్పిస్తారన్న మాట!

మరి, ఆ నిలువుగా నిలబెట్టిన చెట్టుమొద్దు, దానికి తాళ్ళు దేనికి? నరబలికోసం కాదుకదా!

అర్చన గుండె పీచుమన్నది. ఆ ఆలోచనే భయంకరంగా తోచింది. ఆ మొద్దుమీది నుండి దృష్టి మరల్చుకున్నది.

విగ్రహం కాళ్ళచెంత పొడవాటి కత్తి వున్నది. దాని

పదును చీకట్లో కూడా తెలుస్తోంది.

విగ్రహానికి చుట్టూ చిందిన రక్తం! జంతువులదో, మనుషులదో! ఆ ప్రాంతాల ఓ విధమైన చెడువాసన ఆమె నాసికాపుటాలకు తాకింది.

ఇలాంటి చోటనా తను తల దాచుకోవాలనుకొన్నది? ఆమెకు తన ఆలోచన తనకే వింతగా అనిపించింది.

కాని గత్యంతరం లేదు. తెల్లవారేవరకు యెక్కడో చోట ప్రాణాన్ని కాపాడుకోవాలి. అది బయట ఎక్కడో అయితే ప్రాణానికి గ్యారంటీ లేదు. భయంకరంగా వున్నా, జుగుప్స కలిగినా, అసహ్యంవేసినా, దుర్భరంగా వున్నా యీ గుహలోనే తనకి సరైన రక్షణ దొరుకుతుంది— వుదయం లేచీ లేవగానే యిట్నుంచి యిటే యీ దీవిని వదిలేసి పోవాలి. అంతే. అంతకు మించి తను చెయ్య గలిగిందేమీ లేదు.

ఆ రాత్రంతా ఆమెకు నిద్ర లేదు, కావాలనే నిద్ర పోలేదు. ఒకటి రెండుసార్లు కాస్త నిద్రమత్తుతో శరీరం తూగినా కంట్రోల్ చేసుకుంది.

తెల్లవారటానికి ముందే గుహ నుండి బయటకు వచ్చే సింది. గుహ పక్కగా తీరం అంచు కనబడుతోంది. అంటే సముద్రంలోకి వెళ్ళటానికి మార్గం కనిపించిందన్న మాట!

అక్కడ యేదో కొలనులాంటి నీటి వనరు కనిపించింది. ఆ నీళ్ళతో మొహం కడుక్కొంది. ఎన్నాళ్ళయిందో స్నానం చేసి! తనకి రోజూ వుప్పునీళ్ళ స్నానమే! సముద్ర స్నానం! నవ్వుకుందామె.

అప్పటికి పూర్తిగా వెలుగొచ్చేసింది. సూర్యుడింకా వుదయించలేదు. అసలిక్కడ సూర్యుడు వుదయిస్తాడా?

అపరాధ పరిశోధన పోటీ-173

[ఫలితాలు]

డిసెంబరు '82 నెల "అపరాధ పరిశోధన పోటీ—173"కి సరియైన సమాధానాలు:

1. నెల్లూరు.
2. న్యాయస్థానంలో.
3. లంచం.
4. కలర్ టి. వి.
5. డబ్బు.

పై జవాబుల ప్రకారం ఇద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి మార్చి '83 నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీమతి బి. ఎస్. కుమారి,
C/O బి. అప్పారావు,
పబ్లిక్ రిలేషన్స్ ఇన్‌స్పెక్టర్ (పోస్టల్),
రాజమండ్రి—533103.

(2) శ్రీ జి. మురళీకృష్ణ,
శ్రీ వరలక్ష్మి జనరల్ స్టోర్స్,
కోట గుమ్మం వద్ద,
పిఠాపురం—533450.
(తూ. గో. జిల్లా.)

చాలా గమ్మత్తయిన ప్రదేశం! ఇలాంటి దీవులుంటాయని తను చదువుకోవటమే గాని ఎన్నడూ చూడలేదు. ఇప్పుడు అనుకోకుండా తన కీ చేదు అనుభవం!

తీరం బాగా దగ్గరయింది.

చుట్టూ పరికించి చూసింది అర్చన.

దూరంగా గూడెంలో పొగ ఆకాశంలోకి లేస్తోంది. అంటే ఆటవికులు మేల్కొన్నారన్న మాట! వాళ్ళ ఎవరి కళ్ళకూ కనబడకుండా యిక్కడి నుంచి తప్పించుకోవాలి.

ఏదో చప్పుడయితే చటుక్కున తలతిప్పి చూసింది అర్చన. ఆశ్చర్యంతోను, భయంతోను, గగుర్పాటుతోను ఆమె వొళ్ళు జలదరించింది. కళ్ళు పెద్దవయ్యాయి.

అక్కడ ఓ వింత మృగం యేదో జంతువుని చంపి తింటోంది. అంత వుదయమే అది జంతువును చంపి నందుకు కాదు, దాన్ని తింటున్నందుకూ కాదు! దాని ఆకారం చూసి ఆమె భయంతో బిగుసుకుపోయింది.

ఆ జంతువు చూడటానికి ఖడ్గమృగంలా వుంది. కాని, ఖడ్గమృగం కాదు. ఖడ్గమృగం కొమ్ముల్లాంటి పెద్ద కోరలు రెండున్నాయి. భారీ ఆకారం. పెద్దపులి పంజాలా వున్నాయి కాళ్ళగోళ్ళు! దాని కళ్ళు మండుతున్న సూర్యగోళంలా ఎర్రగా తీక్షణంగా వున్నాయి. దాని ఒంటినిండా సింహపు జూలులా దట్టమైన జూలున్నది.

అది యే క్షణంలోనయినా తనవంక చూస్తుందేమో, తనకీ ఆ జంతువుకు పట్టిన దుర్గతే పడుతుందేమోనని అర్చన భయంతో బిగుసుకుపోయింది.

16

"అమ్మాయి పిక్నిక్‌కి వెళ్ళి వారంరోజులయిపోయి నట్టుంది కదూ!" అన్నాడు పరంధామయ్య లెక్కించు

అపరాధ పరిశోధన పోటీ-175

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-2-83 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఏప్రెల్ '83 నెల సంచికలో ప్రచురిస్తాము. *

(1) గత నెలలో వచ్చిన భూకంపం వల్ల యీ దేశంలో వెయ్యి మందికి పైగా మృతిచెందారు—? (ఉరుగ్వే, ఉ. యెమెన్)

(2) ఎరువులు, మందులు, విత్తనాల ధరలు విపరీతంగా పెంచి వ్యవసాయోత్పత్తులను పడగొట్టుతున్న ప్రభుత్వం రైతుకు పెట్టిన ముద్దుల పేరు—?(అన్నదాత, దేశానికి వెన్నెముక)

(3) మొన్న జరిగిన రాష్ట్రాల శాసన సభల ఎన్నికల ప్రచారంలో ఇవి ఎక్కువగా కనిపించాయి—? (ఘర్షణలు, గర్జనలు)

(4) ఇం. కాం. నాయకులకు తెలిసిందల్లా ఒక్కటే—? (ఇందిర స్తుతి, ప్రజా శ్రేయస్సు)

(5) రోజు రోజుకు వీరిలో నిస్పృహ పెరిగిపోతున్నది-? (మేధావులలో, కష్టజీవులలో)

కుంటూ.

"అవునండి! నాలుగయిదు రోజుల్లో వస్తానని చెప్పి పోయిన పిల్ల—వారమయినా తిరిగి రాలేదేమిటి?" అన్నది సుశీలమ్మ.

"సరదాగా మరో రెండు రోజులుండాలనుకున్నారేమో! మరో రెండురోజులు చూద్దాం."

"ఓసారి దాని స్నేహితురాలి యింట్లో వాకబు చేయ కూడదా? ఆడపిల్లని అసలు గడప దాటనివ్వవద్దని సామెత ఊరికే అన్నారా పెద్దలు?"

"అబ్బబ్బ, నీ నస మొదలయిందా! యిప్పుడేమయిం దని? పరీక్షలయిపోయాక సరదాగా పిక్నిక్ వేసుకున్నారు పిల్లలందరూ కలిపి. ఓ రెండురోజులు అనుకున్న దానికన్న ఎక్కువగా గడపాలనుకుని వుంటారు. దానికింత రాద్ధాంతం దేనికి!"

"బావుందండి. అమ్మాయి రాలేదని గుర్తు చేపింది మీరే, రాద్ధాంతం చేస్తున్నానని నేరం వేసేదీ మీరే! ఎలా చేసినా చెల్లుతుంది మగ మహారాజులకి!"

"కుశాయి విప్పొద్దు. చెప్పు నేనేం చెయ్యాలో?"

"అలా ఊహాగానాలు చేసుకోకపోతే, ఓసారి ఆ గెస్ట్ హౌస్‌కి ఫోన్‌కాల్ బుక్ చెయ్యకూడదా? మన బేబీ అక్కడుంటే ఫోన్ దగ్గరకొచ్చి మాట్లాడమనండి. ఎప్పుడొస్తు న్నారో వివరంగా చెప్పమనండి! మనకీ ఆరాటం, ఆతృత తప్పుతాయి కదూ!"

"నిజమే సుమా! నాకా ఆలోచనే తట్టలేదు....ఆఁ, అన్నట్టు యెక్కడో వున్న సాగరలోయ గెస్టుహౌస్ ఫోన్ నంబరు మనకెలా తెలుస్తుంది?"

"ఎక్చేంజిలో అడగండి."

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీనివల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

"వాళ్ళకయినా లోకల్ నంబర్లు తెలుస్తాయి గాని, బయటి నంబర్లు తెలుస్తాయో లేదో!"

"మీ కన్నీ అనుమానాలే! చూడండి, మీ రెలాగూ యివ్వన్నీ యెంక్వయిరీ చెయ్యలేరు గాని మా ఆనంద్‌ని పిలవండి. ఆ కుర్రాడే చూసుకుంటా డన్నీను" అన్నది సుశీలమ్మ. ఆనంద్ ఆమెకు వరసకు అన్న కొడుకవుతాడు.

"అవును సుమా, అతని సంగతే మర్చిపోయాను. సరే పిలుస్తాను, తక్కిన విషయాలన్నీ నువ్వే మీ మేనల్లుడితో మాట్లాడు!" పరంధామయ్య బయటికి నడిచాడు.

పది నిమిషాల్లో ఆనంద్ అక్కడవాలాడు, బుల్లెట్ మీద.

"ఏమిటత్తయ్యా, యెందుకో అర్జంటుగా రమ్మని ఫోన్ చేశావట?" అనడిగాడు సుశీలమ్మని.

సుశీలమ్మ విషయం చెప్పింది.

"అదేమిటి, అర్చన యింకా తిరిగిరాలేదా? వారం రోజులు దాటిపోయినా యింకా రాలేదా? నే నీసరికి వచ్చి వుంటుంది, వచ్చి విశేషాలు అడగాలనుకుంటున్నాను!?" అన్నాడు ఆనంద్ ఆశ్చర్యంగా.

"ముందు ఫోన్‌చేసి అసలు అక్కడినుంచి బయల్దేరారో లేదో కనుక్కోవోయ్" అన్నాడు పరంధామయ్య లోపలికి అడుగుపెడుతూ.

"సాగరలోయ కదూ అన్నారు?"

"అవును. అక్కడి 'సాగర్ వ్యూ గెస్టుహౌస్'లో వుంటామని చెప్పింది. ఆ గెస్టుహౌస్‌కి ఫోన్‌చేసి కనుక్కుంటే తెలుస్తుంది."

"ఇప్పుడే కనుక్కుంటాను. ఇక్కడ 'టూరిస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్' వాళ్ళ నడిగితే ఆ గెస్టుహౌస్ నంబరు దొరుకుతుంది. కాంటాక్టుచేసి చూస్తాను" వచ్చినంత

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 100-00 లు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—2—'83 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం.డె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు నగదు బహుమతితోపాటు, ఐదు నెలలు పత్రికను కూడా పంపుతాము. ఫలితాలు ఏప్రెల్ '83 నెల సంచికలో చూడండి. ●

డిసెంబరు '82 పోటీ ఫలితాలు

(1) డిసెంబరు' 82 నెల "అపరాధపరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మధువు మత్తులో!
మృత్యువు భయం!!

పంపినవారు: శ్రీమతి డి. పరిమళ, ఎమ్. ఏ., తెలుగు లెక్చరర్, ఆంధ్ర రత్న రోడ్, విజయవాడ—3.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

భయపడకు నేస్తం!
అది అభయ హస్తం!!

పంపినవారు: శ్రీ లింగం శ్రీనివాస్, C/O యల్. కె. మూర్తి, పోలీస్‌స్టేషన్ రోడ్, కృష్ణలంక, విజయవాడ-520013

వేగంగాను బుల్లెట్ మీద దూసుకు పోయాడు ఆనంద్.

"చూశారా, కుర్రాడంటే అలా వుండాలి. లక్షాధికారి బిడ్డ—ఒక్కగా నొక్క కొడుకు మా అన్నయ్యకు. మన బేబీ అదృష్టవంతురాలు!"

"సరే, మేనల్లుడ్ని చూసి మురిసిపోతున్నావు; అల్లుడు కావాలని తాపత్రయపడుతున్నావు. బేబీ యిష్టపడాలి కదా!"

"దాని మొహం, దానికేం తెలుసు? అది నా మాట కాదనదు—అయినా లక్షల ఆస్తి. స్వంతంగా నడుపుకుంటున్న ఆటో మొబైల్ స్పేర్‌స్పార్ట్సు స్టోర్సు—అదే లక్షలు చేస్తుంది—యిన్ని వున్న కుర్రాడ్ని ఏ ఆడపిల్ల వరించదు?"

"అదీ చూద్దాం. అమ్మాయి రానీ...." పరంధామయ్య ఇంకా యేదో అడిగేంతలో బయట బుల్లెట్ ఆగినచప్పుడు.

బాణంలా లోపలికి దూసుకొచ్చాడు ఆనంద్.

"సాగర్ వ్యూ గెస్టుహౌస్‌ని కాంటాక్ట్ చేశాను మామయ్యా! అసలు యీ పదిహేను రోజుల్లోను వైజాగ్ నించి యెవరూ ఆ గెస్టు హౌస్‌లో మకాం చెయ్యలేదట! పోనీ రూంస్ యెవరైనా మగాళ్ళ పేర బుక్ అయివుండొచ్చునని అడిగాను. ఇద్దరమ్మాయిలున్న మిత్రబృందం వచ్చివుంటారని అర్చన, సురేఖల రూపురేఖలు వర్ణించాను. రిసెప్షనిస్టు చాలా స్పష్టంగా చెప్పాడు. ఈ పదిరోజుల్లోను సాగర్ వ్యూ గెస్టుహౌస్‌లో రూంస్ తీసుకున్న వాళ్ళు అయిదుగురు మాత్రమే! ఒక్కరు కూడా విశాఖ నుండి వచ్చినవాళ్ళు లేరు. ఎస్టీడీ ద్వారా కాంటాక్ట్ చేశాను. వెంటనే లైన్ దొరికింది" చెప్పాడు ఆనంద్.

సుశీలమ్మ "అయితే అమ్మాయి ఏమయినట్టు?" అన్నది కంగారుగా. ఈ వార్త ఆమె ఎదురుచూడనిది! నీరసంగా

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 53: ఆదెయ్య, శరభయ్యల మధ్య ఆస్తి విషయమై కోర్టులో దావా నడుస్తూంది. అదే సమయంలో ఇద్దరూ ఒక ఒప్పందానికి రావటానికి ఇంటి దగ్గర ప్రయత్నాలు జరుగుతున్నాయి.

చివరకు కోర్టు ఆదెయ్య క్లెయిమ్‌ను కొట్టివేసింది. కాని ఆ సంగతి తెలియని శరభయ్య ఆస్తిలో మూడవ వంతు ఆదెయ్యకు ఇవ్వటానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు.

అగ్రిమెంట్ వ్రాసుకున్న తర్వాత, ఆదెయ్యకు ముందుగా తెలిసే తనను మోసం చేశాడని, అగ్రిమెంట్‌ను అమలుపర్చటానికి నిరాకరించాడు శరభయ్య. అగ్రిమెంట్‌ను అమలు పరచమని కోర్టుకెక్కాడు ఆదెయ్య.

మీ తీర్పు ఏమిటి? అగ్రిమెంట్ అమలు జరపాలా? లేదా?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-2-'83 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు ఏప్రెల్ '83 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 51 (తీర్పు)

శంకరయ్య డబ్బు చెల్లించాలి.

రామయ్య చెల్లించవలసిన అప్పును చెంగయ్య రద్దు చేయలేదు. ఆర్డినెన్సువల్ల రామయ్య అప్పు చెల్లించవలసిన అవసరం తీరిపోయింది. కాని శంకరయ్య పూచీకత్తు రద్దు కాలేదు. కనుక శంకరయ్యే ఆ డబ్బు చెల్లించాల్సిందే.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీ ఎమ్. ప్రభాకరరావు, 6/61, శివాజి నగర్, స్టోన్ హౌస్ పేట, నెల్లూరు-524002.

నించున్న చోటే కూర్చుండిపోయింది.

పరంధామయ్య "సరిగ్గా అడిగావా? పోనీ ఆ పక్కనే మరో గెస్టుహౌస్‌లో దేన్లోనయినా దిగారేమో?" అన్నాడు.

"సాగరలోయ దగ్గిర మరో గెస్టుహౌస్ యేదీలేదు మామయ్యా! ఆర్నెళ్ళ క్రితం నేను, మా ఫ్రెండ్స్ వెళ్ళి వచ్చాముకదా! అర్చన వివరాలడిగితే చెప్పానుకూడా. నేను చెప్పాకనే ఆమెకు సాగరలోయచూడాలనే ఆసక్తి పుట్టింది!"

"మరయితే యిప్పు డెలా? ఆఁ....అమ్మాయితో బాటు యింకా వెళ్ళినవాళ్ళున్నారు. వాళ్ళంతా తిరిగొచ్చారో లేదో యెంక్వయిరీ చేసిరా అబ్బాయ్! సురేఖ తమ్ముడికి తెలుసు వివరాలు. ఓ క్షణం కాస్త అటు వెళ్ళి అడిగిచూడు" సుశీ లమ్మ గొంతు పెగల్చుకుని అన్నది.

"నువ్వనవసరంగా వర్రీకాకు అత్తయ్యా! అర్చనని క్షేమంగా తీసుకొచ్చే భారం నాది! నిశ్చింతగా వుండు" అంటూ నాలుగడుగుల్లో బయటికొచ్చి బుల్లెట్ స్టార్టుచేసి ముందుకు వురికించాడు.

ఓ గంట తర్వాత ఆనంద్ మళ్ళీ వచ్చాడు.

"అర్చనతోబాటు మరో ఏడుగురు బయల్దేరారని తెలిసింది. మొత్తం ఎనమండుగురు వినోద్ అనబడే స్నేహితుడి జీప్‌లో రామకృష్ణా బీచ్‌నుంచి బయల్దేరారు. ఇంత వరకు తక్కిన స్నేహితులు కూడా యెవరూ రాలేదు. వినోద్ నాన్నగారు కూడా కంగారుపడుతున్నారు. జీప్‌తో ఆయనకు పని కూడా వుందట!" (ఇంకా వుంది)

Edited and Published by S. Damodar Reddy
3-4-554 Narayanaguda, Hyderabad-500 019
and Printed at Kranti Press, Madras-600 001.